ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
29-12-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 328 పేజీలు: 8+16 వెల: 6.50
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

నేటి మీ కపిల్‌చిట్స్ తో సభ్యత్వం ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
కపిల్ చిట్స్
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం





# ఏ సవాళ్లకైనా నేవీ రెడీ

## ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లో రాష్ట్రపతి ప్రయాణం
## చరిత్ర సృష్టించిన ద్రౌపది ముర్ము
### జలాంతర్గామిలో ప్రయాణించిన రెండో రాష్ట్రపతిగా రికార్డు

**బెంగళూరు, డిసెంబరు 28:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పశ్చిమ సముద్ర తీరంలో ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ జలాంతర్గామిలో ప్రయాణించారు. నావికాదళ ప్రధానాధికారి అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి కూడా ప్రయాణించారు. ఆదివారం కర్ణాటకలోని కార్వార్ నావల్ హార్బర్‌లో జలాంతర్గామిని ఎక్కారు. రెండు గంటలకు పైగా ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లో ప్రయాణించారు. కల్వరి-క్లాస్ సబ్‌మెరైన్ అయిన ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లో జలాంతర్గామి సిబ్బందితో సంభాషించారు. నావికాదళం కార్యాచరణ ప్రదర్శనలను వీక్షించారు. >>2

# 'నీటి' సెగలు!
## మంత్రి ఉత్తమ్‌తో సుదీర్ఘంగా చర్చించిన సిఎం రేవంత్
## అసెంబ్లీలో లేవనెత్తే అంశాలపై ప్రభుత్వ వ్యూహం సిద్ధం




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్28:** తెలంగాణ అర్జెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్రెడ్డి ఆదివారం సాయంత్రం నీటిపారుదల శాఖపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉన్నత అధికారులు పాల్గొన్నారు. నదీ జలాల పంపకం, ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై చర్చ జరిగినట్టు సమాచారం. నదీ జలాల్లో తెలంగాణ వాటా, ఏపీతో ఉన్న వివాదాలు, బీఆర్ఎస్ హయాంలో అనుసరించిన విధానాలు, తీసుకున్న నిర్ణయాలపై సీఎం అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ముఖ్యంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. సమావేశాల్లో ఈ ప్రాజెక్టు అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉండటంతో, ప్రాజెక్టు ప్రతిపాదన నుంచి ఇప్పటివరకు జరిగిన పరిణామాలు, గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, పనుల పురోగతి, గత రెండేళ్లుగా జరిగిన పనులపై పూర్తి సమాచారం సేకరించారు. అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తే అంశాలపై వ్యూహం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.సాగునీటి ప్రాజెక్టులపై గురువారం ప్రజాభవన్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇవ్వనున్న పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు సంబంధించి కూడా >>2



# గరంగరం అసెంబ్లీ!
## నేటి నుంచి శీతాకాల సమావేశాలు
## సభ ఆవరణలో ధర్నాలు జరిగే అవకాశం
## భారీ బందోబస్తు ఏర్పాట్లు
## కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి అమీతుమీకి సిద్ధం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్28:** అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈసారి అసెంబ్లీ శీతాకాల సమావేశాలైనా వాడి వేడిగా జరిగే అవకాశం ఉంది, ఈసారి సెషన్‌లో కృష్ణా,గోదావరి జలాలపై చర్చ చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్న నేపథ్యంలో విపక్షమైన బిఆర్ఎస్ చాలా బలంగా వాదనలు చేసేందుకు సన్నద్ధమైంది. ఈ నేపథ్యంలో ఈసారి అసెంబ్లీ సమావేశాల్లో యుద్ధ వాతావరణమే నెలకొన నుంది.అధికార పక్షం,విపక్షం అమీతుమీకి సిద్ధమయ్యాయి. పైగా ఈసారి చర్చల్లో పాల్గొనేందుకు బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావు సోమవారం అసెంబ్లీకి చేరుకుంటున్నారు. శాసనమండలి, అసెంబ్లీ సమావేశాలు తొలిరోజు ఉదయ 10-30 గంటలకు విడివిడిగా సమావేశం కానున్నాయి. ఉదయం సభలు ప్రారంభం కాగానే దివంగత మాజీ ఎమ్మెల్సీలు, దివంగత మాజీ ఎమ్మెల్యేలకు సంతాపాలు ఉంటాయి. పలు బిల్లులను ప్రవేశపెట్టి వాయిదా వేస్తారు. అనంతరం మండలిలోనూ, అసెంబ్లీలోనూ బిఏసి సమావేశాలు జరుగుతాయి. ఈ బిఏసీ సమావేశాల్లో చర్చించే అజెండాతో పాటు సమావేశాలు ఎన్నిరోజులు నిర్వహించాలనే విషయంపై నిర్ణయం తీసుకుంటారు. డిసెంబర్ 30, 31,జనవరి 1న అసెంబ్లీ,శాసనమండలి సమావేశాలకు సెలవులు >>2


అసెంబ్లీ నిర్వహణ ఏర్పాట్లపై ఆదివారం జరిగిన సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా తదితరులు



# కెసిఆర్ చర్చలో పాల్గొంటారా? వెళ్లిపోతారా?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్ 28:** అసెంబ్లీకి హాజరు కావాలని బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ నిర్ణయించుకున్నట్లుసమాచారం. ఈనెల 29వ తేదీన >>2

# 1 నుంచి నుమాయిష్
## 85వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకు రంగం సిద్ధం
## ఎగ్జిబిషన్‌ను ప్రారంభించనున్న డిసిఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి
## మీడియాతో మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్ (గోషామహల్), డిసెంబర్ 28ప్రభాతవార్త:** జనవరి మాసం వస్తుదంటే చాలు నగరప్రజలకు అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన(ఎగ్జిబిషన్)గుర్తుకు వస్తుంది. ప్రతి ఏడు మాదిరిగానే ఈ యేడు కూడా ఎగ్జిబిషన్‌ను ఘనంగా నిర వ్వహించేందుకు సొసైటి నాయకులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. జనవరి ఒకటవ తేదినుంచి నలభై ఐదు రోజుల పాటు నగర ప్రజలను అలరించేందుకుగాను ఎగ్జిబిషన్ సర్వాంగులతో తీర్చిదిద్దుతున్నారు.85వసంతాల అఖిలభారత ఎగ్జిబిషన్‌ను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క,సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డిల చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు తెలంగాణ ఐ.టి.శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి,ఎగ్జిబిషన్ సొసైటి అధ్యక్షులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు.నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలోని గాంధీ సెంటనరీ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎగ్జిబిషన్ కార్యదర్శి బి.ఎన్.రాజేశ్వర్,ఉపాధ్యక్షులు ఎస్.సుఖేష్‌రెడ్డి,సంయుక్త కార్యదర్శి టి.చంద్రశేఖర్,కోశాధికారి ఎన్.సంజీవ్‌కుమార్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ ఎగ్జిబిషన్ (నుమాయిష్)వివిధ పారిశ్రామిక ఉత్పత్తులకు సంబంధించిన స్టాళ్లు దేశ నలుమూలలో ఉన్న పరిశ్రమల వారు తమ ఉత్పత్తులను ప్రదర్శించుకునేందుకుగాను స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.తదితర ఉత్పత్తుల ప్రదర్శన విక్రయాలను చేపట్టే ందుకుగాను నిర్వాహకులు చర్యలు చేపడుతున్నారు.85 సంవత్సరాలుగా జంట నగరాల ప్రజలను అలరిస్తున్న ఎగ్జిబిషన్‌ను ఘనంగా నిర్వహించేందుకు సందర్శకులకు పలు సౌకర్యాలు కలి ్పంచేందుకుగానే ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు.జనవరి 1వ తేదిన 85వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనలో తమ స్టాళ్లను సిద్దంగా చేసేందుకుగాను ముమ్మరం చేస్తున్నారు.అంతేకాకుండా సొసైటి వారు వ్యాలంటీర్లతో పాటు ప్రైవేట్ సెక్యూర్టీతో ఎగ్జిబిషన్‌ను పర్యవేక్షించడం జరుగుతుందన్నారు.నలభై ఐదు రోజులపాటు ఎగ్జిబిషన్ వద్ద పోలీసు బందో బస్తును ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.మియాపూర్,ఎల్‌బినగర్‌ల నుంచి నడిచే మెట్రో రైల్ అర్ధరాత్రి వరకు ప్రయాణికులకు అందుబాటులోఉంటుందన్నారు.ఎగ్జిబిషన్ సొసైటి ఆద్వర్యంలో 20 విద్యాసంస్థలు కొనసాగుతున్నట్లు చెప్పారు. సామాజిక దృక్పథంతో ముందుకు సాగుతూ 2వేల మందికి ఉపాధి కలి ్పస్తున్నట్లు చెప్పారు.30వేల మంది విద్యార్ధీనులకు విద్య భోదనలను అందిస్తున్నట్లు చెప్పారు.తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యాపారులకు,పెట్టుబడిదారులకు ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలను అందిస్తామన్నారు.వృద్దులు నడవ లేని వారికి ఎగ్జిబిషన్ లోపల ఉదయం 11 గంటల నుంచి >>2



## సిగాచి ఎండి అమిత్ రాజ్ అరెస్టు
### జ్యుడీషియల్ కస్టడీ విధించిన కోర్టు
### సంగారెడ్డి ఫ్యాక్టరీ అగ్నిప్రమాదం కేసు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్28:** సంగారెడ్డి జిల్లాలో 54 మంది కార్మికుల ప్రాణాలు బలిగొన్న భారీ అగ్నిప్రమాదం జరిగిన ఆరు నెలల తర్వాత, సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అమిత్ రాజ్ సిన్హాను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన్ను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడీషియల్ కస్టడీకి >>2


# నాడు ఇందిర పేరు వింటే గడగడలాడిన పాక్
## ఇప్పుడు పాక్‌కు భయపడుతున్న మోడీ
## నెహ్రూ దార్శనికతతోనే దేశంలో హరిత, పారిశ్రామిక విప్లవాలు
## కాంగ్రెస్ 141వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పిసిసి చీఫ్ మహేష్ గౌడ్



ఆదివారం గాంధీభవన్‌లో పార్టీ ఆవిర్భావ వేడుకల్లో మాట్లాడుతున్న పిసిసి చీఫ్ మహేష్ కుమార్. చిత్రంలో మంత్రి అజారుద్దీన్

**హైదరాబాద్, డిసెంబరు 28,ప్రభాతవార్త:** పాకిస్థాన్‌కు ఇందిరాగాంధీ అంటే గడగడ లాడే పరిస్థితి ఉండేదికానీ ఈనాడు మోడీ మాత్రం పాకిస్థాన్ కు భయ పడుతున్నాడనీ కాంగ్రెస్ ప్రస్తుత పరిస్థితిల్లో కేంద్రంల అధికారంలో ఉండి ఉంటే బలూచిస్తాన్,సింధూ దేశాలుగా ఆ దేశం విడిపోయేదని టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో 141వ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు,కాంగ్రెస్ సేవా దళ్ 102 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్లోగన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత పురాతన పార్టీ కాంగ్రెస్‌అంతే కాదు లౌకికభావాలు, పౌరహక్కులు, సామాజిక న్యాయం సుస్థిర ఆర్థిక ఆభివృద్ధి అనే ప్రధాన సైదాంతిక భూమికతో పేదరిక నిర్మూలనే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తుందని తెలిపారు. స్వాతంత్ర సమపార్జన కోసం ఏర్పాటైన కాంగ్రెస్ పార్టీ స్వేచ్ఛకోసం బ్రిటీష్ సామ్రాజ్యంతోనే పోరాటం చేసిందని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అనేక మంది మహనీయుల సంకల్పంతో వలసపాలనపై పోరాటం కోసం ఏర్పాటు చేయడమే కాకుండా స్వతంత్రం వచ్చాక దేశ నిర్మాణంలో కూడా అంతే అంకిత భావంతో పనిచేసిందిన తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేయని శక్తులు ఇవ్వాల అధికార దాహంతో రాజ్యమేలుతున్నారని ఆవేదన చెందారు. నెహ్రూ ప్రధాని కాకుండా ఉంది ఉంటే ఈ దేశం ఏమయ్యేదో ఊహించలేమనీ అన్నారు. నెహ్రూ మిశ్రమ ఆర్థిక వ్యవస్థ, సామ్యవాదరీతి సమాజస్థాపన అనే పాలన లక్ష్యంతో గణనీయమైన పాత్ర పోషించారని అంతేకాదు పంచవర్షప్రణాళికలతో హరితవిప్లవం, పారిశ్రామిక విప్లవం తీసుకొని రావడంతో ఈ స్థాయికి దేశం ఎదిగిందని ఎదిగిందని అన్నారు. గుండు సూది తయారు చెయ్యలేని స్థితి నుంచి రాకెట్ ప్రయోగాల వరకు ఎదిగింది అంటే అది నెహ్రూ వేసిన పునాదులు కారణం అన్నారు. దేశ వ్యాప్తంగా సామాన్యుల అందుబాటులోకి బ్యాకింగ్ వ్యవస్థ రావాలని ఇందిరా గాంధీ బ్యాంకుల జాతీయాకరణ చేశారని ఆయన వివరించారు. నవోదయ విద్యాలయంతో దేశ >>2

## సంక్రాంతి తర్వాత ఇంటర్ ప్రీ ఫైనల్ పరీక్షలు

**హైదరాబాద్, ప్రభాతవార్త, డిసెంబరు 28:** తెలంగాణ రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు సంక్రాంతి సెలవుల అనంతరం నుంచి ఒకదాని తరువాత ఒక పరీక్షలు జరగనున్నాయి. సంక్రాంతి సెలవులు ముగిసిన వెంటనే జనవరి 19 నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఆ తరువాత ఫిబ్రవరి 1 నుంచి 21 వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. అవి ముగిసిన 4 రోజుల్లోపే వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభమవుతాయి. >>2





## ఫిల్మ్‌ఛాంబర్ అధ్యక్షుడుగా డి సురేష్‌బాబు
### ప్రొగ్రెసివ్ ప్యానల్‌కే మెజార్టీ
### ఓటు వేయని పలువురు హీరోలు

**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** హైదరాబాద్ సినీ వర్గాల్లో ఉత్కంఠ రేపిన ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల ఫలితాల్లో బడా నిర్మాతల ప్యానల్‌కే మెజార్టీ లభించింది. ఆదివారం ఉదయం జరిగిన ఎన్నికల తదుపరి ఓట్ల లెక్కింపు రాత్రికి పూర్తయింది. నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు నేతృత్వంలోని ప్రోగ్రెసివ్ ప్యానల్‌కే అత్యధిక మెజార్టీ వచ్చింది. నట్టి కమార్‌కు చెందిన మన ప్యానల్ వెనకబడిపోయింది. ప్రోగ్రెసివ్ ప్యానెల్ తరఫున డి.సురేష్ బాబు, మన ప్యానెల్ మద్దతుతో నట్టి కుమార్ అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న తరుణంలో ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కౌంటింగ్ అనంతరం వెల్లడైన ఫలితాల ప్రకారం ఓవరాల్ గా 44 ఈసి మెంబర్స్ లో ప్రోగ్రెసివ్ ప్యానెల్ కు 28 ఓట్లు, మన ప్యానెల్ కు 15 ఓట్లు వచ్చాయి. ఛాంబర్ అధ్యక్ష ఉపాధ్యక్ష సెక్రటరీ పదవులన్నీ ప్రోగ్రెసివ్ ప్యానెల్ పరిధిలోనే ఉండనున్నాయి. ప్రొడ్యూసర్స్ సెక్టార్‌లో ప్రోగ్రెసివ్ ప్యానల్ నుంచి 5 గురు, మన ప్యానెల్ నుంచి 7 గురు గెలుపొందారు. స్టూడియో సెక్టార్‌లో మన ప్యానెల్ నుంచి 3మంది, ప్రోగ్రెసివ్ ప్యానెల్ >>2




# నరసాపురం 'అల్లిక' జిగిబిగి
### జిఐ ట్యాగ్ ఉన్న లేస్ అది..
### తయారీలో లక్షమంది నిమగ్నం
### మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, డిసెంబరు 28:** ప్రధాని మోడీ ఆదివారం తన మన్ కీ బాత్ ప్రసంగంలో ఏపీలోని నరసాపురం ప్రస్తావన తీసుకొచ్చారు. దేశంలోని సంప్రదాయ కళల అంశంపై మాట్లాడుతూ లేస్(అల్లికలు) గురించి ప్రస్తావించారు. ఈ కళ తరతరాలుగా మహిళల చేతుల్లో ఉందని చెప్పారు. నరసాపురం లేస్‌కు జీఐ ట్యాగ్ ఉందని తెలిపారు. కాగా సుమారు 500 రకాల ఉత్పత్తుల తయారీలో లక్ష మంది మహిళలు భాగమవుతున్నారు. హ్యాంగింగ్స్, డోర్ కర్టెన్లు, సోఫా కవర్లు, కిడ్స్‌వేర్‌లో ఈ లేస్‌ను వినియోగిస్తారు. ప్రధాని తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ... "మన సాంప్రదాయ కళలు సమాజాన్ని బలోపేతం చేస్తున్నాయి. ప్రజల ఆర్థిక ప్రగతికి ఒక ప్రధాన సాధనంగా మారుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని నరసాపురం జిల్లాకు చెందిన లేస్(అల్లికలు) కళ దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతోంది. ఈ లేస్ కళ తరతరాలుగా మహిళల చేతుల్లోనే ఉంది. దేశంలోని మహిళలు దీనిని >>2



ఢిల్లీలో ఆదివారం ఏఐసిసి కార్యాలయంలో కాంగ్రెస్‌పార్టీ అవతరణ వేడుకల్లో పాల్గొన్న పార్టీ అధ్యక్షుడు ఖర్గే, అగ్ర నేత సోనియా

## ఫిల్మ్‌ఛాంబర్ అధ్యక్షుడుగా డి సురేష్‌బాబు

>> నుంచి ఒకరు, ఎగ్జిబిటర్స్ సెక్టార్‌లె ప్రోగ్రెసివ్ ప్యానల్ నుంచి 14 మంది, మన ప్యానెల్ నుంచి 2 సభ్యులు, డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ లో మొత్తం 12 ఈసి మెంబర్లకు గాను ప్రోగ్రెసివ్ ప్యానెల్ నుంచి 8 మంది, మన ప్యానెల్ నుంచి 3 సభ్యులు గెలవగా, ఒకటి టై గా నిలిచింది. అంతకు ముందు ఆదివారం ఉదయం ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగింది. చిత్ర పరిశ్రమలోని వివిధ వర్గాల ప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో ఫిల్మ్ నగర్ సందడిగా మారింది. ఈసారి తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఎన్నికల బరిలో రెండు ప్రధాన ప్యానళ్ల మధ్య హోరాహోరీ పోరు నెలకొంది. పరిశ్రమలోని అగ్ర నిర్మాతలంతా ఏకమై ప్రోగ్రెసివ్ ప్యానల్ కింద పోటీలోకి దిగగా, చిన్న నిర్మాతల సమస్యలే ప్రధాన ఎజెండాగా మన ప్యానల్ పోటీ చేసింది. పెద్ద నిర్మాతల ఆధిపత్యం ఒకవైపు, చిన్న సినిమాల మనుగడ కోసం పోరాడుతున్న నిర్మాతలు మరోవైపు నిలవడంతో ఈ ఎన్నికల ఫలితాలు ఇండస్ట్రీలో ఎవరి బలాన్ని చాటుతాయోనన్న ఉదయం నుండి సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఫిల్మ్ ఛాంబర్‌లో మొత్తం 3,355 మంది సభ్యులు ఉండగా, 3287 మందికి ఓటు వేసే అర్హత ఉంది. అయితే 43 శాతం మేర 1,421 ఓట్లు పోలయ్యాయి. ప్రొడ్యూసర్స్ సెక్టార్ నుంచి 809 ఓట్లు, స్టూడియో సెక్టార్ 66, డిస్ట్రిబ్యూటర్స్ సెక్టార్ 375, ఎగ్జిబిటర్స్ సెక్టార్ 172 ఓట్లు పోల్ అయ్యాయి. ఈ ఎన్నికల ద్వారా నూతన అధ్యక్షుడిని, కార్యదర్శిని మరియు 12 మంది ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులను ఎన్నుకోనున్నారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గం 2027 వరకు బాధ్యతల్లో కొనసాగనుంది. పరిశ్రమ సమస్యల పరిష్కారం, థియేటర్ల వ్యవస్థ మరియు నిర్మాణ రంగంలోని సవాళ్లపై ఈ కొత్త కమిటీ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. కాగా ఫిల్మ్ ఛాంబర్ ఎన్నికలను హీరోలు లైట్ తీసుకున్నారు. నిర్మాతలుగా ఉన్న రామ్ చరణ్, కల్యాణ్ రామ్, రానా దగ్గుబాటి, రామ్ పోతినేని, మంచు విష్ణు, మోహన్ బాబు, నాగార్జున తదితరులు ఓటు హక్కు వినియోగించుకోలేదు. నాని, శ్రీవిష్ణు, సందీప్ కిషన్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## 'నీటి' సెగలు!

>> సిఎం వద్ద చర్చ జరిగినట్లు సమాచారం.

**ఒక శక్తిగా 140 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ఆవిర్భావం**

కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా ఓ ఆసక్తికర ట్వీట్ చేసారు. భారత దేశ ప్రజల కోసం ఒక శక్తిగా 140 సంవత్సరాల క్రితం ఇదే రోజున కాంగ్రెస్ ఆవిర్భవించిందని పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించడం నుంచి రాజ్యాంగ నిర్మాణం వరకు, ప్రజాస్వామ్య సంస్థలను ఏర్పాటు చేయడం నుంచి విభిన్న దేశాన్ని ఏకం చేయడం వరకు ఆధునిక భారతదేశంలోని ప్రతి కీలక అధ్యాయాన్ని జాతీయ కాంగ్రెస్ తీర్చిదిద్దిందని కొనియాడారు. జాతీయ కాంగ్రెస్ చరిత్ర అనేది భారత ప్రజాస్వామ్య ప్రస్థానానికి ప్రతిరూపమని సీఎం రేవంత్ అన్నారు. సోనియా గాంధీ నాయకత్వాన్ని స్మరించుకుంటే సేవ, నిబద్ధత, నీతి, విలువలు కనిపిస్తాయని పేర్కొన్నారు. ఆమె నాయకత్వంలోనే తెలంగాణలోని ఒక మారుమూల గ్రామం నుంచి రాజకీయ జీవితం ప్రారంభించిన పీవీ నరసింహారావు దేశ ప్రధానమంత్రిగా ఎదిగారని అన్నారు. అలాగే డాక్టర్ మన్మోహన్ సింగ్ వంటి గొప్ప ఆర్థికవేత్తకు ప్రధానమంత్రి పదవి దక్కేలా సోనియా గాంధీ చేసిన నిర్ణయాన్ని కూడా సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా కొనియాడారు.

## నాడు ఇందిర పేరు వింటే గడగడలాడిన పాక్

>> విద్యావ్యవస్థలో అత్యున్నత ప్రమాణాలు నెలపడమే కాకుండా కంప్యూటర్ వంటిసాంకేతికతను రాజీవ్ గాంధీ దేశానికి పరిచయం చేశారని అన్నారు. పివి నరసింహారావు ఆర్థిక సంస్కరణలతో దేశం ఆర్థికంగా శరవేగంగా దూసుకొని పోతుందని ఆయన విదేశి విధాంగం ఎంతో గొప్పగా ఉండేదని అన్నారు. ఆపరేషన్ కాక్టస్ పేరుతో మాల్దీవుల్లో జరిగిన కుట్రను అణిచివేసిన ఘనత పివి నరసింహారావుదని అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామి పథకం మన్మోహన్‌సింగ్ తీసుకొచ్చి పల్లెలో వలసలు నియంత్రించారని చెప్పారు. యుపిఎ1, యూపిఎ2 పాలనలో దేశాన్ని మరో స్థాయికి తీసుకెళ్లారుఈరోజు మోదీ మాత్రం గాంధీ పేరు తొలగించి పథకాన్ని నీరు గార్చే పని చేస్తున్నారురాజ్యాంగాన్ని నీరు గార్చిప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే పని చేపట్టిందని ఆవేదన చెందారు. కార్పొరేట్ లకు మేలు చేసే విధానాలు తప్ప ప్రజల గురించి మోడీ ప్రభుత్వం అస్సలు ఆలోచన చెయ్యడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో చారిత్రక కుల సర్వే చేశారుఅన్ని వర్గాలకు సరైన ఫలాలు అందాలన్న ఉద్దేశ్యంతోనే కుల సర్వే చేశారని తెలిపారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చెయ్యాలని చూస్తే బిజెపి అడ్డం పడిందని ఆరోపించారు. బిజెపి విధానాలకు రాష్ట్రంలో బిఆర్ ఎస్ వంత పాడుతోందని ఆవేదన చెందారు. 141 వ జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా గాంధీ, నెహ్రూ, పటేల్ విగ్రహాలకు పూలమాల వేసి టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, వివేక్ ఎమ్మెల్సీ వెంకట్, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డి తదితరులు నివాళ్ళు అర్పించారు. గాంధీభవన్‌లో పార్టీ జెండాను మహేష్‌కుమార్ ఆవిష్కరించారు. గాంధీ భవన్ నుంచి సెక్రటేరియట్ నెహ్రూ విగ్రహం వరకు సేవా దళ్ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.

## 1 నుంచి నుమాయిష్

>> మధ్యాహ్నం 3గంటల వరకు వాహనాలతో సందర్శించే అవకాశం కల్పిస్తామన్నారు. నుమాయిస్‌ను దృష్టిలో పెట్టుకుని టిఎస్ ఆర్‌టిసి పలు డిపోలకు చెందిన బస్సులను ప్రత్యేకంగా నడుపుతామన్నారు. సొసైటి సభ్యులు బి.హన్‌మంత్‌రావు అశ్వాక్‌హైదర్, నరోత్తంరెడ్డి, బి.ప్రభాశంకర్, ఎన్.వినయ్‌కుమార్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిగాచి ఎండి అమిత్ రాజ్ అరెస్టు

>> పంపింది. ఈ అరెస్ట్ విషయాన్ని సిగాచి కంపెనీ బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు అధికారికంగా తెలియజేసింది. అగ్నిప్రమాద ఘటనపై జరుగుతున్న విచారణలో భాగంగా శనివారం అమిత్ రాజ్ సిన్హాను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొంది. కంపెనీ కార్యకలాపాలు యథాతథంగా కొనసాగుతాయని, డిప్యూటీ గ్రూప్ సీఈఓ లిజా స్టీఫెన్ చాకో తాత్కాలికంగా బాధ్యతలు చూస్తారని వెల్లడించింది. ఈ ఏడాది జూన్ 30న పశమైలారంలోని సిగాచి పరిశ్రమలో భారీ పేలుడు సంభవించి, పెద్ద ఎత్తున మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో 54 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో 33 మంది గాయపడ్డారు. ఈ ప్లాంట్‌లో టాబ్లెట్లు, క్యాప్సూల్స్‌లో ఉపయోగించే మైక్రోక్రిస్టలైన్ సెల్యులోజ్ పౌడర్‌ను తయారు చేస్తారు. ఈ ఘటనపై పోలీసులు కంపెనీ యాజమాన్యంపై బీఎన్ఎస్ సెక్షన్ 105 కింద కేసు నమోదు చేశారు. అయితే, ఇన్ని రోజులుగా అరెస్టులు జరగకపోవడంపై విమర్శలు వచ్చాయి. ఈ కేసులో దర్యాప్తు జాప్యంపై గత నెలలో తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఓ ప్రజా ప్రయోజన పిటిషన్ (పిల్) విచారణ సందర్భంగా, విచారణాధికారిని కోర్టుకు పిలిపించి కేసుకు సంబంధించిన అన్ని పత్రాలను సమర్పించాలని ఆదేశించింది. హైకోర్టు జోక్యం చేసుకున్న కొద్ది రోజులకే ఈ అరెస్ట్ జరగడం గమనార్హం. మృతుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున పరిహారం చెల్లించడానికి సిగాచి యాజమాన్యం అంగీకరించినట్లు రాష్ట్ర ప్రభుత్వం గతంలో హైకోర్టుకు తెలిపింది.

## నరసాపురం 'అల్లిక' జిగిబిగి

>> ఎంతో ఓపికతో, నిశితమైన శ్రద్ధతో పరిరక్షించారు. నేడు ఈ సంప్రదాయం ఒక కొత్త కోణంలో ముందుకు తీసుకెళ్లబడుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నాబార్డ్ సంయుక్తంగా కళాకారులకు కొత్త డిజైన్లను నేర్పిస్తూ, మెరుగైన నైపుణ్య శిక్షణను అందిస్తూ, వారిని కొత్త మార్కెట్లతో అనుసంధానం చేస్తున్నాయి. నరసాపురం లేస్‌కు జిఐ ట్యాగ్ కూడా లభించింది. నేడు, దీని నుండి 500 కంటే ఎక్కువ ఉత్పత్తులు తయారు చేయబడుతున్నాయి. 250కి పైగా గ్రామాలలో సుమారు 1 లక్ష మంది మహిళలు దీని ద్వారా ఉపాధి పొందుతున్నారు" అని మోడీ ఈ సందర్భంగా వివరించారు.

## వారం - వర్జ్యం

**29-12-2025, సోమవారం**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, పుష్యమాసం, దక్షిణాయణం హేమంత ఋతువు, శుక్లపక్షం**
నవమి ఉ.10.10, పూర్వాషాఢ కార్తె
అశ్వని ఉ.6.04
వర్జ్యం : రా.2.20-రా.3.50
దు.ము.12.33-1.18
2) మ.2.46-3.32
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ప్రజలతో సంబంధాలు మెరుగు పరచుకోవడానికి అవిరళ కృషి చేస్తారు. కీళ్ల బాధలు ఇబ్బంది పెడతాయి.

**వృషభం:** స్త్రీల వలన చిక్కు సమస్యలు ఏర్పడతాయి. ఫలితాలు మాత్రం వెను వెంటనే రావు. క్రయ విక్రయాలకు దూరంగా వుండండి.

**మిథునం:** శత్రువర్గంలోని అనైక్యతను గుర్తించి వారితో ముఖాముఖి పోరాడి లాభపడతారు. ఆకస్మిక ప్రయాణాలు.

**కర్కాటకం:** ఎవ్వరినీ నమ్ముకుండా మీ పనిని మీరే స్వయంగా చేసుకోవడం చెప్పదగినది. దైవానుగ్రహాన్ని ఎంతగానో నమ్ముకుంటారు.

**సింహం:** పని వత్తిడి అధికమవటం వలన క్షణం తీరికలేకుండా శ్రమిస్తారు. స్త్రీలతో విభేదాలు రాకుండా జాగ్రత్తలు పాటించండి.

**కన్య :** పోటీ పరీక్షలలో అతికష్టం మీద విజయం సాధిస్తారు. ఉద్యోగంలో అదనపు బాధ్యతలు పెరుగుతాయి.

**తుల :** పై అధికారులతో మెలుకవగా వ్యవహరించండి. అకాల భోజనం, వాహనాల విషయంలో నిర్లక్ష్యం తగదు.

**వృశ్చికం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. కళారంగంలోని వారికి విదేశీ పర్యటనలు.

**ధనుస్సు:** కుటుంబసభ్యులతో కలిసి దేవాలయ సందర్శనం చేసుకుంటారు. సోదర, సోదరీ వర్గంతో కలిసి ఇష్టాగోష్టి సాగిస్తారు.

**మకరం:** సానుకూలంగా ఆలోచించి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోండి. వాహన సౌఖ్యం.

**కుంభం:** మధ్యవర్తిత్వాలు, పంచాయితీలు లాభించవు. స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండటమే శ్రేయోదాయకం.

**మీనం :** సంఘంలో ఉన్నతమైన వారు మీకు అనుకూలంగా వ్యవహరించడం కొంత ఊరట కలిగించే అంశమవుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# గరంగరం అసెంబ్లీ!

>> ఉండనున్నాయి. మళ్లీ జనవరి 2వ తేదీ నుంచి సమావేశాలు పునఃప్రారంభం కానున్నాయి. తర్వాత 3, 4 రోజుల సమావేశాలు జరుగనున్నాయి. ఈ సమావేశాల్లో గోదావరి, కృష్ణా జలాలపై చర్చకు ప్రభుత్వం సన్నద్ధం కానుంది. ఈ సమావేశాల్లో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేయనున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో పవర్ పాయింట్ ప్రజంటేషన్‌కు ఒక రోజు ముందు జనవరి 1న ప్రజా భవన్‌లో సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అవగాహన కల్పించేందుకు కృష్ణా, గోదావరి జలాలపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయనున్నారు. కాగా అసెంబ్లీ చర్చల్లో పాల్గొనేందుకు ప్రధాన ప్రతిపక్ష నేత కెసిఆర్ అసెంబ్లీకి వస్తున్న నేపథ్యంలో అసెంబ్లీ ఆవరణలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన పోలీస్ అధికారులతో సమావేశం జరిగింది. తర్వాత ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో పాటు అన్ని శాఖల ఉన్నతాధికారులు స్పీకర్, చైర్మన్ సమక్షంలో సమావేశమయ్యారు. ఇదిలా ఉండగా, అసెంబ్లీలో, శాసనమండలిలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సన్నద్ధమయ్యారు. సోమవారం తొలిరోజు సెషన్ తర్వాత బిఆర్‌ఎస్‌ఎల్పీ కెసిఆర్‌తో సమావేశం కానుంది. కాగా, అసెంబ్లీలో జవాబుదారీగా సమాధానాలు ఇచ్చేందుకు మంత్రులందరూ ఎవరికి వారుగా తమ తమ శాఖల ఇన్‌పుట్ మేరకు సన్నద్ధమయ్యారు. ఇదే సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా విపక్షాలకు ధీటైన జవాబు ఇచ్చేందుకు సన్నద్ధమయ్యారు. బిజెపి ఎమ్మెల్యేలు కూడా ఆదివారం సాయంత్రం బిజెఎల్పీ సమావేశం నిర్వహించుకున్నారు. ఎంఐఎం కూడా తమ ఎమ్మెల్యేలతో సమావేశమై అసెంబ్లీలో వ్యవహరించాల్సిన తీరుపై చర్చించుకుంది.

**ఇబ్బందులు లేకుండా పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలి..**

సోమవారం నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ, మండలి సమావేశాల నేపథ్యంలో నిర్వాహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులతో ఆదివారం సాయంత్రం శాసనసభ భవనంలోని కమిటీ హాల్‌లో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, మండలి కార్యదర్శి వి.నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి ఆర్.తిరుపతి. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఢిల్లీ పర్యటనలో ఉండడంతో హాజరైన ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా. డిజిపి శివధర్ రెడ్డి, ఎడిజిపి విజయకుమార్, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్లు విసి సజ్జనార్, అవినాష్ మహంతి, సుధీర్ బాబు, ఇంటెలిజెన్స్ ఐజి కార్తికేయ, అసెంబ్లీ ఛీఫ్ మార్షల్ కర్ణాకర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... సోమవారం నుండి తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు ప్రారంభం అవుతున్నాయి. గత సమావేశాలు సజావుగా జరగడానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, పోలీసు శాఖ, శాసనసభ అధికారులు, సిబ్బంది అందరికీ ధన్యవాదాలు అని తెలిపారు. గతంలో లాగానే ఈ సమావేశాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకారం అందించాలని కోరారు. సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలి.. శాఖలకు సంబంధించిన చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ మంత్రులకు, సభ్యులకు తగిన సమాచారం అందిస్తూ సహకరించాలని సూచించారు. శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరగడానికి పోలీసు శాఖ తరుపున చర్యలు తీసుకోవాలని కోరారు. సభ జరుగుతున్న సమయంలో ధర్నాలు, ఆందోళనలు జరగకుండా ముందస్తుగానే సమాచారం అందుకుని అడ్డుకోవాలి, తద్వారా సమావేశాలు సజావుగా జరుగుతాయన్నారు.

**ప్రశ్నలకు వెంటనే సమాధానం పంపించాలి: మండలి చైర్మన్**

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర శాసన మండలి సమావేశాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పని చేయాలని చెప్పారు. అవసరమైన నోడల్ అధికారులను, లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలి. పెండింగ్‌లో ఉన్న ప్రశ్నలకు వెంటనే సమాధానాలు పంపించాలని కోరారు.. తెలంగాణ పోలీసు దేశంలోనే సమర్థవంతమైనది, మంచి పేరు ఉన్నది. మీ ఆద్వర్యంలో శాసనమండలి సమావేశాలు సజావుగా జరిగే విదంగా సహకరించాలనానరు. ఈ సమావేశాల్లో ధర్నాలకు ఎక్కువగా పిలుపునిచ్చే అవకాశాలు ఉన్నాయి. చలో అసెంబ్లీ కార్యక్రమాలు జరగకుండా చూడాలని చెప్పారు.. సమావేశాలకు హాజరయ్యే మంత్రులు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి చెప్పగా, సభ సజావుగా జరగడానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని అధికారులు తెలిపారు.

**ప్రభుత్వ వైఫల్యాలపై గట్టిగా పోరాడుతాం: బిఆర్‌ఎస్**

రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యాలపై అసెంబ్లీలో బీఆర్ఎస్ గట్టిగా పోరాడుతుందని.. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడతామని బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద స్పష్టం చేశారు. ప్రెస్ మీట్‌లో కేపీ వివేకానంద మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు 420 హామీలపై ప్రభుత్వ దాటవేత ధోరణిని ప్రశ్నిస్తామన్నారు.

గురుకులాల అసమర్థ నిర్వహణను, విద్యార్థుల మరణాలను ప్రస్తావిస్తాం.. ఎవరిని సంప్రదించకుండా జీహెచ్ఎంసీలో 22 మున్సిపాలిటీలను అశాస్త్రీయంగా ఆర్డినెన్స్ తెచ్చి విలీనం చేయడాన్ని గట్టిగా నిలదీస్తామన్నారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలపై ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల వైఖరిని ఎండగడుతాం.. రైతులకు బోనస్ బోగస్ అయిన అంశాన్ని ప్రస్తావిస్తామన్నారు.

యూరియా కొరతపై రైతుల ఆత్మహత్యలపై ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతాం. మెస్సీ తో ఫుట్ బాల్ మ్యాచ్‌కు సింగరేణి సంస్థ నిధుల దుర్వినియోగంపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం.. తూతూ మంత్రంగా ఒకటి రెండు రోజులు అసెంబ్లీ పెడతామంటే ఒప్పుకునేది లేదు.

ప్రజా సమస్యలన్నీ చర్చించేదాకా అసెంబ్లీ సమావేశాలు పెట్టాల్సిందేనన్నారు. కేసీఆర్ ప్రెస్ మీట్ కు సీఎం సహా కాంగ్రెస్ నేతలు గజ గజ వణికి పోతున్నారు .అందుకే పిచ్చి కూతలు కూస్తున్నారుజ పదేళ్ల కేసీఆర్ పాలనపై కూడా అసెంబ్లీలో మేము చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు.

## కెసిఆర్ చర్చలో పాల్గొంటారా? వెళ్లిపోతారా?

>> ప్రారంభమయ్యే సమావేశాలకు తాను వస్తానని అధికార పక్షం ఎలాంటి ఎజెండాను ఖరారు చేస్తుందో చూసి ముందుకు వెళదామని పార్టీ నేతలతో పేర్కొన్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఎర్రవల్లిలోని ఫాంహౌస్ నుంచి బంజారాహిల్స్‌లోని తన నివాసానికి మాజీ సీఎం చేరుకున్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు అంశంపై అటు అసెంబ్లీ సమావేశాల్లో, ఆ తర్వాత క్షేత్రస్థాయిలో బలంగా పోరాటం చేస్తామని కేసీఆర్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. కేసీఆర్ ఇటీవల మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలకు సీఎం రేవంత్ రెడ్డి కూడా దీటుగానే బదులిచ్చారు. తనదైన శైలిలో ఆయన విమర్శలు గుప్పించారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలు హాట్ హాట్‌గా ఉండే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది. కాగా, అసెంబ్లీ సమావేశాల కోసం కేసీఆర్ హైదరాబాద్‌కు రావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నేత కేసీఆర్ హాజరు కాబోతున్నప్పటికీ, సభలో కృష్ణా జలాలపై జరిగే చర్చలో ఆయన పాల్గొంటారా? అంటే అవుననే బిఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తారు, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఎండగడతారు అని గులాబీ నేతలు చెబుతున్నారు. సోమవారం ఉదయం నందినగర్‌లోని తన నివాసం నుంచి అసెంబ్లీకి కెసిఆర్ వస్తారు. మొదటి రోజు అసెంబ్లీ సమావేశానికి హాజరవుతారని బీఆర్ఎస్ నాయకులు చెబుతున్నారు. కాగా, కేసీఆర్ ఇప్పటి వరకు రెండుసార్లు మాత్రమే అసెంబ్లీ సమావేశాలకు వచ్చారు. మొదటిసారి గవర్నర్ ప్రసంగానికి, రెండోసారి బడ్జెట్ ప్రసంగం సమయంలో మాత్రమే కెసిఆర్ అసెంబ్లీకి వచ్చారు.

కేసీఆర్ అసెంబ్లీకి రావాలంటూ ముఖ్యమంత్రి మొదలు మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు సైతం డిమాండ్ చేస్తున్నారు. ప్రజల డబ్బును జీతంగా తీసుకుంటున్న కేసీఆర్.. ప్రజా సమస్యలను చర్చించేందుకు అసెంబ్లీకి ఎందుకు రావడం లేదంటూ అనేక సందర్భాల్లో ప్రశ్నిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో కేసీఆర్ అసెంబ్లీకి వస్తున్నారనే అంశంపై హాట్ డిస్కషన్‌గా మారింది. కేసీఆర్ అసెంబ్లీ వచ్చినా.. చర్చలో పాల్గొంటారా? లేక సంతకం పెట్టి వెళ్లిపోతారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ సమావేశాలో కృష్ణా జలాల్లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై, ప్రాజెక్టుల అంశంపై చర్చించేందుకు సిద్ధమని కాంగ్రెస్ సర్కార్ ఇప్పటికే ప్రకటించింది. మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు సైతం ఇదే అంశంపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం నాడు అసెంబ్లీలో సీన్ వేరే లెవల్‌లో ఉండనుందని అందరూ అంచనా వేస్తున్నారు. నిజంగానే కేసీఆర్ ఈ డిబేట్‌లో పాల్గొంటే.. అసెంబ్లీ హాట్ హాట్ కామెంట్స్‌లో దుమ్ములేసిపోవడం ఖాయమని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ఒకవేళ కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సంతకం పెట్టి వెళ్లిపోతే.. కాంగ్రెస్ పార్టీకి మరో ఆయుధం చిక్కినట్లవుతుందని చెబుతున్నారు. మరి కేసీఆర్ సభకు వచ్చి.. చర్చలో పాల్గొంటారా? లేక ఎప్పటిలాగే సంతకం పెట్టి అటునుంచి అటే వెళ్లిపోతారా? అనేది ఆసక్తికరంగా మారింది.



బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా ఆదివారం బెంగళూరులో నిరసన ప్రదర్శన జరిపిన పలు హిందూ సంఘాలకు చెందిన మహిళా సభ్యులు

## సవాళ్లకైనా నేవీ రెడీ

>> స్వదేశీ కల్వరి-క్లాస్ జలాంతర్గామిలో ఈ తొలి ఎంబార్కింగ్ సుప్రీం కమాండర్ సాయుధ దళాలతో కార్యాచరణ సెట్టింగ్‌లలో నిరంతం అప్రమత్తత ప్రతిబింబిస్తున్నదని రాష్ట్రపతి ముర్ము పేర్కొన్నారు. 2024 నవంబర్ ప్రారంభంలో స్వదేశీ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌లో భారత నావికాదళం చేసిన ఆపరేషనల్ డెమోన్‌స్ట్రేషన్‌ను రాష్ట్రపతి వీక్షించారు. తరువాత సందర్శకుల పుస్తకంలో రాష్ట్రపతి తన అనుభవాలను వ్యక్తం చేస్తూ సంక్షిప్తంగా రాశారు. "ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లో మా నావికులు, అధికారులతో ప్రయాణించడం, డైవ్ చేయడం, సమయం గడపడం నాకు చాలా ప్రత్యేకమైన అనుభవం.

ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ నిర్వహించిన బహుళ విజయవంతమైన కాల్పులు, సవాలుతో కూడిన కార్యకలాపాలు 'వీర్య వర్చస్వ విజయ' అనే దాని నినాదానికి అనుగుణంగా సిబ్బంది అసాధారణ సంసిద్ధత, అంకితభావాన్ని ప్రదర్శిస్తాయి. వాఘ్‌షీర్ సిబ్బంది క్రమశిక్షణ, విశ్వాసం ఉత్సాహాన్ని చూడటం వల్ల మన జలాంతర్గాములు, భారత నావికాదళం ఏదైనా ముప్పుకు, అన్ని పరిస్థితులలోనూ పోరాటానికి సిద్ధంగా ఉన్నాయని హా ఇస్తుంది" అని సందర్శకుల పుస్తకంలో రాష్ట్రపతి రాసుకొచ్చారు. జలాంతర్గామిలో సముద్రంలోకి వెళ్లిన రెండో రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము చరిత్ర సృష్టించారు. అంతకు ముందు 2006లో జలాంతర్గామిలో ప్రయాణించిన తొలి రాష్ట్రపతిగా ఎపిజె అబ్దుల్ కలాం నిలిచారు.

**చరిత్ర సృష్టించిన రాష్ట్రపతి**

భారత సాయుధ దళాల సుప్రీం కమాండర్ అయిన రాష్ట్రపతి నావికాదళ యూనిఫాం ధరించి, సబ్‌మెరైన్‌లోకి ప్రవేశించారు. "కార్వార్ నావల్ బేస్‌లో ఇండియన్ నేవీ స్వదేశీ కల్వరి క్లాస్ జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్స్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రయాణించారు" అని రాష్ట్రపతి కార్యాలయం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

పి75 స్కార్పీన్ ప్రాజెక్ట్‌లో చివరిదైన ఆరో జలాంతర్గామి అయిన ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌ను జనవరిలో భారత నావికాదళంలోకి ప్రవేశపెట్టారు. నేవీ అధికారులు దీనిని ప్రపంచంలోనే అత్యంత నిశ్శబ్దమైన డీజిల్- ఎలక్ట్రిక్ జలాంతర్గాములలో ఒకటిగా అభివర్ణిస్తున్నారు. ఈ జలాంతర్గామిని అనేక రకాల మిషన్‌లను నిర్వహించడానికి రూపకల్పన చేశారు.

శత్రువుల ఉపరితల నౌకలు (యాంటీ-సర్ఫేస్ వార్‌షేర్), శత్రు జలాంతర్గాములపై పోరాటం (యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్), గూఢచార సమాచార సేకరణ, ప్రత్యేక ఆపరేషన్లు, నిఘాకు ఉపయోగపడుతుంది. ఇది వైర్-గైడెడ్ టార్పెడోలు, యాంటీ-షిప్ క్షిపణులు, ఆధునిక సోనార్ వ్యవస్థలతో ఆయుధీకరించబడింది.

## ఇంటర్ ప్రీ ఫైనల్ పరీక్షలు

>> ఇంటర్ బోర్డు ప్రకటించిన 2025-26 విద్యా సంవత్సరపు అకడమిక్ క్యాలెండర్‌లో జనవరి 11 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. అయితే జనవరి 10 రెండో శనివారం కావడంతో .. జనవరి 10 నుంచే సంక్రాంతి సెలవులు ప్రారంభం కానున్నాయి. దీంతో జనవరి 10 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు కొనసాగుతాయి. జనవరి 19 నుంచి జనవరి 24 వరకు ప్రీ ఫైనల్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఆ తరువాత జనవరి 25, 26 గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుగుతాయి. జనవరి 27 నుంచి విద్యార్థులు వార్షిక పరీక్షలకు సిద్ధం కానున్నారు. అయితే ఫిబ్రవరి 1 నుంచి ఒకేషనల్ విద్యార్థులతోపాటు, ఎంపిసి, బైపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 21 వరకు జరుగుతాయి. మొదటి విడతలో ప్రాక్టికల్ పరీక్షలు ముగిసిన విద్యార్థులు మరుసటి రోజు నుంచే వార్షిక పరీక్షలకు సిద్ధం కావడం మొదలుపెడతారు. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 21తో ముగుస్తాయి. ప్రాక్టికల్ పరీక్షలు ముగిసిన నాలుగో రోజు నుంచి అంటే ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మార్చి 18 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు కొనసాగనున్నాయి. మార్చి 13తో ప్రధాన పరీక్షలు ముగియనుండగా.. మిగిలిన పరీక్షలు మార్చి 18తో ముగియనున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే 9.92 లక్షల మంది విద్యార్థులు వార్షిక పరీక్ష ఫీజును చెల్లించగా.. అపరాధ రుసుం రూ. 2000తో ఈ నెలఖారు(31) వరకు అవకాశం కల్పించారు. ఈ ఏడాది గత ఏడాది కంటే ఎక్కువ మంది పరీక్ష ఫీజును చెల్లించారు.

## ఇక సినిమాలకు గుడ్‌బై.. పూర్తికాలం రాజకీయాలకే!

**జననాయకన్ ఆడియో వేడుకలో విజయ్ సంచలన ప్రకటన**

**కౌలాలంపూర్, డిసెంబరు 28:** తమిళ సూపర్‌స్టార్, దళపతి విజయ్ తన సినీ జీవితానికి ముగింపు పలుకుతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. పూర్తి స్థాయి రాజకీయాలపై దృష్టి పెట్టేందుకు నటన నుంచి తప్పుకుంటున్నట్లు స్పష్టం చేశారు. మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఉన్న బుకిట్ జలీల్ నేషనల్ స్టేడియంలో, దాదాపు 90,000 మంది అభిమానుల మధ్య జరిగిన జన నాయగన్ చిత్ర ఆడియో విడుదల వేడుకలో విజయ్ సంచలన ప్రకటన చేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ, ప్రజాసేవ కోసమే తాను ఈ కఠిన నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. నా కోసం థియేటర్లలో నిలబడిన అభిమానుల కోసం, రాబోయే ముప్పయి 33 ఏళ్ల నేను నిలబడతాను. ఈ విజయ్ ఫ్యాన్స్ కోసమే నేను సినిమాను వదిలేస్తున్నానని ఆయన భావోద్వేగంగా ప్రసంగించారు. తన మూడు దశాబ్దాల సినీ ప్రయాణంలో అభిమానులు అండగా నిలిచారని, వారి రుణం తీర్చుకుంటానని అన్నారు. నేను ఇసుకతో చిన్న ఇల్లు కట్టుకుందామని సినిమాలోకి వస్తే, మీరంతా నాకు ఒక రాజమహల్ ఇచ్చారు. మీ అందరికీ నా కృతజ్ఞతలని విజయ్ పేర్కొన్నారు. హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న జన నాయగన్ తన 69వ మరియు చివరి చిత్రమని విజయ్ ఈ వేదికగా తేల్చిచెప్పారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా 2026 జనవరి 9న విడుదల కానుంది. విజయ్ ఈ ఏడాది ఫిబ్రవరి 2న తమిళగ వెట్రి కళగం (టివికె) పేరుతో రాజకీయ పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. 2026లో జరగబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడమే లక్ష్యంగా ఆయన పార్టీ కార్యకలాపాలను ముమ్మరం చేశారు. ఈ ప్రకటనతో ఆయన పూర్తి సమయం రాజకీయ నేతగా మారనుండటం తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తిని రేపుతోంది.

# అసెంబ్లీ విధివిధానాలను పాతరేస్తున్న రేవంత్ ప్రభుత్వం

## సభ నెలరోజులపాటు నిర్వహించాలి, ఫార్మాసిటీని ఫోర్త్ సిటీకి మార్చుకొంటున్న అంశంపై దమ్ముంటే చర్చకు రండి: బిజెపి శాసనసభ పక్షనేత మహేశ్వర్‌రెడ్డి



**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త :** అసెంబ్లీ ప్రొసీజర్స్ ప్రకారం వందరోజులు సమావేశాలు నిర్వహించాల్సి ఉన్నా గత బిఆర్ఎస్ ప్రభుత్వం తరహాలోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిబంధనలను తుంగలో తొక్కుతోందని,నెలరోజుల పాటు ప్రజా సమస్యలపై చర్చించాలని బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సోమవారం నుంచి జరగనున్న అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలోనూ వింటర్ సీజన్ కేవలం ఒకే రోజు నిర్వహించిన ఘనత రేవంత్ రెడ్డికి దక్కిందని ఇప్పుడైనా ప్రజాసమస్యలన్నింటిపై చర్చించేందుకు సభను ఎన్ని రోజులు నిర్వహించబోతున్నారో చెప్పాలన్నారు. రాష్ట్రంలో రైతులు, రైతు కూలీల సమస్యలు ఉన్నాయని రైతు కూలీలకు రూ. 15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి రూ. 12 వేలే ఇస్తామన్నారు. అవి కూడా పూర్తిగా ఇవ్వలేదన్నారు. రుణమాఫీ పూర్తిగా జరగలేదని, ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఇస్తామన్న రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు ఆ విషయం ప్రస్తావించడం లేదని నిలదీశారు. 420 హామీలు ఇచ్చి వాటిని గాలికి వదిలేశారని విమర్శించారు.ఉద్యోగాల భర్తీ, మహిళలకు నెలకు 2500, కళ్యాణ లక్ష్మి కింద మహిళలకు తులం బంగారం వంటి అనేక హామీలు ఇచ్చి వాటిని తుంగలోకి తొక్కిందన్నారు. పూర్తిగా అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన ఈ ప్రభుత్వం ఇవాళ కనీసం ప్రజా సమస్యలపై చర్చించే దమ్ములేదన్నారు. అసెంబ్లీలో ఎన్ని రోజులైనా ఎవరొచ్చినా చర్చకు సరేనన్న రేవంత్ రెడ్డి ఇవాళ ఎందుకు తప్పించుకు తిరుగుతున్నారని ప్రశ్నించారు. హిల్ట్ పాలసీపై తాను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చానని దీనిపై చర్చకు ప్రభుత్వం సిద్ధమా? అని ప్రశ్నించారు.

రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులు కనీసం ఆపరేషన్ అండ్ మేంటనెన్స్ కింద మరమ్మతులకు కూడా నోచుకోలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీల సమస్యలతో పాటు బిసిలకు ఇచ్చిన రిజర్వేషన్ల హామీ ఇప్పటికి నెరవేరలేదంటే ఇది రేవంత్ రెడి సర్కార్ నిర్వాకం అని దుయ్యబట్టారు. ప్రజాసమస్యలన్నింటిపై చర్చించేందుకు కనీసం నెల రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే దమ్ము ఈ ప్రభుత్వానికి ఉందా అని నిలదీశారు. భూభారతి పేరుతో కొత్త విధానం తీసుకువచ్చి ఉన్న భూములను హారతి పట్టిస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో పూర్తిగా ప్రజారోగ్యం నిర్వీర్యం అయిందని వీటిపై చర్చించే దమ్ము ఈ ప్రభుత్వానికి ఉందా అని నిలదీశారు. ప్రజా దర్బార్ నిర్వహిస్తామన్న రేవంత్ రెడ్డి.. ఏమైంది మీ ప్రజాదర్బార్ అని నిలదీశారు. ప్రజాదర్బార్ లో వచ్చిన సమస్యలు పరిష్కారం విషయంలో శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. రాష్ట్రం ఆర్థిక పరిస్థితి రోజు రోజుకు దిగజారిపోతోందని, పూర్తిగా దివాళా తీస్తుంటే దీనిపై ఏదైనా ప్రణాళిక ఉందా దీనిపై చర్చించే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. ఎవరితోనో ఫుట్ బాల్ ఆడేందుకు రేవంత్ రెడ్డి రూ. 100 కోట్లు వెచ్చిస్తున్నారు? ఎందుకు ఈ హెచ్చులు అని ప్రశ్నించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చి ఎందుకు తాత్సారం చేస్తున్నారు? కోర్టుకు అబద్దాలు చెప్పి ఫార్మాసిటీ భూములను ఫోర్త్‌సిటీకి మార్చుకుంటున్న మీకు వీటిపై చర్చించే దమ్ము ధైర్యం ముఖ్యమంత్రికి రేవంత్ రెడ్డికి ఉందా అని ప్రశ్నించారు, చేనేత రంగాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారు. ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు వారి బెనిఫిట్స్ ఇవ్వలేకపోతున్నారు. ఇంతకంటే ఘోరం ఇంకొకటి ఉండదన్నారుబిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపిన బాధ్యులను కటకటాల వెనక్కి పంపుతానని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి ఎంత మందిపై కేసులు నమోదు చేసి ఎంత మందిపై చర్యలు తీసుకున్నారో చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. మంత్రులపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని వీటన్నింటిని చర్చకు సిద్ధమా అని నిలదీశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల ఎన్నికైన పాలకవర్గాల రద్దు విషయంలో బిజెపి అసెంబ్లీలో పోరాటం చేస్తుందన్నారు.



## బీహార్‌లో గూడ్స్‌కు పెను ప్రమాదం

### పట్టాలు తప్పిన పది వ్యాగన్లు!

**పాట్నా, డిసెంబరు 28:** బీహార్ రాష్ట్రంలోని జాముయి జిల్లాలో తెల్వా బజార్ హాల్ట్‌వద్ద గూడ్స్‌రైలు పట్టాలు తప్పడంతో రైల్వే ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఝూఝూ జసిధీ రైల్వేసెక్షన్‌లో జరిగిన ఈప్రమాదంలో సుమారు 10 వ్యాగన్లు బ్రిడ్జి సమీపంలో పడిపోయాయి. మొత్తం 34కిపైగా రైళ్లరాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ వాగన్లు ట్రాక్‌పైనుంచి పక్కకు ఒరిగిపోయాయి. యుపి, బీహార్ సెక్షన్లలో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. జసిదీనుంచి ఝూఝూకు గూడ్స్‌రైలు ప్రయాణిస్తోంది. భారీ శబ్దంతో ఒక్కసారిగా వ్యాగన్లు పట్టాలు తప్పిపోయాయి. ఈ రైలులో సిమెంట్ బస్తాలు రవాణా అవుతున్నాయి. వంతెనపైనా, పరిసరాల్లో ఈ బస్తాలన్నీ చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ప్రమాదంతో అనేక ప్యాసింజర్‌రైళ్లు, కియుల్‌జసిద్ది రైల్వే సెక్షన్ మధ్యలో పలు స్టేషన్లలో నిలిచిపోయాయి. అయితేఎలాంటిప్రాణాపాయం జరిగినట్లు సమాచారం లేదని అధికారులు తెలిపారు. వంతెనపై రైలు బోగీలను తప్పించి ట్రాఫిక్‌పునరుద్ధరణ చేపట్టినట్లు తూర్పురైల్వే అధికారులు తెలిపారు. పనులు పూర్తయ్యేంతవరకూ రైళ్లను ఇతర మార్గాలమీదుగా మళ్లిస్తున్నట్లు తెలిపారు. ఝూఝూ స్టేషన్‌నుంచి మాత్రం నిర్ణీత మార్గంలోనే నడుస్తాయని చెప్పారు. అసన్‌సోల్,మధుపూర్, ఝూఝూ స్టేషన్లనుంచి రిలీఫ్ రైళ్లను వెంటనే ఆప్రాంతానికి పంపించామన్నారు.

## రూ.వెయ్యి కోట్ల రుణానికి ప్రతిపాదనలు

### 30న బాండ్ల వేలంలో సేకరణ

**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** రాష్ట్ర సర్కారు రూ.వెయ్యి కోట్ల రుణ సమీకరణ కోసం ప్రతిపాదనలు పంపించింది. ప్రతి మంగళవారం బహిరంగ మార్కెట్లో ప్రభుత్వ బాండ్లను వేలం వేయడం ద్వారా రుణాన్ని సేకరించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా ఈ నెల 30న జరిగే వేలంలో ఈ మొత్తం సేకరిస్తామని రిజర్వ్ బ్యాంక్‌కు రాష్ట్ర ఆర్థికశాఖ ఇండెంట్ పెట్టింది. ఈ విషయాన్ని రిజర్వ్ బ్యాంక్ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇక 11 ఏండ్ల కాలానికి గాను రూ.1000 కోట్లు అప్పు తీసుకొనేందుకు ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లు పెట్టినట్టు పేర్కొన్నది. కాగా ప్రస్తుత 2025-26 రాష్ట్ర వార్షిక అంచనా బడ్జెట్‌లో రూ.54,009 కోట్లు రుణం కింద సేకరించనున్నట్లు ప్రతిపాదించగా, ఈ నెల 23వ తేదీ నాటికే రూ.68,300 కోట్లు ఒక్క రిజర్వ్ బ్యాంక్ నుంచే రాష్ట్ర ప్రభుత్వం సమీకరించింది. ఇక రుణ పరిమితి పెంచాలని, పాత రుణాల రీ షెడ్యూలింగ్‌కు అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన వినతికి కేంద్రం అంగీకరించింది. ఇందులో భాగంగా 2025-26 వార్షిక సంవత్సరానికి రూ.71,400 కోట్ల వరకు రుణాలకు అనుమతి ఇచ్చింది.

# శ్రీచైతన్య ఉద్యోగుల స్పోర్ట్స్ ఉత్సవ్-2025 విజయవంతం

## విజేతలకు బహుమతి ప్రదానం

## మియాపూర్ శ్రీచైతన్య క్యాంపస్, కళ్యాణ్ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహణ

**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** ఆసియా ఖండంలోనే అతిపెద్ద విద్యావ్యవస్థ, శ్రీచైతన్య విద్యాసంస్థలు నిర్వహించిన స్పోర్ట్స్ ఉత్సవ్ 2025 క్రీడల మహోత్సవం విజయవంతంగా ముగిసింది. హైదరాబాద్‌లోని అన్నీ బ్రాంచీలలోని వేలాదిమంది అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది 12 జోన్లుగా వివిధ శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తూ అథ్లెటిక్స్, ఇండోర్, అవుట్ డోర్ గేమ్స్, రిక్రియేషనల్ అంశాలలో తమ ప్రతిభను ప్రదర్శించారు. సిబ్బందిలో పోటీతత్వం, జట్టు భావన, నాయకత్వ లక్షణాలను వెలికితీసే ఈ క్రీడా వేడుక అందరి ప్రశంసలను అందుకుంది.ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రధాన కార్యక్రమంలో క్రికెట్, వాలీబాల్, టెబుల్ టెన్నిస్, క్యారమ్, చెస్, పికెట్ బాల్ వంటి విభాగాలలో రాణించిన విజేతలకు మెడల్స్, ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ బొప్పన, డైరెక్టర్లు శ్రీధర్, టి. నాగేంద్ర కుమార్ హాజరై విజేతలను అభినందిస్తూ బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా సుష్మ మాట్లాడుతూ బోర్డ్ ఎగ్జామ్స్‌తోపాటు ఐఐటి-జెఈఈ, నీట్, ఒలంపియాడ్‌లలో ఆలిండియా అగ్రగామిగా ఉన్న శ్రీచైతన్యలో విద్యతో పాటు శారీరక వికాసానికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామనీ, క్రీడల ద్వారా క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలు, ఓర్పు వంటి జీవితంలో అత్యవసరమైన విలువలను విద్యార్థులు నేర్చుకుంటారని, ఇందుకు స్ఫూర్తిగా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ఈ క్రీడా పోటీలను నిర్వహించామని తెలిపారు. ఈ పోటీలు ప్రతి సంవత్సరం కొనసాగుతాయని అన్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థల అంతటా విద్యార్థుల మానసిక, శారీరకాభివృద్ధికి అత్యుత్తమ వాతావరణాన్ని అందించేందుకు శ్రీచైతన్య ఎల్లప్పుడూ కృషి చేస్తుందని వివరించారు. విద్యార్థులు విద్యలోనూ, క్రీడల్లోనూ, జీవితంలోనూ విజేతలుగా ఎదగాలనే ప్రేరణతో ముందుకు సాగాలని సుష్మ కోరారు.



## మహనీయుల పోరాటాలకు వేదిక కాంగ్రెస్ పార్టీ

### వ్యవస్థాపక దినోత్సవంలో ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గే

**న్యూఢిల్లీ, డిసెంబరు 28:** అఖిలభారత కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం కేంద్ర కార్యాలయంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన నాయకులకు ఘననివాళి అర్పించారు. ఎందరో మహనీయుల త్యాగాలతో మనం స్వాతంత్ర్యం సమకూర్చుకోగలిగామని ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గే ఈసందర్భంగా పేర్కొన్నారు. పార్టీ 140వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ సిద్ధాంతాలు, కార్యాచరణను మరింతగా మనం ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య పోరాటంలో అనేకమంది కార్యకర్తలు ప్రాణత్యాగంచేసారని, వందలాదిమంది జైళ్లకు వెళ్లారని గుర్తుచేసారు. 1885లో స్థాపించిన పార్టీ అప్పటినుంచి భారత్‌కు గుండెకాయలా మారిందని అన్నారు. మహాత్మాగాంధీ ఇచ్చిన పిలుపుతోనే స్వాతంత్ర్య పోరాటంలోకి మహిళలు, నిరుపేదలు అన్నివర్గాలప్రజలు పాలుపంచుకున్నారని అన్నారు. ఇదే సంవత్సరం మనం రాజ్యాంగం అమలు 75 ఏళ్లరాజ్యాంగ అమలు దినోత్సవం కూడా జరుపుకున్నామన్నారు. శతాధిక వర్ష పార్టీకి ఆనాడు తొలి మహిళా అధ్యక్షురాలిగా సరోజిని నాయుడు వ్యవహరించిన అంశాన్ని గుర్తుచేసారు. హరిత విప్లవం, శ్వేత విప్లవం, ఆటోమొబైల్, ఐటి రంగాల విస్తరణ, కమ్యూనికేషన్స్ రంగంలో విప్లవం కాంగ్రెస్‌వల్లనే సాధ్యం అయిందన్నారు. యుపిఎ హయాంలో సోనియా గాంధీ నాయకత్వంలో పౌర హక్కులను బలోపేతంచేసామన్నారు. మన్మోహన్‌సింగ్ హయాంలో భారత్‌కు ప్రపంచ గుర్తింపు లభించిన అంశాన్ని గుర్తుచేసారు. కాంగ్రెస్ నిర్మించిన రాజ్యాంగ సంస్థలను 11 ఏళ్లలో ప్రస్తుత మోడీ సర్కారు నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. దేశంలోని జల్, జంగిల్, జమీన్‌లకు ముప్పు ఏర్పడుతోందని ఆయన హెచ్చరించారు. రాజ్యాంగ విలువలను ఆర్‌ఎస్‌ఎస్ తక్కువచేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ కాంగ్రెస్ అనేది ఒక పార్టీ మాత్రమే కాదని, దేశప్రజలకు కార్యకర్తలకు గుండెకాయ వంటిదని పేర్కొన్నారు. అణగారిన, నిరుపేదల వాణిని నిరంతరం వినిపిస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సోనియా గాంధీ, ప్రియాంక గాంధీలతోపాటు జైరామ్‌రమేష్, పార్టీ ఎంపిలు కెసి వేణుగోపాల్, శశిథరూర్, దిగ్వి జయ్‌సింగ్ వంటి ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# 'మన్ కీ బాత్' చరిత్రాత్మకం

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** భారత ప్రధాని నరేంద్రమోడీ స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టి చీపురుపట్టి రోడ్లను ఊడ్చి పారిశుద్ధ్య కార్మికుల ఆత్మగౌరవాన్ని పెంచారని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని కిషన్‌రెడ్డి వీక్షి ం చారు. భారత ప్రధాని స్వర్గీయ ఆటల్ బిహారి వాజ్‌పేయి శత జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బిజెపి సీనియర్ నాయకుడు ఎక్కాల నందు ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు కేంద్ర మంత్రి దుప్పట్లు, బట్టలను పంపిణి చేశారు. విద్యార్థులకు బుక్స్. స్టేషనరీని అందజేశారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల ఆత్మగౌరవాన్ని పెంచే కార్యక్రమం ఎవరైనా చేశారా అంటే అది మొదట మన భారత ప్రధాని నరేంద్రమోదీ అని, స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పనిచేసిన గొప్ప వ్యక్తి అని మోదీ అని అన్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం ద్వారా కోట్లాది మంది ప్రజలను జాగృతం చేసి స్వచ్ఛ భారత్ ప్రాముఖ్యతను తెలియజేశారన్నారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొన సాగించాలని, ప్రతి రోజూ ఒక దగ్గర స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ప్రపంచంలో ఏ ప్రధాని చేయలేని మన్ కీ బాత్ కార్యక్రమం చరిత్రాత్మ కమైనదని అన్నారు. సామాజిక, రాజకీయ, ఆధ్యాత్మిక, పరిశోధన కార్యక్రమాలను మారుమూల ప్రాంతాలకు విస్తరింప చేయడంలో ప్రధాని పాత్ర కీలకమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ దేశ పర్యటన, విదేశాల్లో ఉన్నా, పార్లమెంట్ సమావేశాల్లో ఉన్నా విధిగా మన్ కీ బాత్ కార్యక్రమం కొనసాగి స్తున్నారని తెలిపారు. ప్రధాని ప్రతి నెల చివరి ఆదివారం రోజు ప్రజలతో మమేకమై మాట్లాడటంవంటి కార్యక్రమం మన్ కీ బాత్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు, పార్టీ ఒబిసి రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, మాజీ మంత్రి సి. కృష్ణయాదవ్, పార్టీ సెంట్రల్ జిల్లా మీడియా ఇన్‌చార్జీ భుజెందర్‌కుమార్, కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్‌యాదవ్, వై.అమృత, మాజీ కార్పొరేటర్ ఎక్కాల చైతన్య కన్నా, పార్టీ నేతలు ఎక్కాల నందు, ఎ.అజయ్‌కుమార్, ఎ. సూర్యప్రకాష్ సింగ్, సుభాష్ పటేల్, కేసరి నర్సింగ్ రావు యాదవ్, ఎస్.అరవింద్, శీర్సాగర్, శ్యామ్రాజ్, చిట్టి శ్రీదర్, వనం రమేష్, తదితరులు పాల్గొన్నారు



'మన్ కీ బాత్' కార్యక్రమం అనంతరం పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

## అసెంబ్లీ సమావేశాలు కనీసం 15 రోజులు నిర్వహించాలి

### మాజీమంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 28:**శాసనసభను కాంగ్రెస్ భ్రష్టు పట్టించిందని మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు విమర్శించారు. బిఆర్ఎస్ హయాంలో ఏడాదికి సగటున 32 రోజులు అసెంబ్లీ నడిపితే.. కాంగ్రెస్ సగటున 20 రోజులే సమావేశాలు నిర్వహించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2024లో 24 రోజుల పాటు సభను నడిపారని గుర్తుచేశారు. ఈ ఏడాది ఇప్పటివరకు 15 రోజులు నడపగా, సోమవారం సభ జరిగితే 16 రోజులు అవుతుందని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సగటున ఏడాదికి 20 రోజుల మాత్రమే సభను నడిపిందని తెలిపారు. అందులో ఇద్దరు ఎంఎల్ఎలు చనిపోతే రెండు రోజులు సంతాప తీర్మానాలు పెట్టారు, మూడు శ్వేతపత్రాలు, ఒక రోజు ఘోష్ కమిషన్ రిపోర్టు, బిసి రిజర్వేషన్లపై ఒక రోజు సభ పెట్టారని అన్నారు. ప్రతిపక్షంపై బురద జల్లడానికే సమావేశాలు పెడుతున్నారు తప్ప ప్రజా సమస్యలు చర్చించడానికి కాదు అని ఆరోపించారు. అసెంబ్లీని 45 రోజుల పాటు జరపాలని గతంలో కాంగ్రెస్ డిమాండ్ చేసిందని గుర్తుచేశారు. సభ నడిపేందుకు ప్రభుత్వం జంకుతోందని ఆరోపించారు. తాము ఇచ్చిన అజెండాను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదని, సభను కాంగ్రెస్ నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. ఎన్ని రోజులైనా సభ నడుపుతామని బయటకి చెబుతూ, ఆచరణలో మాత్రం సభ నడిచే రోజులను కుదిస్తుందని పేర్కొన్నారు. ఈసారి కనీసం 15 రోజులైనా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. శాసనసభా వ్యవహారాల మంత్రిగా శ్రీధర్‌బాబు విఫలమయ్యారని, రెండేళ్లు దాటినా.. అసెంబ్లీలో ఒక్క హౌస్ కమిటీ వేయలేదని విమర్శించారు. హౌస్ కమిటీని ఎందుకు నియమించటం లేదని,. అంచనాల కమిటీ చైర్మన్‌గా పద్మావతిని నియమిస్తే బాధ్యతలు తీసుకోకుండానే ఎందుకు రాజీనామా చేశారని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్షం అడుగుతున్న అజెండాను ఎందుకు తీసుకోవటం లేదని హరీష్‌రావు ప్రశ్నించారు.గతంలో పీఏసీ కమిటీ ఎలా వేశారో శ్రీధర్‌బాబుకు తెలుసు కదా అని అన్నారు. శాసనసభకు మొత్తం 18 కమిటీలు ఉంటాయని తెలిపారు. కానీ ఒక్క కమిటీ కూడా వేయలేదని చెప్పారు. బ్యాక్ డోర్ నుంచి నామినేషన్ వేయించి ఆమోదించారని మండిపడ్డారు. అసెంబ్లీలో ఎరువుల కొరతపై చర్చ జరగాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ పూర్తిగా చేయనందుకు చర్చ జరగాలని అన్నారు. రైతుబంధు రెండు పంటలకు ఎగ్గొట్టినందుకు చర్చ జరగాలన్నారు. హిల్ట్ పాలసీపై 5 లక్షల కోట్ల కుంభకోణం మీద చర్చ జరగాలన్నారు. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌పై చర్చ జరగాలని పట్టుబట్టారు. ట్రిపుల్‌ఆర్, జాబ్ క్యాలెండర్, ఉద్యోగుల పీఆర్సీ, డీఏలపై చర్చ జరగాలని డిమాండ్ చేశారు. ఫ్యూచర్ సిటీ, ఫార్మా సిటీ, హైడ్రా బుల్డోజర్‌పై చర్చ జరగాలన్నారు.

# జమ్మూలో నక్కి ఉన్న 30 మంది పాకిస్థానీ ఉగ్రవాదులు



**జమ్ము, డిసెంబరు 28:** జమ్మూ ప్రాంతంలో 30 మందికి పైగా పాకిస్థానీ ఉగ్రవాదులు నక్కినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. దాంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఉగ్ర స్థావరాలు గుర్తించడానికి కొండలు, అడవులు, మారుమూల లోయల్లో గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఉగ్రవాదులను ట్రాక్ చేయడానికి డ్రోన్లు, థర్మల్ ఇమేజర్లు, గ్రౌండ్ సెన్సార్లను మోహరించినట్లు అధికారులు తెలిపారు. జమ్మూలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోవడంతో ఉగ్రవాదులపై నిరంతర నిఘా కోసం పర్వత ప్రాంతాల్లో తాత్కాలిక నిఘా స్థావరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మరోవైపు జమ్మూ కశ్మీర్‌లో మంచు కురుస్తుండటంతో చొరబాట్లకు ఇదే అదునుగా భావించిన ఉగ్రమూకలు అంతర్జాతీయ సరిహద్దును దాటుకుని దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ విషయాన్ని సరిహద్దు భద్రతా దళం అధికారులు వెల్లడించారు. అయితే ఉగ్రవాదుల చొరబాటు యత్నాలను తమ దళాలు తిప్పికొడుతున్నాయని అన్నారు. సరిహద్దుల్లో ఉగ్ర కదలికల నేపథ్యంలో కశ్మీర్‌లోని గుల్మార్గ్, సోనామార్గ్, దాల్ లేక్ ప్రాంతాలతో సహా పలు సున్నితమైన ప్రదేశాల్లో భద్రతా దళాలు, స్థానిక పోలీసులు ప్రత్యేక బృందాలను మోహరించినట్లు తెలిపారు. పాక్‌లో చీఫ్ ఆసిమ్‌మునీర్‌కు సర్వసైన్యాధిపతి బాధ్యతలు వచ్చినతర్వాత సరిహద్దు వెంబడి భద్రతను మరింత పటిష్టంచేసింది.

నిఘా వర్గాలను కూడా అప్రమత్తంచేయడంతో ఎప్పటికప్పుడు మిలిటెంట్ల చొరబాట్ల సమాచారం అందుతోంది. దాటుకుని వచ్చిన మిలిటెంట్లు స్థానిక యువతను తప్పుదోవ పట్టిస్తున్నట్లు కూడా గుర్తించిన నిఘా ఏజెన్సీలు భద్రతా బలగాలను అప్రమత్తంచేస్తున్నాయి.

## ఆకాశాన్నంటుతున్న చికెన్, గుడ్ల ధరలు

### కిలో చికెన్ రూ.300, గుడ్డు రూ.10

**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో చికెన్, గుడ్ల ధరలు కూడా ఆకాశానికి ఎగబాకుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో చికెన్ రూ.300 పలుకుతుంది. ఇక గుడ్డు ధర ఏకంగా రూ.10కి చేరింది. కేవలం వారంలోనే కిలో చికెన్ పై రూ.50 పెరిగింది. కార్తీకమాసం ముగిసినప్పటి నుండి చికెన్ ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. ఇలా క్రమంగా వారం వారం కిలో చికెన్ పై రూ.10 నుంచి రూ.20 వరకు పెరుగుదల కనిపిస్తుంది. ప్రస్తుతం కేజీ స్కిన్ చికెన్ రూ.270 కాగా, స్కిన్ లెస్ చికెన్ కేజీ రూ.300 పలుకుతుంది. ఇక ఈ రోజు ఆదివారం కావడంతో మాంసం ప్రియులు అధిక ధరలు చెల్లించి చికెన్ ముక్క కొనలేక గుటకలు వేస్తున్నారు. వచ్చే నెలలో సంక్రాంతి ఉండటంతో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు. మరోవైపు గుడ్ల ధరలు కూడా పెరగడంతో మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు సైతం అందించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఒక్కో గుడ్డుకు కేవలం రూ. 6 మాత్రమే చెల్లిస్తోంది. కానీ మార్కెట్‌లో హోల్‌సేల్ ధర రూ. 7.50 ఉంది. రిటైల్ ధర రూ. 10 పలుకుతోంది. ఈ క్రమంలో విద్యార్థులకు వారానికి మూడు సార్లు అందించవల్సిన గుడ్లను రెండు సార్లు మాత్రమే అందిస్తున్నారు. కాగా గత కొద్దిరోజులుగా కోడిగుడ్లు, చికెన్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీనికి ప్రధానంగా కారణాలు ఉన్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. కార్తీక మాసం ముగియడం, వరుస పండుగలు రావడంతో చికెన్‌కి ఒక్కసారిగా గిరాకీ పెరిగింది. డిమాండ్‌కు తగ్గట్లుగా పౌల్ట్రీ ఉత్పత్తి లేకపోవడంతో సరఫరా దెబ్బతిని ధరలు పెరిగినట్లు చెబుతున్నారు. మొత్తం వచ్చే పండగ నెలలోనూ చికెన్ రేట్లు కిలో రూ.350 నుంచి రూ.400 వరకు పలికే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

# భారత్‌లోకి హాదీ హత్యకేసు నిందితులు!

## ఎవ్వరూ రాలేదన్న భారత్ బిఎస్ఎఫ్, మేఘాలయ పోలీసులు



**ఢాకా, డిసెంబరు 28:** బంగ్లాదేశ్‌ను కుదిపేసిన విద్యార్థి ఉద్యమ నేత షరీఫ్ ఉస్మాన్ బిన్ హాదీ హత్య కేసు ప్రధాన నిందితులుగా ఉన్న ఇద్దరు వ్యక్తులు భారత్‌కు పారిపోయినట్లు బంగ్లాదేశ్ పోలీసులు అధికారికంగా ప్రకటించారు. ప్రధాన నిందితులు ఫైసల్ కరీం మసూద్, అలంగీర్ షేక్‌లు మేఘాలయలోని తురా నగరంలో తలదాచుకున్నట్లు గుర్తించామని అదనపు పోలీస్ కమిషనర్ నజ్రుల్ ఇస్లాం తెలిపారు. సహచరుల సాయంతో వారు హలువాఘాట్ సరిహద్దు ద్వారా మేఘాలయలోకి ప్రవేశించారని వివరించారు. అక్కడ వారికి పూర్తీ, సమి అనే ఇద్దరు వ్యక్తులు ఆశ్రయం కల్పించారని, వారిని భారత భద్రతా దళాలు అదుపులోకి తీసుకున్నట్లు తమకు అనధికారిక సమాచారం ఉందని పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేసి తమకు అప్పగించాలని అధికారిక, అనధికారిక మార్గాల ద్వారా భారత అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

గత ఏడాది జులైఆగస్టులో జరిగిన విద్యార్థి ఉద్యమంలో హాదీ కీలక పాత్ర పోషించారు. షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వ పతనానికి ఈ ఉద్యమమే కారణమైంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 12న ఢాకాలో ఎన్నికల ప్రచారం చేస్తుండగా, రిక్షాలో వెళుతున్న హాదీపై దుండగులు అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడిన హాదీ, సింగపూర్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ డిసెంబర్ 18న కన్నుమూశారు. ఈ హత్య కేసులో ఇప్పటివరకు 11 మందిని అరెస్ట్ చేశామని, వారిలో ఆరుగురు నేరాన్ని అంగీకరించారని పోలీసులు తెలిపారు. మరో 7 నుంచి 10 రోజుల్లో ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని వెల్లడించారు

**సరిహద్దుల్లో బిఎస్ఎఫ్ ఖండన!**

హాదీ హత్యకేసు నిందితులు భారత్‌కు వచ్చారనడం అవాస్తవమని, నిరాధార ఆరోపణలని సరిహద్దుభద్రతా దళం, మేఘాలయ పోలీసులు ఖండించారు. అంతర్జాతీయ సరిహద్దును దాటి ఎవ్వరూ భారత్‌లోకి వచ్చిన ఆధారాలు లేవని తెలిపింది. తమ బలగాలు సరిహద్దుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉన్నాయని ప్రజలను తప్పుదారిపట్టించేందుకు పొరుగుదేశం నిరాధార ఆరోపణలుచేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేసింది. అలాగే మేఘాలయ పోలీసులు కూడా తమ రాష్ట్రంలోకి ఎవ్వరూ రాలేదని, తాము ఎవరినీ అరెస్టుచేయలేదని చెప్పారు. భారత్‌పై చేస్తున్న తప్పుడు ఆరోపణలనికొట్టివేసారు. భారత ప్రజల్లో గందర గోళం సృష్టించడంకోసం బంగ్లా మీడియా కుట్రపూరిత సృష్టి అని మేఘాలయ పోలీసులు వెల్లడించారు.

వార్త

లోకంలో నిన్ను గురించి భూషిస్తున్నారా? దూషిస్తున్నారా? అనేది ముఖ్యం కాదు. చర్చిస్తున్నారా? లేదా అనేది ముఖ్యం.

-చర్చిల్

# ఆరావళీ! ఇదేమి కేళి!

రేపోమాపో మాయమవుతాయనుకున్న ఆరావళీ పర్వత పంక్తులకు ఇప్పుడు బోలెడంత రక్షణ దొరుకుతోంది. గుట్టలు తవ్వడమంటే మామూలే. పర్వతాలను కూడా తవ్వేసుకునే తిమింగళాలున్నాయంటే కాస్త సరిపెట్టుకోవచ్చు. అవి చదునైతే జీవ జాతులు బతుకుతాయనీ సర్దేసుకోవచ్చు. గుట్టలు మింగే బకాసురుల వలన ప్రభుత్వ ఖజానాకు ఎంతో నష్టం వాటిల్లుతుంది. వాటిని ఏలిన వారు చూసుకుంటారులే అని సరిపెట్టుకునేలా విషయం లేదు. ఇప్పుడా ఏలిన వారి నుంచే చరిత్ర ప్రసిద్ధి కలిగిన ఆరావళీ పర్వతాలకు ముప్పు ఏర్పడింది. గగ్గోలు పెట్టాక కేంద్రమే కాస్త తగ్గి ఇకపై ఆరావళీ పర్వతాలు తవ్వకునేందుకు అనుమతించబోమని గద్గద స్వరంతో ప్రజలకు ఓవిజ్ఞప్తిని జారీచేశారు. గతంలోనే వాటిని యధేచ్ఛగా కాకపోయినా కొంత ప్రాంతాన్ని మైనింగ్‌కిచ్చేసింది. ఇది మునుపటి మాట. చరిత్ర ప్రసిద్ధిగాంచిన ఆరావళీ పర్వతాలు ఢిల్లీ నుంచి గుజరాత్ వరకు దాదాపు 700 కిలోమీటర్ల మేర వ్యాపించి ఉంది. వాటికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం తొలుత కొత్త నిర్వచనాన్ని చెప్పగా విపక్షాలు వ్యతిరేకించాయి. కేవలంవంద మీటర్ల ఎత్తు ఉన్నవి మాత్రమే ఆరావళీ పర్వతపంక్తుల లోకి వస్తాయని కేంద్రం ప్రకటించింది. దేశవ్యాప్తంగా కేంద్రం ఇచ్చిన ఈ నిర్వచనాన్ని జనం ఎండగట్టారు. నిజానికి అక్కడ విచ్చలవిడిగా జరుగుతున్న మైనింగ్, రియాల్టీ కార్యకలాపాల కారణంగా ఆ పర్వతాల ఉనికికే భంగం వాటిల్లింది. ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా ఆ ప్రాచీన పర్వతాల శ్రేణులను విశ్లేషించి నిర్వచించిందో కానీ దాదాపు ఆ పర్వతశ్రేణులు ఎప్పటికైనా కనుమరుగవుతాయని, వాటివల్ల పర్యావరణం బాగా దెబ్బ తింటుందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తంచేశారు. మైనింగ్ అక్రమాలను అడ్డుకోవాల్సిన కేంద్రప్రభుత్వం తన బాధ్యతను మరచిపోయిందో ఏమోకానీ ఆరావళీ పర్వతాల భౌగోళిక స్వరూపాన్నే మార్చచూసింది. దాంతో పర్యావరణవేత్తలు, కాంగ్రెస్ సీనియర్ నేత సోనియా గాంధీ ఆఖరికి కేంద్ర మాజీ మంత్రి శశిథరూర్ కూడా ప్రభుత్వం అలా చేయకుండా ఉండాల్సిందంటూ నిరసన వ్యక్తంచేశారు. ఆరావళీ నిలువునా అడవులు, నీటివనరులు ప్రఖ్యాతి చెందిన రాజస్థాన్‌ల శిథిలాలు, చారిత్రక ప్రదేశాలు, దేవాలయాలున్నాయి. అంతే ప్రాధాన్యత ఉన్న అరుదైన ఖనిజాలు కూడా ఈ పర్వతాల మాటున దాగి ఉన్నాయి. రాగి, జింక్, జిప్సమ్, క్వార్ట్జ్, పాలరాయి, రాక్‌సల్ఫేట్ వంటి వన్నీ ఇందులో దాగిఉన్నాయి. దీన్ని హస్తగతం చేసుకోవాలని ఎదురు చూస్తున్న మైనింగ్ మాఫియాను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం కదిలిరాలేదు. పైగా ఆరావళీ పర్వతాలను పరిధిని కుదిస్తూ కేంద్ర పర్యావరణ శాఖ సుప్రీంకోర్టుకు ఓ నివేదిక సమర్పించింది. దాని ప్రకారం 100 మీటర్లకంటే లోపు ఎత్తు ఉన్న పర్వతాలను ఆరావళీ పరిధి నుంచి మినహాయింపు కోరింది. ఈ లేఖ సారాంశంపైసుప్రీంకోర్టు సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ ఈ ప్రతిపాదన ఆమోదించలేదు. ఇదే నిర్ణయాన్ని నివేదిక రూపంలో సుప్రీంకోర్టుకు దాఖలుపరచగా దాదాపు ఆమోదించింది. అయితే సైంటిఫిక్ మ్యాపింగ్ పూర్తయ్యేదాక ఎటువంటి కొత్త లీజులు ఇవ్వరాదని షరతుపెట్టింది. ఫారెస్టుసర్వే ఆఫ్ ఇండియా అధ్యయనం ప్రకారం ఆరావళిలోని మొత్తం 12,081 పర్వతాల్లో 1,048 పర్వతాలు మాత్రమే 100 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులోఉన్నాయి. కేంద్రం రూపొందించిన ప్రతిపాదనలను బట్టి ఆరావళీ పర్వతశ్రేణుల్లో 90 శాతం మైనింగ్‌కు అనుకూల పరిధిలోకి మారతాయి. దాంతో ఆ పర్వతాలు పిండవుతాయి. బోలెడంత ఖనిజ సంపద దళారుల పాలవుతుంది. ఈవిధమైన అంచనాలతో పర్వతాలలో పది శాతం మాత్రమే పర్వతాలుగా పనికివస్తాయి. గతంలో 1975–2019 వరకు జరిగిన అక్రమ మైనింగ్ వలన ఇప్పటికే 8శాతం మేరకు ఆరావళీ మైనింగ్ తరలి వెళ్లిపోయింది. దాదాపు కనుమరుగైనట్లే. తాజాగా కేంద్రం ఇచ్చిన ప్రతిపాదనలలో ఆరావళీ మరింత కుదించుకుపోతాయి. అంతేకాదు ఈ పర్వతశ్రేణుల వైశాల్యం తగ్గిపోయే కొద్దీ ఢిల్లీ, తదితర మహానగరాలకు నష్టం కలుగుతుందనే ఆందోళన వ్యక్తం చేశారు. ఒకపక్క థార్ ఎడారి నుంచి వచ్చే ఇసుక తుఫానులు ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్‌ల వైపు పయనించకుండా ఆరావళీ పర్వతాలే రక్షణ గోడలుగా కాపాడుతున్నాయి. అందుకే ఢిల్లీ (ఎన్‌సిఆర్) వంటి జనాభా ఎక్కువగా ఉన్న నగరాలకు ఇసుక రేణువులు తోడైతే అక్కడ ఆప్రాంతంలో బతికే పరిస్థితి మృగ్యమవుతోంది. ఈ పర్వతాలను స్వచ్ఛమైన గాలిని అందించే ఊపిరితిత్తులుగా 'గ్రీన్ లంగ్స్'గా పిలవడం కద్దు. ఈ పర్వతాలపై ఉండే దట్టమైన అడవులు రాళ్లు, భూగర్భ జలాల పెంపుతోపాటు వరదలను ఆపగలుగుతున్నాయి. ఈ కారణం గురుగ్రామ్, ఫరీదాబాద్, దక్షిణ ఢిల్లీ, అల్వార్ జైపూర్‌లకు ఇంతదాకా వరద తాకిడి లేదు. ఆరావళీ అనగానే అరుదైన వృక్ష జంతు జాతులకునెలవు. కాగాకేంద్రం ఇటీవల తీసుకున్న నిర్ణయం పర్యావరణ సమతుల్యతను దెబ్బ తీస్తుందన్న భయాందోళనలు తలెత్తాయి. భౌగోళిక పరిస్థితులు, వాటికి ప్రయోజనాలు కలిగించే అంశాలపై అధ్యయనం చేయకుండానే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం, దానిని దేశ అత్యున్నత ధర్మాసనం కాకతాళీ యంగా ఆమోదించడమూ జరిగిపోయాయి. ఆందోళనలను ఎదుర్కొనే క్రమంలో మళ్లీ ఇప్పుడు కేంద్రం నాలిక్కరుచుకుని కొత్త మైనింగ్ అనుమతులేవీ ఇవ్వరాదని నిర్ణయించింది. స్థానిక నైసర్గిక స్వరూపం, జీవవైవిధ్యత, పర్యావరణ సున్నిత త్వాన్ని దృష్టిలో ఉంచుకుని తమ తాజా ఆదేశాలను ఆరావళీలోని మరికొన్నిగుట్టలు మైనింగ్ నుంచి రక్షణ పొందడం ఆహ్వానించదగిన నిర్ణయమే!

# బంగ్లా వైఖరి బయటపడేది ఎన్నికల తర్వాతే!

**ప్రస్తుతం తారిఖ్ రెహ్మాన్ ఎన్నికలలో గెలవటానికి తగ్గట్టుగా మాట్లాడుతున్నట్లు అనిపిస్తున్నది. భారత్ పట్ల ఇంతవరకూ వ్యతిరేకంగా మాట్లాడలేదు కానీ షేక్ హసీనాకు భారత్ ఆశ్రయం ఇచ్చిన నేపథ్యంలో పూర్తిగా భారత్‌తో స్నేహాన్ని అభిలషిస్తాడని చెప్పడం కష్టమే. 1971లో బంగ్లాదేశ్ విముక్తికి షేక్ ముజిబుర్ రహ్మాన్‌కు కానీ, ఇందిరా గాంధీకి కాని 'క్రెడిట్' ఇవ్వకుండా 'జియా'కు ఇవ్వడం రాజకీయం చేసే నాయకుడు మాట్లాడే విధంగానే ఉంది. అందుచేతనే భారత్ పట్ల రహమాన్ ధోరణిలో స్పష్టత లేదు. నిప్పుల కొలిమిలా ఉన్న బంగ్లా ఎన్నికల తర్వాతనే భారత్ పట్ల స్పష్టమైన వైఖరితో బయటపడగలదు. అంతవరకూ బంగ్లాదేశ్ మనకు ప్రశ్నార్థకమే!**



రావులపాటి సీతారాం రావు

పొరుగు దేశం బంగ్లాదేశ్, పాకిస్థాన్ మాదిరే భారత్‌కు మరో తలనొప్పిగా మారే సూచనలు ప్రగాఢంగా కనిపిస్తున్నాయి. ఇప్పటి నుంచే భారత దేశ దౌత్య నిపుణులూ విదేశాంగ శాఖ నిర్వహణలో ఆరితేరిన వారు తగు జాగ్రత్త చర్యలు తీసుకొని సముచిత రీతిలో రెండు దేశాల సంబంధాలను గాడిన పడేయకపోతే అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు ఆటంకాలు ఏర్పడతాయి. బంగ్లాదేశ్ నేషలిస్టు పార్టీ (బి.యస్‌పి) ఛైర్మెన్ ఒకప్పటి ప్రధాన మంత్రి ఖలీదా జియా, కుమారుడు తారిక్ రెహ్మాన్ (18 సంవత్సరాలు లండన్‌లో అజ్ఞాత వాసంలో ఉన్న నాయకుడు) స్వదేశానికి ఈ నెల వచ్చిన సందర్భంగా తాత్కాలిక నాయకుడుగా వ్యవహరిస్తున్న మహమ్మద్ యూనస్ అట్టహాసంగా స్వాగత ఏర్పాట్లు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఢాకాలో అతని రాకను ప్రతిపక్షాలు హిందూ నాయకులతో సహా తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఎలాంటి ఉపద్రవాలూ, అలజడులూ జరగబోతాయో అని ఆ దేశ ప్రజలు భయపడుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వాన్ని నడుపుతున్న యూనస్‌కు చట్టపరంగా బంగ్లాదేశ్‌కు సారథ్యం వహించటానికి ఎలాంటి హక్కూ లేదు. కొన్ని రోజుల క్రితం షరీఫ్ ఉస్మాన్‌హాదీ అనే యువ నాయకుడును చంపేసిన సందర్భంగా మరోసారి దేశంలో అలజడులు చెలరేగాయి. హాదీ ప్రధాన మంత్రి షేక్ హసీనా ప్రభుత్వానికి ప్రస్తుతం పదవీచ్యుతురాలై భారత్‌లో తలదాచుకుంటున్నది) వ్యతిరేకంగా ఉద్యమం నడిపిన వాడు! ప్రస్తుతం మరింత మార్పును రాజకీయ పార్టీలకు (జమల్ ఇస్లామీ పార్టీ లాంటి వాటికి) వెసులుబాటు కల్పించే విధంగా ఉండాలని లిబరేషన్ మూమెంట్ తర్వాత ఆలోచించిన నాయకుడు దారుణంగా డిసెంబరు 12 నాడు ఒక గన్‌మన్ కాల్పులకు గురై చంపబడ్డాడు. ఈ సందర్భంగా మీడియా సంస్థలపై అల్లరిమూకలు దాడులు కూడా చేశాయి. అవామీ లీగ్ ఆఫీసులు, కల్చరల్‌సెంటర్స్, మాజీ మంత్రుల గృహాలు ఇలా చాలా ఆస్తులపై దాడులు జరిగాయి. బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం తెచ్చిన ముజిబూర్ రెహ్మాన్ ఇంటిని కాల్చి వేశారు. అంతేకాదు ఒకహిందువును (25 సంవత్సరాల యువకుడ్ని) కూడా కిరాతకంగా చంపటాన్ని, దహనం చేయటాన్ని దారుణానికి పాల్పడ్డవారు ఫిల్మ్ తీశారు. షేక్ హసీనా నిష్క్రమణ జరిగి 15 నెలలు అవుతున్నది. అయినా బంగ్లాదేశ్‌లో అల్లరిమూకల దాడులు నిరాఘాటంగా సాగుతూనే ఉన్నాయి. ఒక విధంగా హసీనా నిష్క్రమణ, బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని నిర్మించుకోటానికి అవకాశాన్ని కల్పించినా అక్కడి అల్లరి మూకలు సాగన్వికుండా అలజడుల్లో మునిగితేలుతూనే ఉన్నారు. అవామీలీగ్ కార్యకర్తల మీద, హిందువుల మీద, మైనార్టీ వారి మీద ఇంకా అప్రతిహతంగా దాడులు జరుగుతూనే ఉన్నాయి. అవామీ లీగ్ మీద, స్టూడెంట్ ఆర్గనైజేషన్స్ మీద నిషేధం విధించి జమ్మత్– ఇ– ఇస్లామ్ మీద నిషేధం ఎత్తివేయడం గమనార్హం. బియన్‌పి లీడర్ రావడంతో రాజకీయాలు బంగ్లాదేశ్‌లో ఎలాంటి మార్పు తీసుకురాబోతాయో ఊహించటం కష్టం. ఎన్నికలు నిర్వహిస్తే కొంతలో కొంత ప్రజాస్వామ్యయుతంగా ఏర్పడిన ప్రభుత్వం సాధారణ పరిస్థితులు ఈ దేశంలో నెలకొల్పే అవకాశం ఉంది. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వంలోని ఆర్థిక సలహాదారు సలీహుద్దీన్ అహ్మద్ మాత్రం భారత్‌తో సత్సంబంధాలు ఏర్పరుచుకొనే దిశగా ఆలోచిస్తున్నామని ఢాకాలో ఈ తరుణంలో ప్రకటించడం ఆలోచించదగ్గ విషయంగానే మారింది. మహమ్మద్ యూనస్ ఆ దిశగా ప్రయత్నిస్తున్నారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధు



లు యూనస్, భారత ప్రభుత్వ ప్రతినిధులతో ప్రత్యక్షంగా మాట్లాడారా అని అడిగితే లేదనిచెబుతూ, ఇతర స్టేక్‌హోల్డర్స్‌తో చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు. ఎంతవరకు నమ్మాలో కానీ భారత్‌తో స్నేహసంబంధాలు పునరుద్ధరించుకోవాలనే ప్రయత్నాలు చేయాలని అనుకోవటం కూడా ఆహ్వానించదగ్గ పరిణామమే. పొరుగుదేశమైన బంగ్లాదేశ్ అనిశ్చిత పరిస్థితులలో ఉండటం భారత్‌కు మంచిది కానే కాదు. బంగ్లాదేశ్, భారత్‌కు తలనొప్పిగా మారుతున్నదని ఎందుకు విశ్లేషించాల్సి వస్తున్నదంటే అమెరికా ప్రభుత్వంలోనిన్యాయ నిపుణులు బంగ్లా తాత్కాలిక ప్రభుత్వ నాయకులతో దేశంలో ఎన్నికలు ఏవిధంగా జరుపుతే బాగుంటుందన్న విషయంలో సలహాలు, సూచనలు ఇచ్చిన సందర్భంలో ఢాకాలోని ప్రభుత్వ నాయకులు షేక్‌హసీనా పార్టీ అవామీ లీక్ మీద నిషేధం ఎత్తివేశారు. 2026 ఎన్నికల్లో ఆపార్టీ పాల్గొనే ప్రసక్తే లేదని ఖండితంగా చెప్పటంతో అక్కడ రాబోయే ఎన్నికలను ఒక తంతుగా మార్చే సూచనలు బహిర్గతమవుతున్నాయి. అదే జరిగితే 1971లో ఏర్పడిన అవామీలీగ్ పార్టీ ఎన్నికల్లో పాల్గొనకుండా ఉండటం మొదటిసారి అని భావించాలి. హసీనా మీద మరణశిక్ష విధించడం కూడా బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ నవంబరు 17 నాడు చేసింది. ఫిబ్రవరి 12, 2026 నాడు జరిగే ఎన్నికలలో దేశ బహిష్కృతులు, వలస పోయినవారు పాల్గొనే అవకాశం లేదని కూడా ప్రభుత్వ సలహాదారులు చెబుతున్నారు. ఈ సందర్భంగా హసీనా రాతపూర్వకంగా ఇచ్చిన ఇంటర్వ్యూలలో అవామీలీగ్‌ను సపోర్టు చేసే ఎవరూ ఈ జరగబోయే ఎన్నికలలో (తమ పార్టీపై నిషేధం అమలులో ఉన్న పక్షంలో) ఓటువేయరని చెప్పటం కూడా ఈఎన్నికలు ఏ విధంగా జరగబోతున్నాయనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోక తప్పదు. బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ నాయకుడు తారిఖ్ రహమాన్ ఢాకా రాగానే బ్రహ్మాండమైన ర్యాలీనుద్దేశించి ప్రసంగించాడు. ముఖ్యంగా వాక్ స్వాతంత్రం ఉండాలని ప్రజలనుద్దేశించి చెప్పటాన్ని చాలామంది మెచ్చుకుంటున్నారు. అంతేకాకుండా బంగ్లాదేశ్ అన్ని జాతుల వారు నివసించడానికి భద్రత ఉండాలని ప్రత్యేకంగా చెప్పటం విశేషం. దేశంలో శాంతి భద్రతలను పునరుద్ధరించాల్సిన అవసరాన్ని గురించి ప్రత్యేకంగా ఆయన ప్రస్తావించారు. కొండల్లో ఉండేవారు, మైదాన ప్రాంతాల్లో ఉండేవారు, ఎవరైనా ఈ దేశంలో నివాసయోగ్యులే అని చెప్పారు. అన్ని మతాల వారు హిందువులతోసహా ఉండటానికి సురక్షిత బంగ్లాదేశ్ నిర్మించుకోవాలని కూడా చెప్పారు. అయితే షేక్ హసీనాను మాత్రం బాగా ఈ ర్యాలీలో విమర్శించారు. 2024లో దేశస్వాతంత్ర్యాన్ని కాపాడుకోవటానికి ప్రజలందరూ సమాయత్తమై, 1971లో మాదిరి పోరాడారని రెండు సంఘటనలను పోల్చటంతోపాటు జనరల్ జియాకు బంగ్లాదేశ్ స్వాతంత్ర్యాన్ని మార్చి 26,1971 నాడు ప్రకటించారని ఆ ఘనత ఆయనకు ఆపాదించారు. అంతేకాదు 'ఆపరేషన్ సెర్చ్ లైట్' పేరిట స్వాతంత్ర్యయోధులను సంహరించడానికి పాకిస్థాన్ బలగాలు సిద్ధపడినప్పుడు స్వాతంత్ర్యాన్ని ప్రకటించి, బంగ్లా స్వాతంత్ర్య సమరయోధులను కాపాడారని చెప్పారు. ఏదిఏమైనా 2026లో బంగ్లాలో జరగబోయే ఎన్నికలు ఏ ఫలితాలతో బయటకు వస్తాయో ఊహించటం ఎవరికీ సాధ్యంకాని పరిస్థితి ప్రస్తుతం ఉన్నది. షేక్‌హసీనా గెలిచిన సీటులో ఒక హిందూ నాయకుడు పోటీకి దిగుతున్నాడని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఎన్నికల్లో మైనార్టీలు ముఖ్యంగా హిందూ మతస్తులు కూడా పాల్గొనటానికి సిద్ధంగా ఉండటం ప్రజాస్వామ్యానికి శుభసూచకంగా పరిగణించాలి. అయితే ప్రస్తుతం తారిఖ్ రెహ్మాన్ ఎన్నికలలో గెలవటానికి తగ్గట్టుగా మాట్లాడుతున్నట్లు అనిపిస్తున్నది. భారత్ పట్ల ఇంతవరకూ వ్యతిరేకంగా మాట్లాడలేదు కానీ షేక్ హసీనాకు భారత్ ఆశ్రయం ఇచ్చిన నేపథ్యంలో పూర్తిగా భారత్‌తో స్నేహాన్ని అభిలషిస్తాడని చెప్పడం కష్టమే. 1971లో బంగ్లాదేశ్ విముక్తికి షేక్ ముజిబుర్ రహ్మాన్‌కు కానీ, ఇందిరా గాంధీకి కాని 'క్రెడిట్' ఇవ్వకుండా 'జియా'కు ఇవ్వడం రాజకీయం చేసే నాయకుడు మాట్లాడే విధంగానే ఉంది. అందుచేతనే భారత్ పట్ల రహమాన్ ధోరణిలో స్పష్టత లేదు. నిప్పుల కొలిమిలా ఉన్న బంగ్లా ఎన్నికల తర్వాతనే భారత్ పట్ల స్పష్టమైన వైఖరితో బయటపడగలదు. అంతవరకూ బంగ్లాదేశ్ మనకు ప్రశ్నార్థకమే! •

# యాసంగికి సన్నద్ధమవుతున్న రైతన్న


బైరబోయిన వెంకటేశ్వర్లు

రాష్ట్రంలో యాసంగి సాగు ఊపందుకుంది. వానాకాలం పంటకు మొంథా తుఫాన్ చేసిన బీభత్సం నుండి తేరుకుంటూ యాసంగి పంటకు రైతులందరూ సన్నద్ధమవుతున్నారు. సాధారణంగా తుఫానులు జూలై, ఆగస్టు నెలలో ఎక్కువగా సంభవిస్తాయి. అప్పుడు పంటవయసు పెట్టిన పెట్టుబడి తక్కువ ఉంటుంది. కానీ ఈసంవత్సరం మొంథా తుఫాన్‌మాత్రం అక్టోబర్ నెల చివరన వచ్చి రైతు చేతికందే పంటను నేలపాలు చేసింది. రైతు ఆరు నెలల కష్టాన్ని బూడిద పాలు చేసింది. ఈ తుఫాన్ రాష్ట్రంలో దాదాపుగా ఆరులక్షల ఎకరాలకు పైగా పంట నష్టం చేసింది. అందులో వరి మూడులక్షల ఎకరాలు, పత్తి లక్షన్నర ఎకరాలు, మొక్కజొన్న, మిగతా పంటలు అన్నికలసి 50 వేలా ఎకరాల వరకు నష్టం చేసింది. ఒక వరంగల్ జిల్లాలోనే రెండు లక్షల ఎకరాలకు పైగా పంట నష్టం చేసిందని అంచనా వేశారు. వానాకాలం పంట కాలంలో యూరియా కోసం రైతులు పడ్డ తిప్పలు అందరికీ తెలిసేఉంటుంది. ఎరుపెక్కిన పంటను తిరిగి పచ్చగా మార్చి నేలలో నత్రజని శాతాన్ని పెంచడానికి కావాల్సిన యూరియా కోసం పడినపాట్లు అన్నీ ఇన్నీకావు. ఇంతటి కష్టాన్ని గట్టెకి యూరియా సంపాదించి పంటను కాపాడుకుంటే తీరా చేతికొచ్చేసరికి తుఫాన్ ప్రభావానికి లోనయ్యాయి. ఈ పంట నష్టానికి రైతులకు ప్రభుత్వాల నుండి వచ్చే పరిహారం అంతంత మాత్రమే అని చెప్పాలి. సూర్యుడు అస్తమించిన తిరిగి ఉదయించినట్టుగానే భూమినే నమ్ముకునే రైతులు సాగు చేయాడం ఆపరు. రైతులకు ప్రత్యామ్నాయం లేకనే ఎంత నష్టం జరిగిన మళ్ళీ భూమినే నమ్ముకుంటాడు. వానాకాలం పంటల సాగు వర్షాలపై ఆధారపడిన యాసంగి సాగుకు మాత్రం బోర్లు, బావులు, చెరువులు, రిజర్వాయర్ల ద్వారా వచ్చే నీటి పారకం పైన ఆధారపడుతుంది. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం ఈ సంవత్సరం సగటు సాధారణ వర్షపాతం 850 మీ.మీగా పడాల్సి ఉంటే ఇప్పటివరకు 1178 మి.మి వర్షపాతం పడింది. ఇది సాధారణం కన్నా 39శాతం ఎక్కువగా నమోదైంది. గత సంవత్సరంతో పోలిస్తే 1045మి.మి కన్నా ఎక్కువ. రాష్ట్రవ్యాప్తంగా 4జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైతే 29 జిల్లాలో అధిక వర్షపాతం నమోదైంది. ఈ అధిక వర్షపాతం వల్ల భూగర్భ జలాల నీటిమట్టంకూడా పెరిగింది. ప్రస్తుతం బావులు, చెరువులు, రిజర్వాయర్లు నీటితో కలకలలాడుతున్నాయి. అలగే రిజర్వాయర్లలో నీటి నిల్వ సామర్థ్యం గత ఏడాది డిసెంబర్ చివరి నాటికి 790 టీఎంసీలు ఉంటే అది ప్రస్తుతానికి 840 టీఎంసీలుగా ఉంది. రాష్ట్రంలో సరాసరి భూగర్భ జలలా నీటి మట్టం నవంబర్ చివరి నాటికి అత్యల్పంగా నాగర్ కర్నూల్ జిల్లాలో గ్రౌండ్ లెవల్ నుండి 1.89 మీటర్ లోతులో ఉంటే అత్యధికంగా భూపాలపల్లి జిల్లాలో 7.71 మీటర్ లోతులో ఉన్నాయి. రాష్ట్ర సరాసరి భూగర్భ జలాల నీటి మట్టం 4.41 మీటర్‌గా ఉంది. ఇది గతడేది నవంబరు చివరినాటికి 6.05 మీటర్‌గా ఉండేది. ఈ గణాంకలన్నీ యాసంగి సాగుకు కావాల్సిన నీటిలభ్యత పుష్కలంగా ఉంది అనే చెబుతున్నాయి. ఒకప్పుడు పత్తి ఏడాది పంటగా ఉండేది ఇప్పుడు ఆరు నెలల పంటగా మారింది. గత పది సంవత్సరాలుగా వర్షాలు పుష్టిగా పడటంతో పత్తి పంట వానాకాలానికే పరిమితమై యాసంగిలో మొక్కజొన్న పంటను వేస్తున్నారు. ఇప్పుడు యాసంగిలో వరి, మొక్కజొన్న ప్రధాన పంటలుగా సాగవుతున్నాయి. యాసంగిలో సాధారణ సాగు భూమి 68.67 లక్షలుగా అంచనా వేస్తే డిసెంబరు ముడోవారానికి 8.20 ఎకరాలలో పంట సాగు మొదలైంది. వరి పంట 51 లక్షల ఎకరాలకు గాను లక్ష ఎకరాలు, మొక్కజొన్న ఆరున్నర లక్షల ఎకరాలకు గాను నాలుగులక్షల ఎకరాలలో సాగు మొదలైంది. లక్షన్నర ఎకరాలు శనగ సాగు ఐతే మిగిలినవి పప్పుధాన్యాలు సాగు అవుతున్నాయి. ఇప్పటివరకు 26 జిల్లాలో 25 శాతం లోపు 6 జిల్లాలో 25 శాతం పైగా సాగు జరుగుతుంది. పంట చేతికందే వరకు రైతు ముందున్నవి ప్రకృతి విపత్తులు ఒక సమస్య ఐతే మానవ విపత్తులు మరో సమస్య. యాసంగి పంట చేతికొచ్చే వేసవికాలంలోనే ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వానలు కురుస్తాయి. ఇవి వరి మొక్కజొన్న పంటలతో పాటు మామిడి తోటలకు తీవ్ర నష్టం చేస్తాయి. స్వార్థం లేని పుడమి పంటనివ్వడానికి సిద్ధంగా ఉన్న ధన దాహానికి మానవ స్వార్థపూరితమైన ఆలోచనలు రైతులకు ఎక్కువ నష్టం చేస్తున్నాయి. పంట ప్రారంభంలోనే నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువుల సమస్య ఒక వైపు ఐతే దిగుబడి అయిన పంటకు గిట్టుబాటు ధర లేక దళారుల మధ్య మోసపోవడం మరోసమస్య. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి సాయం క్రింద రైతు భరోసా అందిస్తున్న, ప్రధానంగా నకిలీ విత్తనాల తయారీని నిర్మూలిస్తు యాసంగిపంటకు కావాల్సిన ఎరువులు, యూరియా, విద్యుత్‌ను అందుబాటులో ఉంచడంపై దృష్టిపెట్టాలి. అలాగే వానాకాలంలాగా యూరియా కొరత లేకుండా చూస్తూ అవసరానికి కావాల్సిన యూరియా సరఫరాచేస్తూ పరిమితికి మించి వాడితే భూమిలో ఆమ్లశాతం పెరుగుతుందని, దాని పర్యవసానాల పైఅలాగే పంటకు తగ్గట్టుగా నేలలోపోషకాలు వృద్ధిపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరంఉంది. •

# గ్రామీణాభివృద్ధికి అడుగులు పడేనా?

తిప్పర్తి శ్రీనివాస్

తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల కొలువుదీరిన 12,702 మంది సర్పంచులు, 1,11,803 మంది వార్డు సభ్యులు గ్రామ పాలనలో కీలక బాధ్యతలు చేపట్టారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామ పంచాయతీ అనేది పునాదివంటిది. గ్రామ పంచాయతీ బలంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధిబాటలో నడు స్తుంది. అలాంటి గ్రామ పంచాయతీలకు నాయకత్వం వహించే సర్పంచుల పాత్ర అత్యంత కీలకం. అయితేగ్రామాభివృద్ధి అనేది మాటల్లో కాకుండా కార్యరూపంలోకి రావాలంటే సర్పంచులు అనేక సవాళ్లను ఎదుర్కొని, అవగాహనతో, నిబద్ధతతో పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గ్రామ సర్పంచుల ముందు నిలిచే మొదటి పెద్ద సవాలు అభివృద్ధి పట్ల సరైన అవగాహన లేకపోవడం. చాలా మంది సర్పంచులు ప్రజాభిమానంతో ఎన్నికైనా, పాలనా విధానాలు, ప్రభుత్వ పథకాలు, నిధుల వినియోగం, చట్టపరమైన అంశాలపై పూర్తిస్థాయి అవగాహన లేకపోవడం కనిపిస్తోంది. ఫలితంగా గ్రామానికి రావాల్సిన నిధులను సద్వినియోగం చేయలేకపోవడం, లేదా పథకాలను పూర్తిగా అమలు చేయలేకపోవడం జరుగుతోంది. కాబట్టి గ్రామాభివృద్ధి కోసం ముందు సర్పంచులే శిక్షణపొందాల్సిన అవసరంఉంది. నిధుల కొరత మరో ప్రధాన సమస్య. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు నిధులు వస్తున్నా అవి చాలవు. రోడ్లు, తాగు నీరు, పారిశుధ్యం, వీధిదీపాలు, పాఠశాలలు, ఆరోగ్య సదుపాయాలు వంటి అనేక అవసరాలకు ఒకేసారి నిధులు అవసరం అవుతాయి. కానీ పరిమిత నిధులతో అన్ని పనులు చేయడం సర్పంచులకు పెద్ద సవాలుగా మారుతోంది. అంతేకాకుండా, కొన్నిసార్లు నిధులు ఆలస్యంగా రావడం వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయి. నిధులు వచ్చినా వాటి సరైన వినియోగం కూడా ఒక పెద్దసమస్యే. సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం, అధికారులపై ఆధారపడాల్సి రావడం వల్ల కొన్ని చోట్ల అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఇది గ్రామాభివృద్ధికి పెద్దఅడ్డంకిగా మారుతోంది. సర్పంచులు నిజాయితీగా ఉన్నా, వ్యవస్థలోని లోపాలవల్ల ప్రజల్లో వారి మీదనమ్మకం తగ్గేపరిస్థితి ఏర్పడుతోంది. గ్రామాభివృద్ధి




లో మరోసవాలు ప్రజల భాగస్వామ్యం లేకపోవడం. అభివృద్ధిఅనేది కేవలం సర్పంచి బాధ్యత మాత్రమే కాదు. గ్రామ ప్రజలందరూ భాగస్వాములు కావాలి. కానీ చాలా గ్రామాల్లో ప్రజలు సమావేశాలకు రాకపోవడం, గ్రామసభలను పట్టించుకోకపోవడం కనిపిస్తోంది. ఫలితంగా సర్పంచులు తీసుకునే నిర్ణయాలకు పూర్తిమద్దతు లభించడంలేదు. ప్రజల సహకారం లేకుండా అభివృద్ధి సాధ్యం కాదు. రాజకీయ జోక్యం కూడా సర్పంచుల పనితీరును ప్రభావితం చేసే అంశం. గ్రామస్థాయిలోనే వర్గపోరులు, రాజకీయ విభేదాలు సర్పంచుల ముందున్న పెద్ద సమస్య. అభివృద్ధి పనులను రాజకీయ కోణంలో చూసి అడ్డుకోవడం, వ్యక్తిగత లాభనష్టాల కోసం పనులను నిలిపివేయడం జరుగుతోంది. దీనివల్ల గ్రామానికి మేలు చేసే పనులు కూడా ఆలస్యమవుతున్నాయి. ఇక అధికారులతో సమన్వయం లోపించడం కూడా ఒక సవాలే. గ్రామ పంచాయతీకి సంబంధించిన పనుల్లో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీర్లు, ఇతర శాఖల అధికారులు కీలక పాత్ర పోషిస్తారు. వీరితో సమన్వయం సరిగా లేకపోతే పనులు ముందుకు సాగవు. కొన్నిసార్లు అధికారుల నిర్లక్ష్యం, ఆలస్యంవల్ల సర్పంచులు ప్రజల విమర్శలకు గురవుతున్నారు. అయితే ఈ సవాళ్ల మధ్య సర్పంచులు చేయాల్సిన బాధ్యతలు మరింత పెరుగుతున్నాయి. కేవలంప్రభుత్వ నిధులపై ఆధారపడకుండా స్థానికంగా నిధులు సృష్టించుకోవడం నేటి అవసరం. గ్రామపంచాయతీ పరిధిలోని మార్కెట్లు, వారపుసంతలు, దుకాణాలు, ప్రకటనల ద్వారా ఆదాయం పెంచుకోవచ్చు. ఆస్తిపన్ను, నీటి పన్నువంటి వాటిని సమర్థవంతంగా వసూలు చేయడంద్వారా కూడా గ్రామానికి ఆదాయం సమకూర్చుకోవచ్చు. ఈ విషయంలో సర్పంచులు ధైర్యంగా, పారదర్శకంగా వ్యవహరించాలి. అలాగే సాంకేతిక పరిజ్ఞానం వినియోగం కూడా ఎంతో అవసరం. డిజిటల్ పాలన, ఆన్‌లైన్ దరఖాస్తులు, పారదర్శక లెక్కల నిర్వహణ ద్వారా గ్రామపాలన మరింత సమర్థవంతంగా మారుతుంది. యువతను గ్రామాభివృద్ధిలో భాగస్వాములుగా చేయడం ద్వారా కొత్త ఆలోచనలు, కొత్తమార్గాలు ముందుకువస్తాయి. మొత్తంగా చూస్తే, తెలంగాణ గ్రామ సర్పంచుల ముందు ఉన్న సవాళ్లు అనేకమైనా, అవి అధిగమించలేనివి కావు. సరైన అవగాహన, నిజాయితీ, ప్రజల భాగస్వామ్యం, అధికారులతో సమన్వయం, స్థానిక నిధుల సృష్టివంటి అంశాలపై దృష్టి సారిస్తే గ్రామాభివృద్ధిసాధ్యమే. గ్రామం అభివృద్ధిచెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. ఆ అభివృద్ధికి పునాది వేయాల్సిన బాధ్యత గ్రామ సర్పంచులదే. •

విజయం మేధావిని వినయవంతుణ్ని చేస్తుంది. సామాన్యుడిని ఆశ్చర్యపరుస్తుంది. అవివేకిని అహంభావిగా మారుస్తుంది.



స్వామి వివేకానంద

అధర్మంగా ఆర్జించిన సంపాదనతో ఆచరించిన సత్కర్మలు సత్ఫలితాలనివ్వవు.



ఆస్కార్‌వైల్డ్

# ప్రజావాక్కు



## వార్తా పత్రికలను చదవాలి

చరవాణి చేతులలోకి విస్తృతంగా వచ్చి చేరిన తరువాత చాలామంది పిల్లలు, పెద్దలు వాటిఉచ్చులో పడి పుస్తకాలను, వార్తా పత్రికలను చదవడం తగ్గించారని అనాలో లేక మానేశారని అనాలో. ఇప్పటి విద్యార్థులు ముఖ్యంగా టెక్నికల్ కోర్సులు చదివేవారికి దేశ కాల, మాన పరిస్థితులు తెలుసుకోవాలనే జిజ్ఞాస కూడాలేదు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంఅన్ని గవర్నమెంట్ స్కూళ్లలో ప్రతిరోజూ విద్యార్థులచే వార్తా పత్రికలలో వచ్చిన ముఖ్యమైనవి చదివి తీరాలనే నిర్ణయం కొన్ని రోజుల క్రితం తీసుకున్నది. మన తెలుగు రాష్ట్రాలలో కూడా ఈ నిర్ణయాన్ని అమలు పరచాలి. ఇంజినీరింగ్ క్యాంపస్ ఇంటర్వ్యూలలో వారి సబ్జెట్ మీద పూర్తి అవగాహన ఉన్నా జనరల్ నాలెడ్జ్ దాదాపు సున్నా. చరవాణిలో చదవడం కంటి, ఒంటి ఆరోగ్యానికి మంచిది కాదని వైద్యులు చెబుతున్నారు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## సర్దుబాటు ముఖ్యం

బంగ్లా సంక్షోభం తారా స్థాయికి చేరింది. దానికి ప్రధాన కారణం యూనిస్‌అంటే అతిశయోక్తికాదేమో. శాంతి దూత కష్ట కాలంలో దేశాన్ని నడపడంలో విఫలం అయ్యారు. చైనా, పాకిస్థాన్ చెంతన చేరి బలమైన మూలాలు కలిగిన భారత్‌తో బంధాలు ఇరుకున పెట్టుకున్నారు. 4096 కిలో మీటర్ల సరిహద్దుకలిగిన మనదేశంతో చారిత్రక జాతీయ వాదాస్నేహం కలిగిఉన్న ఆ దేశంపాకిస్థాన్ నుండి విముక్తి పొందడంలో భారత్ చేసిన సహాయాన్ని కూడా మరిచినట్టు ఉంది. అస్సాం, బెంగాల్ లాంటి రాష్ట్రాలలో మళ్ళీ వలసలు పెరిగే అవకాశం ఉంది. భారత్ కూడా బంగ్లాలో ఎవరు అధికారంలో ఉన్నవాళ్లతో సర్దుబాటు చేసుకోవాలి.

- భారత అవినాష్, జనగామ

## వికలాంగులకు న్యాయం చేయాలి

వికలాంగులు కష్టపడి సంపాదించిన డబ్బులు పొదుపు చేసుకుంటే అవసరానికి అప్పుతీసుకొన్నవారు, సకలాంగులు తిరిగిఇవ్వాడంలో చాలా ఇబ్బందులు పెడుతున్నారు. వికలాంగుల నుండి అప్పులు తీసుకొన్నవారు కూడా అడిగితేదాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారు. వికలాంగులు చాలా కష్టపడి సంపాదించిన డబ్బులు అప్పుగా తీసుకున్నవారు తిరిగి ఇవ్వడంలో వివక్షత చూపుతున్నారు.

-రాపాక రవీందర్, జనగాం

## రైల్వేలు ప్రజాసేవా వ్యవస్థలు

భారతీయ రైల్వేలు ఒకప్పుడు సామాన్యుడి జీవనరేఖగా వెలుగొందాయి. కానీ ప్రస్తుత పరిణామాలు ఆ ప్రజాస్వామ్య స్వరూపాన్ని మసకబారుస్తున్నాయి. గత జూలైనుంచి రాబోయే మార్చి వరకు విడతల వారీగా పెంచిన చార్జీల వల్ల ప్రయాణికులపై దాదాపు రూ.1,300కోట్ల అదనపు భారం పడనుంది. ప్రభుత్వానికి ఇది ఆదాయ వనరుగా కనిపించినా, సామాన్యుడి జేబుకు ఇది పెద్ద చిల్లు. ఆధునికీకరణ పేరుతో సాధారణ రైళ్లను తగ్గించి, ఖరీదైన వేగవంతమైన రైళ్లను పెంచడం వల్ల పేద, మధ్యతరగతి వర్గాలకు ప్రయాణం భారంగా మారుతోంది. చార్జీలు పెరుగుతున్నా రైళ్ల జాప్యం, శుభ్రతలోపం, రద్దీ వంటి సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. దీనికి తోడు రైల్వే సేవల్లో ప్రైవేటు భాగస్వామ్యం పెరగడం వల్ల నిర్వహణ వ్యయం పెరిగి, ఆభారం చివరకు ప్రయాణికులపైనే పడుతోంది. రైల్వేలు కేవలం లాభనష్టాల కోసం నడిచే వాణిజ్య సంస్థలు కావు, అవి ప్రజాసేవా వ్యవస్థలు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## పరిశ్రమ విద్యాసంస్థల అనుసంధానం

ప్రస్తుతం ఉన్న డిగ్రీ, పీజీ సిలబస్‌లో కాలానికి అనుగుణమైన మార్పులు అత్యవసరమయ్యాయి. ఉద్యోగమార్కెట్ పెద్దఎత్తున మారిపోయింది. పరిశ్రమలు నైపుణ్యాలు, ప్రాక్టికల్ పరిజ్ఞానం, సమస్య పరిష్కార సామర్థ్యాన్ని కోరుతున్నాయి. కానీ మన సిలబస్‌లో ఇంకా పాతసిద్ధాంతాలు, కాలంచెల్లిన మాడ్యూల్స్, ప్రయోగాత్మక శిక్షణకు తక్కువ అవకాశాలు ఉన్నాయి. విద్యార్థి పుస్తక జ్ఞానంతో బయటకు వస్తున్నాడు. కానీపరిశ్రమ అవసరాలకు సిద్ధంగా ఉండటంలేదు. ఫలితంగా చదువుకున్న నిరుద్యోగం పెరుగుతోంది. ప్రభుత్వంముందుగా పరిశ్రమ–విద్యాసంస్థల అనుసంధాన విధానాన్ని బలోపేతం చేయాలి.

- కె.రామారావు, నల్గొండజిల్లా

## సీట్ల కొరత

భారత దేశంలో డిమాండ్ ఉన్న కోర్సులు చదువుకునేందుకు సీట్ల కొరత అలాగే చదివిన చదువులకు ఉద్యోగాల కొరత ఉంది. ఎంబీబీఎస్ , ఇంజనీరింగ్ , ఎంబీఏ, తదితర ఉన్నత చదువులు విదేశాల్లో చదవలసిన పరిస్థితి ఉంది. డిమాండ్ ఉన్న కోర్సుల సీట్‌లను భారత్‌లో పెంచితే విదేశాలకు వెళ్లే అవకాశం ఉండదు. చదివిన చదువులకు తగ్గట్టుగా ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించాలి.

-డి చాంద్ బాషా, కర్నూలు

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# దేశ భద్రతలో రాజీ లేదు



## 'ఆపరేషన్ సిందూర్'తో ప్రపంచానికి చాటిచెప్పాం

ప్రగతి సంవత్సరంగా నిలిచిన 2025

### దేశ భవిష్యత్తుకు యువతే ప్రధాన బలం

### యువశక్తితోనే వికసిత్ భారత్ లక్ష్యం సాధ్యం

### మన్‌కీ బాత్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

### నరసాపురం అల్లికలు ప్రత్యేకంగా ప్రస్తావన



**న్యూఢిల్లీ, డిసెంబరు 28:** దేశ భద్రత విషయంలో ఎలాంటి రాజీపడబోమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. 'మన్‌కీ బాత్'129వ ఎపిసోడ్‌లో ప్రధాని ప్రసంగించారు. ఇందులో భాగంగా 2025లో భారతదేశం సాధించిన విజయాలను గుర్తు చేసుకున్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ ప్రపంచ దేశాలకు తన బలాన్ని చూపించిందని చెప్పారు. దేశంలోని ప్రతిపౌరుడికి ఈ ఆపరేషన్ గర్వకారణంగా మారిందన్నారు. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్‌ను మారుతున్న భారతానవనిగా అభివర్ణించి, సైనిక విజయాన్ని దేశవ్యాప్త దేశభక్తిని పెంచిన ఘటనగా ప్రధాని ప్రశంసించారు. ఈ ఏడాది భారత్.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చూపిన ధైర్యం, స్వదేశీ ఆయుధాలు, టెక్నాలజీ ఉపయోగం ద్వారా సాధించిన విజయాలను మోదీ ప్రశంసించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశం ఉగ్రవాదాన్ని రూపుమాపే నిర్ణయాన్ని చాటిందని, ఇది కేవలం సైనిక చర్య కాదు.. మారుతున్న భారత్ బలాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. నేటి భారత్ భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడబోదని ప్రపంచానికి స్పష్టమైన సంకేతాన్ని ఇచ్చిందని అన్నారు. అంతేకాకుండా, గిర్ అడవుల్లో ఆసియాటిక్ సింహాల సంఖ్య పెరుగుదల, మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి, మహిళా సాధికారత వంటి అంశాలను కూడా ప్రధాని ప్రస్తావించారు. 2025 సంవత్సరం అన్ని రంగాల్లో భారత గణనీయమైన ప్రగతి సాధించిన సంవత్సరంగా నిలిచిందని ప్రధాని తెలిపారు. దేశ భవిష్యత్తుకు యువతే ప్రధాన బలమని, యువశక్తితోనే వికసిత్ భారత్ లక్ష్యం సాధ్యమని పేర్కొన్నారు. స్టార్టప్‌లు, వ్యవసాయం, ఫిట్‌నెస్ వంటి రంగాల్లో యువత వినూత్న ఆవిష్కరణలతో ముందుకు వస్తోందని, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సరికొత్త టెక్నాలజీ, ఆవిష్కరణలను అందిపుచ్చుకోవాలని సూచించారు. క్రీడల్లో కూడా ఈ ఏడాది భారత్ చిరస్మరణీయమైన విజయాలను సాధించిందని తెలిపారు. నూతన సంకల్పాలు, స్పష్టమైన లక్ష్యాలతో 2026లోకి అడుగుపెడుతున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్:2026 జనవరి 12న వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ రెండో ఎడిషన్ జరగనున్నదని ప్రధాని తెలిపారు. యువత తమ ఆలోచనలు, అభిప్రాయాలను ఎలా పంచుకోవాలో సూచించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని, ఇందులో ప్రధాన మంత్రి స్వయంగా పాల్గొనున్నట్లు వివరించారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ వంటి కార్యక్రమాలు యువత ఆలోచనలను ఆచరణ లోకి తేవడానికి దోహదపడుతున్నాయని తెలిపారు. ఐఐఎస్‌సీకి చెందిన గీతాంజలి, దుబాయ్‌లోని కన్నడ పాఠశాల, జమ్మూ-కాశ్మీర్ సాంస్కృతిక వారసత్వంవంటి అనేక ప్రేరణాత్మక ఉదాహరణలను ప్రధాని ప్రస్తావించారు. వందేమాతరం గేయం 150 ఏళ్ల పూర్తి చేసుకున్నప్పుడు కూడా దేశ ప్రజల్లో ఇదే స్ఫూర్తి కనిపించిందని ప్రధాని చెప్పారు. క్రీడలపరంగా కూడా ఈ ఏడాది చిరస్మరణీయమేనని మోదీ అన్నారు. 12 ఏళ్ల తర్వాత టీమిండియా పురుషుల క్రికెట్ జట్టు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని సొంతం చేసుకుందని, మహిళల క్రికెట్ జట్టు మొదటిసారి వన్డే ప్రపంచకప్ గెలుచుకుందని తెలిపారు. మహిళల అంధుల జట్టు టీ20 ప్రపంచ కప్పు గెలుచుకొని చరిత్ర సృష్టించిందని గుర్తుచేశారు. అంతరిక్ష రంగంలోనూ ఈ ఏడాది భారత్ తన ప్రతిభను చాటుకుందని ప్రధాని అన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన శుభాన్షు శుక్లాను ఆయన ప్రశంసించారు. మహా కుంభమేళాకు కోట్లాదిమంది తరలివచ్చారని, ఆ సంఖ్యను చూసి ప్రపంచం ఆశ్చర్యపోయిందని ప్రధాని తెలిపారు. అయోధ్య రామాలయంలో జరిగిన ధ్వజారోహణ కార్యక్రమం ప్రతి హిందువు గర్వపడేలా చేసిందని చెప్పారు. ఈ ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన అనేక పథకాలను గుర్తుచేశారు. దేశ ప్రజలు స్వదేశీ ఉత్పత్తుల పట్ల గొప్ప ఉత్సాహాన్ని చూపిస్తున్నారని, వోకల్ ఫర్ లోకల్‌ను మరింత బలోపేతం చేయాలని, దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ రంగంలో శుభాంశు శుక్లా సాధించిన విజయాలతో దేశకీర్తి మరింత పెరిగిందని కొనియాడారు. భారతీయ భాషల ప్రోత్సాహానికి ప్రత్యేకంగా తమిళ భాషకు కాశీ తమిళ సంగమం వంటి కార్యక్రమాల ద్వారా జరుగుతున్న కృషిని ప్రధాని ప్రశంసించారు. స్వాతంత్ర్య సమరయోధురాలు పార్వతి గిరి జీ నివాళి అర్పించారు. యాంటీబయోటిక్స్ దుర్వినియోగంపై ప్రజలను అప్రమత్తం చేస్తూ, ఆరోగ్యంపై జాగ్రత్త అవసరమని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నరసాపురం లేస్ కళాకారులను అభినందించారు, కచ్ వైట్ రణ్ణు భారతదేశ సహజ సౌందర్యానికి ప్రతీకగా పేర్కొన్నారు. ప్రజలక్ష్మీ, ప్రేరణాత్మక కథలతో భారత్ 2026లో మరింత ఉత్సాహంగా అడుగుపెడుతుందని ప్రధాని నరేంద్ర మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. 2025లో దేశ ప్రజలు ఏ విధంగా ఐక్యతతో సామరస్యంగా ఉన్నారో అదేవిధంగా కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాలని పిలుపునిచ్చారు. నూతన సంవత్సరంలో దేశాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

## ఖాప్ పంచాయతీ కఠిన నిర్ణయాలు

### 18యేళ్లలోపు వారికి స్మార్ట్‌ఫోన్ నిషేధం

### యువతీయువకులు బయటకు వస్తే షార్టులు, హాఫ్ పాంట్లు నిషేధం

### సామాజిక బాధ్యతలు గుర్తుచేస్తున్న గ్రామపెద్దలు



**భాగ్‌పట్,(యుపి), డిసెంబరు 28:** సామాజిక విలువల పరిరక్షణ పేరుతో ఉత్తరప్రదేశ్‌లోని బాగ్‌పత్ జిల్లాకు చెందిన థాంబా పట్టి మెహార్ దేశ్ ఖాప్ పంచాయతీ పలు సంచలన నిర్ణయాలు తీసుకుంది. యువత దారి తప్పుతోందని, క్రమశిక్షణ లోపిస్తోందని భావించిన ఖాప్ నేతలు విద్యార్థులు, యువత జీవనశైలిపై కఠిన ఆంక్షలు విధించారు. 18 ఏళ్ల లోపు పిల్లలు స్మార్ట్‌ఫోన్లు వాడటం వల్ల చదువుపై శ్రద్ధ తగ్గడమే కాకుండా పెద్దల పట్ల అవిధేయత పెరుగుతోందని ఖాప్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. టీనేజర్లకు మొబైల్ ఫోన్లను నిషేధించారు. బహిరంగ ప్రదేశాల్లో అబ్బాయిలు హాఫ్ ప్యాంట్లు, అమ్మాయిలు షార్ట్స్ ధరించకూడదని ఆదేశించారు. అబ్బాయిలు కుర్తాపైజమా, అమ్మాయిలు సల్వార్‌కమీజ్ వంటి సంప్రదాయ దుస్తులే ధరించాలని సూచించారు. ఇంట్లో ఎలాంటి దుస్తులైనా వేసుకోవచ్చని, కానీ బయటకు వచ్చేటప్పుడు మాత్రం సామాజిక నిబంధనలు పాటించాలని హుకుం జారీ చేశారు. కేవలం యువతపైనే కాకుండా వివాహ వేడుకల విషయంలోనూ ఖాప్ పంచాయతీ కీలక మార్పులు సూచించింది. వివాహాలు మ్యారేజ్ హాళ్లలో కాకుండా గ్రామాల్లో లేదా సొంత నివాసాల్లోనే జరుపుకోవాలని పేర్కొంది. మ్యారేజ్ హాల్ కల్చర్ వల్ల కుటుంబ బంధాలు బలహీనపడుతున్నాయని వారు అభిప్రాయపడ్డారు. పెళ్లి పత్రికల ముద్రణ ఖర్చును తగ్గించేందుకు వాట్సాప్ ద్వారా ఆహ్వానాలు పంపడం ఉత్తమమని స్పష్టం చేశారు. ఖాప్ పంచాయతీ తీసుకున్న ఈ నిర్ణయాలకు రాజకీయ నాయకుల నుంచి కూడా మద్దతు లభిస్తోంది. కాంగ్రెస్ సీనియర్ నేత చౌదరి యశ్‌పాల్ సింగ్, ఆర్ఎల్‌డీ ఎంపీ రాజ్‌కుమార్ సాంగ్వాన్ ఈ నిర్ణయాలను సమర్థించారు. సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడేందుకు ఇటువంటి నిర్ణయాలు అవసరమని వారు అభిప్రాయపడ్డారు. ఈ నియమాలను ఉత్తరప్రదేశ్ అంతటా అమలు చేసేందుకు ఇతర ఖాప్ కౌన్సిళ్లతో కూడా చర్చలు జరుపుతామని ఖాప్ ప్రతినిధులు తెలిపారు.

## పుణే మున్సిపల్‌ఎన్నికల్లో గ్యాంగ్‌స్టర్

### పోలీస్ బందోబస్తుతో వచ్చి నామినేషన్



**పూణె, డిసెంబరు 28:** పుణెలో జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు చర్చనీయాంశంగా మారాయి. స్థానిక గ్యాంగ్‌స్టర్, మనవడి హత్య కేసులో ప్రధాన నిందితుడైన బందు అందేకర్ శనివారం నామినేషన్ దాఖలు చేశాడు. ప్రస్తుతం ఎరవాడ సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న అతడు భారీ పోలీసు భద్రత నడుమ ప్రభుత్వ కార్యాలయానికి చేరుకున్నాడు. పోలీసు వ్యాన్‌లో వచ్చిన బందు అందేకర్ చేతులకు తాళ్లు కట్టి ఉండగా, ముఖానికి నల్లటి గుడ్డ కప్పి ఉంది. భవానీ పేటలోని నామినేషన్ కేంద్రానికి తీసుకురాగానే పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ లోపలికి వెళ్లాడు. మనవడు ఆయుష్ కోమ్కర్ హత్య కేసులో అందేకర్ ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రత్యేక కోర్టు అనుమతి ఇవ్వడంతో స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి దిగాడు. అందేకర్ మాత్రమే కాకుండా, ఇదే కేసులో నిందితులుగా ఉన్న అతడి సోదరుడి భార్య లక్ష్మి అందేకర్, కోడలు సోనాలి అందేకర్ కూడా కోర్టు అనుమతితో నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. పుణె మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మరో 28 సంస్థలకు జనవరి 15న ఎన్నికలు జరగనున్నాయి. మాజీ కార్పొరేటర్, బందు అందేకర్ కుమారుడు వనరాజ్ అందేకర్ గతంలో హత్యకు గురయ్యాడు. దీనికి ప్రతీకారంగానే మనవడు ఆయుష్ కోమ్కర్‌ను సెప్టెంబర్ 5న కాల్చి చంపినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ దారుణ హత్య వెనుక అందేకర్ గ్యాంగ్ ప్రమేయం ఉందని ఆరోపణలు ఉన్నాయి.

## హమాస్ నిరాయుధీకరణను ఒప్పుకోం

### అమెరికా ప్రణాళికలో పాక్ మెలిక



**ఇస్లామాబాద్, డిసెంబరు 28:** గాజాలో ఇంటర్నేషనల్ స్టెబిలైజేషన్ ఫోర్స్‌లో భాగంగా తమ దళాలను పంపించడానికి సానుకూలంగా స్పందించిన పాక్ ఇందుకు ఓ మెలిక పెట్టింది. అమెరికా ప్రతిపాదిత 20 అంశాల ప్లాన్‌లో హమాస్‌ను నిరాయుధీకరించాలన్న పాయింట్‌ను తొలగించినప్పుడే తాము భాగమవుతామంది. ఈ మేరకు పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ స్టెబిలైజేషన్ ఫోర్స్ (ఐఎస్ఎఫ్)లో తమ దేశం భాగం కావడం చాలా సున్నితమైన అంశంగా అభివర్ణించారు. శాంతిని పరిరక్షించే దళంగానే పాకిస్థాన్ కొనసాగుతుందన్నారు. 'మమ్మల్ని శాంతి నెలకొల్పే చర్యలు లేదా హమాస్ నిరాయుధీకరణలో భాగంగా చేయకుండా కేవలం శాంతి పరిరక్షణ చేసేందుకు అయితే ఆ దళంలో సంతోషంగా భాగం అవుతాం. శాంతిని కొనసాగించడంలో మా పాత్ర చాలా పరిమితం' అని పేర్కొన్నారు. అమెరికా ప్రతిపాదిత శాంతి ప్రణాళిక రెండో దశలో హమాస్‌ను నిరాయుధీకర చేయడమే ప్రధాన అంశంగా ఉంది. గాజాలో శాంతి స్థాపించడంలో ఇదే ముఖ్యమైన దశగా అమెరికా విశ్వసిస్తోంది. ఇటీవల అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాట్లాడుతూ గాజాకు బలగాలు పంపుతామని పాకిస్థాన్ ఆఫర్ చేసినట్లు పేర్కొన్నారు దీంతోపాటు పలు దేశాలు కూడా దీనిలో భాగం అయ్యేందుకు ఆసక్తిగా ఉన్నట్లు చెప్పారు.

## పెళ్లికాకుండానే గర్భం దాలిస్తే రూ.38 వేలు జరిమానా

### చైనాలోని యునాన్ గ్రామపెద్దల కఠిన కార్యాచరణ



**యునాన్(చైనా)డిసెంబరు 28:** నగరాలలో నాగరికత పేరుతో సహజీవనం, వివాహానికి ముందే గర్భం దాల్చడం, ప్రేమ పెళ్లిళ్ల సాధారణంగా మారిపోయాయి. ఇలాంటి వ్యవహారాలను తమ గ్రామంలోకి అడుగుపెట్టకుండా చేసేందుకు చైనాలోని యునాన్ రాష్ట్రం లిన్ కాంగ్ జిల్లాలో ఓ గ్రామస్థులు కఠినమైన నిబంధనలను పెట్టుకున్నారు. సామాజిక బాధ్యతలను గుర్తుచేస్తూ గ్రామపెద్దలు కఠిన కార్యాచరణ అమలుచేసేందుకు నడుం బిగించారు. ఈమేరకు గ్రామ పెద్దలు ఓ తీర్మానం చేసి కొన్ని రూల్స్ నిర్ణయించారు. గ్రామంలో ఎవరైనా వివాహం కాకుండా కలిసి ఉంటే ఏటా 500 యువాన్లు భారత కరెన్సీలో సుమారు రూ.6 వేలు జరిమానాగా చెల్లించాలని నిర్ణయించారు. అదేవిధంగా, పెళ్లి కాకుండానే గర్భం దాల్చిన యువతి 3,000 యువాన్లు అంటే రూ.38,472, పెళ్లి అయిన తర్వాత 10 నెలల లోపే బిడ్డకు జన్మనిచ్చినా ఇంతే మొత్తం ఫైన్ కట్టాలని పేర్కొన్నారు. ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకుంటే 1,500 యువాన్లు మన కరెన్సీలో సుమారు రూ.19 వేలు, దంపతులు గొడవపడి గ్రామ పెద్దల వద్దకు వస్తే ఇద్దరూ చెరో 500 యువాన్లు సుమారు రూ.6 వేలు, మద్యం సేవించి గ్రామంలో గొడవ చేస్తే 3 వేల నుంచి 5వేలయువాన్లు రూ.8,472 నుంచి రూ.64,120, నిరాధార ఆరోపణలు, పుకార్లు సృష్టిస్తే 500 నుంచి 1,000 యువాన్లు రూ.6,412 నుంచి రూ.12,824 జరిమానా చెల్లించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఓబోర్డును తయారు చేసి గ్రామంలోని కార్యాలయం ముందు ఏర్పాటు చేశారు. సంప్రదాయ కుటుంబ విలువలు, నైతికతను కాపాడాలనే ఉద్దేశంతో ఈ నియమాలు అమలు చేస్తున్నట్లు తెలిపింది. ఇందుకు సంబంధించిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో వెంటనే ఆ బోర్డును తొలగించారు.

## వేధిస్తున్న బిజెపి నేతకు పోలీసులు చెక్



**భోపాల్, డిసెంబరు 28:** అత్యాచారానికి పాల్పడటమే కాకుండా, బాధితురాలిని బెదిరించాడో నాయకుడు. ఫిర్యాదు చేసినా తనను ఎవరూ ఏమీ చేయలేరని ధీమా వ్యక్తం చేశాడు. మధ్యప్రదేశ్ లోని సత్నా జిల్లాలో ఈ దారుణం చోటుచేసుకుంది. అత్యాచారం చేస్తూ వీడియోలు తీసి నెలల తరబడి వేధింపులకు గురిచేశాడంటూ బాధితురాలు కన్నీళ్లతో న్యాయం చేయాలని వేడుకుంటోంది. తనను ఎవరూ ఏమీ చేయలేరంటూ నిందితుడు విర్రవీగుతున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సత్నా జిల్లా రాంపూర్ బాఘేలన్ నగర్ పరిషత్ కౌన్సిలర్ భర్త అశోక్ సింగ్ అధికార బిజెపికి చెందిన స్థానిక నాయకుడు. ఆరు నెలల క్రితం అశోక్ సింగ్ ఓ మహిళ ఇంట్లోకి చొరబడి, కత్తితో బెదిరించి ఆమెపై అత్యాచారం చేశాడు. ఆ దృశ్యాలను తన మొబైల్‌లో రికార్డు చేశాడు. అత్యాచారం చేసిన విషయాన్ని బయటకు చెబితే వీడియోను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. ఆమెతో పాటు ఆమె కుటుంబం మొత్తాన్నీ అంతమొందిస్తానని హెచ్చరించాడు. భయంతో బాధితురాలు మౌనంగా ఉండడాన్ని అలుసుగా తీసుకున్న అశోక్ సింగ్ ఆ తర్వాత కూడా వేధింపులకు గురిచేశాడు. ఈ నెల 20న మరోసారి బాధితురాలిని వేధిస్తూ తాను చెప్పినట్లు వినకపోతే వీడియోను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. దీంతో అశోక్ సింగ్‌ను బాధితురాలు నిలదీసింది. వీడియో రికార్డు చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పగా అశోక్ సింగ్ అహంకారంతో మాట్లాడాడు. ఎవరికి ఫిర్యాదు చేసినా తనకేమీ కాదని ధీమా వ్యక్తంచేశాడు. తనను అడిగే వారు లేరని విర్రవీగడం వీడియోలో కనిపిస్తోంది. నీ ఇష్టం వచ్చిన చోట ఫిర్యాదు చేసుకో పోలీసులే కాదు ఎవరూ నన్నేమీ చేయలేరు. నాకేం కాదు అంటూ బాధితురాలిని హేళన చేశాడు. బాధిత మహిళ ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ అశోక్ సింగ్ నుంచి తనను కాపాడాలని, అతడికి తగిన శిక్ష పడాలని విజ్ఞప్తి చేసింది. ఈ వీడియో చూసిన స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అశోక్ సింగ్‌కు నేరచరిత్ర ఉందని, అయినా అధికార పార్టీ అండతో అతడు యథేచ్ఛగా తిరుగుతున్నాడని ఆరోపించింది. ఐదు రోజుల క్రితమే పోలీసులకు ఫిర్యాదు చేసినా సరైన చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. నిందితుడి నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణాపాయం ఉందని తమకు ఏమైనా జరిగితే పోలీసులదే బాధ్యత అని ఆమె హెచ్చరించింది. బాధితురాలి వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో పోలీసులు సీరియస్‌గా స్పందించారు. నిందితుడు అశోక్ సింగ్ పై కేసు నమోదు చేశారు. దీనిపై సత్నా ఎస్పీ హంసరాజ్ సింగ్ స్పందిస్తూ డిప్యూటీ ఎస్పీ మనోజ్ త్రివేది ఆధ్వర్యంలో ఈ కేసు విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. నిందితుడిని న్యాయస్థానం ముందు నిలబెడతామని, చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చూస్తామని చెప్పారు.

## 1 నుంచి గుజరాత్‌లో అంతర్జాతీయ పుష్పప్రదర్శన



**అహ్మదాబాద్, డిసెంబరు 28:** కొత్తసంవత్సరం జనవరి మొదటితేదీనుంచీ గుజరాత్‌లోని అహ్మదాబాద్ రివర్‌ఫ్రంట్ వెంబడి అంతర్జాతీయ పుష్పాల ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. రకరకాల పూలతో ఈ నెలరోజులు సందర్శకులను ఆకర్షించేదిశగా గుజరాత్‌లో ప్రతి ఏటా ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఉదయంనుంచి సాయంత్రంవరకూ ఈ ప్రదర్శననిర్వహిస్తారు. అహ్మదాబాద్ మున్సిపల్‌కార్పొరేషన్ ఈ ఎగ్జిబిషన్ నిర్వహణను పర్యవేక్షిస్తోంది. సబర్మతి రివర్‌ఫ్రంట్‌వద్ద ఎల్లిస్‌బ్రిడ్జ్, సర్దార్ బ్రిడ్జిల మధ్యలో ఈ పూల ఎగ్జిబిషన్ నిర్వహిస్తారు. ఆటో, క్యాబ్, సిటీబస్సులకు సైతం ఈ ప్రాంతం అనువుగా ఉంటుంది. ప్రపంచంలోని వివిధ రకాల పూలమొక్కలు, పుష్పాలతోపాటు వివిధ జంతువులు, పక్షుల రూపంలో అలంకరించిన పుష్పాలు, గార్డెనింగ్ వంటివి సందర్శకులను కనువిందుచేస్తాయి. ప్రకృతి ప్రేమి కులకు ఈ ఫ్లవర్‌షో వీనుల విందుచేస్తుందని నిర్వాహకులు చెపుతున్నారు.



## దౌత్యం విఫలమైతే ఇక ఉక్రెయిన్‌పై సైనిక చర్యలే..

### రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హెచ్చరిక

**మాస్కో, డిసెంబరు 28:** ఉక్రెయిన్‌పాలకులకు శాంతియుత మార్గంలో వివాదాన్ని పరిష్కరించుకోవడం ఇష్టం లేదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విమర్శించారు. ఉక్రెయిన్‌తో కొనసాగుతున్న యుద్ధంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ దౌత్యం విఫలమైతే ప్రత్యేక సైనిక చర్య తప్పదని, లక్ష్యాలన్నింటినీ బలప్రయోగం ద్వారానే సాధిస్తామని హెచ్చరించారు. పుతిన్ ఈ వ్యాఖ్యలు చేస్తున్న సమయంలోనే రష్యా దళాలు ఉక్రెయిన్‌పై కనీవినీ ఎరుగని రీతిలో దాడులకు తెగబడ్డాయి. రాత్రంతా జరిగిన ఈ దాడుల్లో సుమారు 500 డ్రోన్లు, 40 క్షిపణులను రష్యా ప్రయోగించింది. ఈ భీకర దాడిలో ఒకరు మృతి చెందగా, 27 మంది గాయపడ్డారు. రష్యాకు యుద్ధం ఆపే ఉద్దేశంలేదనడానికి ఈ 10 గంటల విధ్వంసమే నిదర్శనమని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న ఈ యుద్ధానికి ముగింపు పలికే మార్గాలను వెతుకుతున్న జెలెన్స్కీ నేడు అమెరికాలో డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ కానున్నారు. ఫ్లోరిడాలో జరగనున్న ఈ సమావేశంలో భద్రతా హామీలు, వివాదాస్పద ప్రాంతాలపై చర్చించనున్నారు. ట్రంప్‌తో భేటీకి ముందు కెనడా చేరుకున్న జెలెన్స్కీ శాంతి స్థాపన కోసం తాము చేస్తున్న ప్రయత్నాలకు రష్యా అడ్డు తగులుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్రెయిన్‌పై రష్యా జరుపుతున్న దాడులను కెనడా ప్రధాని మార్క్ కార్నీ తీవ్రంగా ఖండించారు. ఈ దాడులను ఆయన అమానవీయమైనవిగా అభివర్ణించారు. శాంతి స్థాపన జరగాలంటే రష్యా సహకారం అవసరమని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో ఉక్రెయిన్ పునర్నిర్మాణం కోసం కెనడా ప్రభుత్వం 2.5 బిలియన్ కెనడియన్ డాలర్ల సుమారు 1.82 బిలియన్ యూఎస్ డాలర్లు భారీ ఆర్థిక సాయాన్ని ప్రకటించింది.


## పాక్‌తో అమెరికా 'ఖనిజ' బంధం

### యుఎస్ లోకోమోటివ్‌లను కొనుగోలు చేయనున్న పాక్



**ఇస్లామాబాద్, డిసెంబరు 28:** అమెరికా-పాకిస్థాన్ వాణిజ్య బంధం మరింత బలపడుతోంది. ఈ క్రమంలో అమెరికా తన లోకోమోటివ్ రైళ్లను పాక్‌కు విక్రయించేందుకు సన్నాహాలు చేపట్టినట్లు తెలుస్తోంది. దీంతోపాటు పాకిస్థాన్‌లో అరుదైన ఖనిజాల అన్వేషణకు కూడా సమష్టిగా కృషి చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని పాక్ పత్రిక ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ తన కథనంలో పేర్కొంది. ఈ యేడాది అక్టోబరులో పాక్ ఆర్థికమంత్రిమహమ్మద్ ఔరంగజేబు వాషింగ్టన్‌ను సందర్శించినప్పుడు వీటిపై చర్చలు మొదలయ్యాయి. ఆ తర్వాత నుంచి అమెరికాక ప్రయోజనాలు కల్పించేలా పాక్ అధికారులు చర్చలు చేపట్టారు. అధ్యక్షుడు ట్రంప్‌నకు సలహాదారు అయిన రేమాండ్ ఎమోరి కాక్స్, అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల విషయంలో సలహాదారు అయిన రికీ గిల్ స్వయంగా పాక్‌తో చర్చలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అమెరికా తయారీ లోకోమోటివ్‌లను పాక్ కొనుగోలు చేయాలని గిల్ కోరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పాక్ ఆ దేశం తయారీ 55 లోకోమోటివ్‌లను వాడుతోంది. కాకపోతే ప్రస్తుతం పాక్ రైల్వే వద్ద తగినంత నగదు లేదు. స్టార్‌లింక్ ఇంటర్నెట్ అనుమతలను కూడా సానుకూలంగా పరిశీలించాలని కూడా రికీ గిల్ కోరినట్లు సమాచారం. ఈ క్రమంలో అమెరికన్ కంపెనీలపై పాకిస్థాన్ 5 శాతం డిజిల్ పన్నును కూడా తొలగించింది. ఖనిజాల రంగంలో పెట్టుబడి పెట్టేందుకు అమరికా 135 బిలియన్ డాలర్లను సిద్ధం చేసింది. ఈ క్రమంలో బలోచిస్థాన్‌లోని రెకో డిక్ మైనింగ్ కంపెనీకి 1.25 బిలియన్ డాలర్లను తమ దేశ ఎగ్జిమ్ బ్యాంక్ ద్వారా అమెరికా మంజూరు చేయించింది. ఇక పాకిస్థాన్ ఖనిజాల నిల్వలను గుర్తించే విషయంలో, కృత్రిమ మేధ అభివృద్ధిలో అమెరికా-పాక్ కలిపి పనిచేయాలని నిర్ణయించాయి. ఈ యేడాది పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ అమెరికా పర్యటనతో ఇరు దేశాల సంబంధాల్లో భారీ మార్పులు చోటుచేసుకొన్నాయి.

## ప్రపంచంలోనే అత్యంత పొడవైన చేతిరాత బైబిల్



**తిరువనంతపురం, డిసెంబరు 28:** ప్రపంచంలోనే అత్యంత పొడవైన, చేతితో రాసిన బైబిల్ ఆవిష్కరణకు సిద్ధమైంది. ఏకంగా 100కిలోమీటర్ల పొడవున్న ఈ బృహత్తర బైబిల్‌ను కేరళలోని త్రిసూర్‌లో ఆది వారం కార్డినల్ మార్ జార్జ్ కూవక్కాడ్ ఆవిష్కరించనున్నారు. ఈ చారిత్రక ఘట్టానికి సేక్రేడ్ హార్ట్ ఆఫ్‌అవర్ లేడీ ఆఫ్ సారోస్ బసిలికా ప్రాంగణం వేదిక కానుంది. 2025 జూబ్లీ ఇయర్ వేడుకలు, త్రిసూర్ బసిలికా శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మొత్తం 2,025 మంది భక్తులు, ప్రతినిధులు కలిసి ఈ బైబిల్‌ను చేతితో రాయడం విశేషం.

## సంక్షిప్తంగా..

### 'సిందూర్' వేళ బంకర్‌లో దాక్కోమన్నారు: పాకిస్థాన్ అధ్యక్షుడు



**ఇస్లామాబాద్, డిసెంబరు 28:** పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా పాకిస్థాన్‌పై భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం తెలిసిందే ఈ క్రమంలోనే అక్కడ అగ్ర నాయకత్వానికి వణుకుపట్టినట్లు తెలిసింది. భారత్ ఆపరేషన్ నేపథ్యంలో బంకర్‌లోకి వెళ్లిపోవాలని తమ సైన్యం సూచించిన మాట వాస్తవమేనని పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ అంగీకరించారు. ఇటీవల ఓ బహిరంగ సభలో ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించారు. 'మిలటరీ సెక్రటర నా దగ్గరకు వచ్చి ఆపరేషన్ సిందూరు పేరుతో బారత్ దాడులు చాస్తోంది. యుద్ధం ప్రారంభమైంది. బంకర్లోకి వెళ్దాం' అని తనను అప్రమత్తం చేసినట్టు జర్దారీ వెల్లడించారు. అయితే, ఆయన సలహాను తాను తిరస్కరించానని చెప్పారు. పాక్, పిఒకెలలోని సైనిక, ఉగ్ర శిబిరాలను లక్ష్యంగా చేసుకొని భారత్ సైన్యం మే7న ఆపరేషన్ చేపట్టింది. పలు ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది.

### ఆధ్యాత్మిక యాత్రను పూర్తిచేసిన ఎంపి కంగనా రనౌత్



**సిమ్లా, డిసెంబరు 28:** ప్రముఖ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తన దశాబ్దకాల ఆధ్యాత్మిక యాత్ర ను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 12 జ్యోతిర్లింగాలను ఆమె దర్శించుకున్నారు. భీమశంకర జ్యోతిర్లింగాన్ని దర్శించుకోవడంతో తన యాత్ర పూర్తయిందని ఆదివారం సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. కంగనా తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కొన్ని ఫొటోలను పోస్ట్ చేశారు. సంప్రదాయ దుస్తుల్లో శివలింగానికి పాలాభిషేకం చేస్తూ, పూజల్లో పాల్గొన్న చిత్రాలను పంచుకున్నారు. మహాదేవుడి దయ, నా పూర్వీకుల పుణ్య కర్మల వల్ల ఈరోజు నేను 12 జ్యోతి ర్లింగాల దర్శనాన్ని పూర్తి చేశాను. పదేళ్లకు పైగా సాగిన నా యాత్ర భీమశంకర దర్శనంతో ముగిసింది. మొదట్లో ప్రయాణాల్లో యాదృచ్ఛికంగా దర్శనాలు జరిగాయి. కానీ ఇటీవల గట్టి నిర్ణయం తీసుకుని అన్నింటినీ పూర్తి చేయాలనుకున్నానని కంగనా తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

### హిందువుల నిరసనను అడ్డుకున్న ఖలిస్థానీలు



**లండన్,డిసెంబరు 28:** లండన్ లోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బంగ్లాదేశ్‌లో ఇటీవల మైనారిటీ హిందువులపై మూకదాడులు, హత్యలు జరుగుతున్న విషయం తెలిసిందే. హిందువులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఈ దాడులను నిరసిస్తూ లండన్‌లోని హిందువులు బంగ్లాదేశ్ రాయబార కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన చేపట్టారు. బంగ్లాదేశ్ లోని మైనా రిటీలకు రక్షణ కల్పించాలంటూ నినాదాలు చేశారు. బంగ్లాదేశ్‌కు చెందిన హిందువులు ఈ నిరసన కార్యక్రమం చేపట్టగా ఖలిస్థానీ వేర్పాటువాదులు దీనిని అడ్డుకున్నారు. పెద్ద సంఖ్యలో బంగ్లాదేశ్ రాయబార కార్యాలయం వద్దకు చేరుకుని భారత వ్యతిరేక నినాదాలు చేస్తూ భయాందోళనలు సృష్టించారు. ఖలిస్థానీ జెండాలు ఎగురవేస్తూ నినాదాలు చేశారు. రెండు గ్రూపులు పోటాపోటీగా నినాదాలు చేస్తుండడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

### మంచు తుపానుతో అమెరికాలో ఎమర్జెన్సీ విధింపు



**న్యూయార్కు, డిసెంబరు 28:** అమెరికాలోని ఈశాన్య ప్రాంతం, గ్రేట్ లేక్స్ పరిసరాల్లో మంచుతుపాను బీభత్సం సృష్టిస్తోంది. శుక్రవారం సాయంత్రం నుంచి మొదలైన మంచువర్షం తీవ్ర రూపందాల్చింది. దీనితో ఈశాన్యప్రాంతాల్లోతుపాను అత్యవసరపరిస్థితిని ప్రకటించారు. మధ్యాహ్న సమయానికి అమెరికావ్యాప్తంగా దాదాపు5,580 విమానాలు ఆలస్యంగా నడవగా, కనీసం 860విమానాలు పూర్తిగా రద్దయ్యాయి. ముఖ్యంగా న్యూయార్క్ మెట్రోపాలిటన్ పరిధిలోని మూడుప్రధాన విమానాశ్రయాలపై దీనిప్రభావం తీవ్రంగా పడింది. పరిస్థితి తీవ్రతను గమనించిన న్యూయార్క్, న్యూజెర్సీ గవర్నర్లు ఆయా రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ (అత్యవసర స్థితి) ప్రకటించారు.

### కొడుకు కావాలన్న కోరికతో కూతుర్ని హత్యచేసిన తల్లి

**నవీముంబయి, డిసెంబరు 28:** నవీ ముంబైలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. కొడుకు కావాలన్న బలమైన కోరికతో ఓ తల్లి తన ఆరేళ్ల కన్నకూతురిని కిరాతకంగా హత్య చేసింది. సైన్స్ గ్రాడ్యుయేట్ అయిన ఆమెను కళంబోలి పోలీసులు అరెస్ట్‌చేశారు. గురుసంకల్ప్ సొసైటీలో నివసించే సుప్రియా మహాముస్కర్ (30)ఈ నెల 23న తన కుమార్తె మాన్సి(6) అనారోగ్యంతో చనిపోయిందని పోలీసులకు తెలిపింది. పాప మృతిపై అనుమానం వచ్చిన పోలీసులు పోస్టుమార్టం నిర్వహించారు. ఊపిరాడకుండా చేయడంవల్లే చిన్నారి చనిపోయినట్లు పోస్టుమార్టం నివేదికలో తేలడంతో పోలీసులు హత్య కేసునమోదు చేశారు. అనంతరం సుప్రియను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించింది. కొడుకు పుట్టాలనే కోరికతోనే ఈ దారుణానికి పాల్పడినట్లు ఆమె ఒప్పుకుంది.

# ఉపాధి నిర్వీర్యం చేయకుండా పోరాడుదాం



**మహాత్మాగాంధీ పేరు తొలగించడాన్ని నిరసిస్తూ**

**గ్రామసభల్లో తీర్మానం చేయండి**

**రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**ఎఫ్ఆర్‌బిఎం పరిమితి పెంచాలి : మంత్రి వివేక్ వెంకటస్వామి**

**ప్రపంచం గాంధీని కొనియాడుతోంది.. బిజెపికి**

**అది నచ్చడంలేదు : మంత్రి అజారుద్దీన్**

**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేయ కుండా కేంద్రంపై పోరాటం చేద్దామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు నిచ్చారు. ఆదివారం గాంధీభవన్‌లో మంత్రులు వివేక్ వెంకట్ స్వామి,అజారుద్దీన్‌తో కలిసి విలేఖరులతో మాట్లాడుతూ 2004లో సోనియా గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆనాడు అనేక మంది మేధావులతో సంప్రదించి గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక వ్యవస్థ పెంచడానికి మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చిందని గుర్తుచేశారు. ప్రజలు తిండి లేకుండా పస్తులు ఉండే పరిస్థితి ఉండకుండా ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చారని అన్నారు. గ్రామాలలో పనిలేని రోజుల వందరోజులు పని కల్పించడంతో ప్రజల ఆర్థిక వ్యవస్థ రూపు మారిందని చెప్పారు.2014 ఎన్నికల ఎజెండాలో బిజెపి గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే కాకుండా పట్టణ ప్రాంతాలకు విస్తరిస్తామని చెప్పిందని ,దానిని విస్తరించకుండా మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహ రిస్తోందని అన్నారు. మళ్లీగ్రామీణులు వలసలు మొదలైనా, ఆకలిచావులు మొదలైనా దీనికి పూర్తిగా బిజెపి కేంద్రప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. కేంద్రం తీసుకొచ్చిన ఈ చట్టంలో రాష్ట్రాల పై భారం మోపేలా 60:40 శాతం నిధులు ఉండేలా చేస్తుందని ఇప్పటికే రాష్ట్రాలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపిందని ఆయన ఆవేదన చెందారు. మహాత్మా గాంధీ పేరు తొలగించి జీరాంజీ పేరు పెట్టాడంలోనే కుట్ర దాగుందని అన్నారు. మహాత్మా గాంధీ,నెహ్రూ ,ఇందిరా గాంధీ,రాజీవ్ గాంధీ ల పేర్లు చరిత్రలో లేకుండా చేయాలని బిజెపి మోడీ సర్కార్ చేస్తుందని ఆయన అన్నారు. దానిని నిరసనగా ప్రతి గ్రామంలో గాంధీ ఫోటో తో ప్రతి ఒక్కరు నిరసనలు తెలపాలని కోరారు. తెలంగాణలోని అన్ని గ్రామ సభల్లో మొదటి గ్రామ సభలో మహాత్మా గాంధీ పేరు తొలగించడాన్ని నిరసిస్తూ తీర్మానం చేయాలని ఈ తీర్మానం కాపీని మోడీ కి పంపించాలని పిలుపునిచ్చారు. దీనికి అధికారులు సహకరించాలనీ సూచించారు..ఉపాధి హామీ పథకాన్ని డెబ్బతీసేలా చేసిన ఈ బిల్లు పై వెనక్కి తీసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయోద్యమంలో స్వాతంత్ర్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించిందని 141పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులకు శుభాకాంక్షలు తెలుపుతూ అన్నారు. దేశ అభివృద్ధి లో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుందనీ అన్నారు. నెహ్రూ ,ఇందిరా గాంధీ,రాజీవ్ గాంధీ, యుపిఎ ప్రభుత్వాలు చేసిన సంస్కరణలతోనే ప్రపంచంలో భారత్ ముందుందని అన్నారు.

**కాంగ్రెస్ ప్రధానుల దార్శనికతతోనే దేశాభివృద్ధి: మంత్రి వివేక్**

నెహ్రూ నుంచి మొదలు కొని మన్మోహన్ వరకు కాంగ్రెస్ ప్రధానులు తీసుకొన్న అనే సాహసోపేతమైన విధానాల కారణంగానే దేశాభివృద్ధి జరుగుతోందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు.ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు,పథకాలు తీసుకు వచ్చింది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని ఆయన అన్నారు.నెహ్రూ,ఇందిరా గాంధీ,రాజీవ్ గాంధీ మన్మోహన్ సింగ్, పివి నరసింహారావు దేశ వ్యాప్తంగా ఎన్నో సంస్కరణలు తీసుకు వచ్చారని కొనియాడారు.ఉపాధి హామీ పథకంకు ఉన్న మహాత్మా గాంధీ పేరు తొలగించడం కుట్ర పూరితమైన నిర్ణయమని ఆరోపించారు.రాష్ట్రాన్ని చెప్పుచేతల్లో పెట్టుకోవడానికి కేంద్రం మన రాష్ట్రానికి నిధులు ఇవ్వడం లేదని ఆవేదన చెందారు.ఎఫ్ఆర్‌బిఎం పరిమితిని పెంచడం లేదని ఆరోపించారు.ఉపాధి హామీ పథకం కు 90 శాతం నిధులు కేంద్రం కేటాయించాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ నాయకత్వంలో అన్ని ఎన్నికలు ఓడిపోయారని కవిత అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని అన్నారు.
ప్రపంచం గాంధీని కొనియాడుతోందని కేవలం బిజెపి మాత్రమే గాంధీనితిరస్కరిస్తుందని మంత్రి అజారుద్దీన్ అన్నారు. బిఆర్ఎస్ కేవలం సోషల్ మీడియాల్లో మాత్రమే బ్రతికి ఉందని ప్రజల్లో లేదని అన్నారు.

# పంచాయతీ నిధులకు పైరవీ అవసరంలేదు

**కేంద్రం నుంచి నేరుగా వస్తాయి**

**కెసిఆర్‌లో చాదస్తం, వైరాగ్యం తప్ప ఏమీ కనపడటం లేదు**

**నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్**

**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** గ్రామపంచాయతీలను పరిపుష్ఠిచేసి పరిపాలన వికేంద్రీకరణచేయలనేదే ప్రధానమంత్రి నరేంద్రమోడీ లక్ష్య మని ఆర్థిక నిధుల కోసం రేవంత్ రెడ్డి ఎక్కడికీ పోవాల్సి న పని లేదని పంచాయతీ ఖాతాల్లో కేంద్రం నేరుగా నిధులు జమ చేస్తుందని నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ అన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, వార్డు సభ్యుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిజామాబాద్ లో జరిగింది. ఈకార్యక్రమంలో మాట్లాడిన అర్వింద్.సర్పంచ్ లకు సీఎంతో ఏం పని లేదన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పీఠం ఎక్కి రెండేళ్లు పూర్తయిందని ఈ రెండేళ్లు సర్పంచ్ ఎన్నికలు నిర్వహించకపోవడం వల్లే కేంద్ర నుంచి నిధులు రాలేకపోయాయని ఇప్పుడు సర్పంచ్ ఎన్నికలు జరగడంతో కేంద్ర ప్రభుత్వం నేరుగా పంచాయతీ ఖాతాల్లోకి నిధులు జమ చేస్తుందన్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లడం, ఆ సంచులు మోయడం ఏమీ చేయాల్సి న పనిలేదని ఎకసెక్కాలు చేశారు. రెబల్స్ ను కూడా సిఎం రేవంత్ రెడ్డి తన ఖాతాల్లో వేసుకుంటున్నారని 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు లేవని దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు దక్కలేదన్నారు. మా ఖర్మ కొద్ది బిజెపి టైమింగ్ సరిగా లేకపోవడం వల్ల తెలంగాణలో మీరు అధికారంలోకి వచ్చారన్నారు. నూతన పాలక వర్గాలు పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. కెసిఆర్ ప్రెస్ మీట్ లో చాదస్తం, వైరాగ్యం తప్ప తనకేమి కనిపించలేదని అర్వింద్ విమర్శించారు. రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను చెప్పమంటే పాత రామాయణం అంతా వినిపించారన్నారు. ఇక్కడున్న చాలా మందితో పాటు తాను కూడా గతంలో కేసీఆర్ అభిమానులమేనని చెప్పారు. నీటి అంశంలో మంచి సబ్జెక్ట్ నేర్చుకున్నప్పటికీ ఆ జ్ఞానమంతా ఆయన కుటుంబానికి రూ40 -50 వేల కోట్లు సంపాదించుకోవడానికి ఉపయోగించారు. కెసిఆర్ అంతా పాపాత్ముడు సబూతో న భవిష్యత్ అని అన్నారు. కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు సంగతి కవిత చెప్పుకుంటూ రాష్ట్రమంతా తిరుగుతోందన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా బిఆర్ఎస్ నాశనం చేసి ఇవాళ సూక్తులు చెబుతున్నారని ధ్వజమెత్తారు.

## ఎంపిక చేయబడిన డిఇఒలు, ఎంఇఒలు, జెహెచ్‌ఎంలతో టిఇపిపై నేడు మీటింగ్

**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రత్యేకంగా ఎడ్యుకేషన్ పాలసీని రూపొందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ-2025 పేరుతో కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ కమిటీ ఇప్పటికే పలువురు విద్యావేత్తలు, విద్యారంగ నిపుణులతో సమావేశం ఏర్పాటు చేసి వివరాలను సేకరించింది. అందులో భాగంగా త్వరలోనే ఎడ్యుకేషన్ పాలసీని రూపొందించాలని భావిస్తున్న కమిటీ.. నేడు(సోమవారం) మల్టీజోన్-1, 2లో కొందరు ఎంపిక చేయబడిన డీఈవోలు, ఎంఈవోలు, జీహెచ్ఎంలు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలతోపాటు ఎస్ఏలు, ఎస్జిటిలు, పీఈటీలు, పీడీలతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు సేకరించాలని భావించింది. అందులో భాగంగా సోమవారం మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సమావేశాన్ని నిర్వహించాలని తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ-2025 కమిటీ ఛైర్మన్ కె కేశవరావు నిర్ణయించారు. సమావేశంలో మల్టీజోన్-1 నుంచి 12 మందిని, మల్టీజోన్-2 నుంచి 12 మందిని ఎంపిక చేసి వారితో ప్రత్యేకంగా మాట్లాడనున్నారు. వారి నుంచి వివరాలను సేకరించనున్నారు. ఆ తరువాత మరో రెండు, మూడు సమావేశాలను ఇదేమాదిరిగా నిర్వహించిన అనంతరం తెలంగాణ విద్యా విధానాన్ని ఫైనల్ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.



ఖైరతాబాద్ కూడలిలో పిజెఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్, విజయారెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి తదితరులు.

## పిజెఆర్‌కు కాంగ్రెస్ పార్టీ ఘననివాళులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), డిసెంబరు 28, ప్రభాతవార్త:** దివంగత సీఎల్పీ నాయకులు పీజేఆర్‌కు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘణ నివాళులు అర్పించారు. పీజేఆర్ 18వ వర్ధంతిని పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పీజేఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఇక ఖైరతాబాద్ కూడలిలోని పీఆజేఆర్ విగ్రహం వద్ద టీపీసీసీ కార్యదర్శి, ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్, పీజేఆర్ కుమార్తె పి. విజయారెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజారుద్దీన్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, రాజ్యసభ సభ్యులు అనీల్‌కుమార్‌యాదవ్, జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ వల్లాల, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, పలు సంస్థల ఛైర్మన్లు నూతి శ్రీకాంత్, కాల్వ సుజాత, కాంగ్రెస్ నేతలు ఫిరోజ్‌ఖాన్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామిలతోపాటు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. - ఖైరతాబాద్ నియోజకవర్గంలోని హిమాయత్‌నగర్‌లోని చందానగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని కార్పొరేటర్ విజయారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు. - ఖైరతాబాద్ డివిజన్‌లోని బడా గణేష్ కూడలిలో మాజీ సీఎల్పీ దివంగత పీజేఆర్ విగ్రహానికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్, కార్పొరేటర్ విజయారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇక్కడ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రయోజనాల కోసం రాజీపడని నేత పిజెఆర్

**గాంధీభవన్‌లో పిసిసి చీఫ్ మహేష్‌కుమార్, మంత్రి వివేక్ నివాళులు**

**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రయోజనాలకోసం రాజీపడని నేత పిజెఆర్ అని పోతిరెడ్డిపాడు నుంచి నీటిని తరలించడాన్ని వ్యతిరేకించారని నేరుగా ఆనాటి ముఖ్యమంత్రివైఎస్ రాజశేఖర్‌రెడ్డితో తెలంగాణ ప్రయోజనాలకోసం విభేదించారని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి వివేక్ అన్నారు. గాంధీభవన్‌లో దివంగత నేత పి జనార్దన్ రెడ్డి వర్ధంతి సందర్భంగా పిజెఆర్ చిత్రపటంకు పూలమాల వేసి మంత్రి వివేక్ వెంకటస్వామి,మహేష్‌కుమార్‌లు నివాళ్ళు అర్పించారు. పిజెఆర్ ప్రజా నాయకుడని, పేదల కోసం నిరంతరం అందుబాటులో ఉండి వారి కోసం పని చేసే గొప్ప నాయకుడని వివేక్ గుర్తు చేసుకున్నారు.

## రేపు కృష్ణాగోదావరి జలాల్లో న్యాయమైన వాటాపై రౌండ్‌టేబుల్ సమావేశం

**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం అవతరించి 12 యేళ్లు అవుతున్నా కృష్ణాగోదావరి నదులలో న్యాయమైన జలాల వాటా పొందడంలో విఫలం,కారణాలు డిండికి పాలమూరుకు అన్యాయం చేసింది ఎవరు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం ఈనెల 30న మంగళవారం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఇంజనీర్స్ ఫోరం కన్వీనర్ దొంతులక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఉదయం పదిన్నరకు ముఖ్య అతిథి చందన్‌కుమార్,పాశం యాదగిరి అధ్యక్షతన ఈ రౌండ్ టేబుల్ సమావేశం ఉంటుందని ఆయన ఆ ప్రకటలో పేర్కొన్నారు.



విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య

## ఉన్నత స్థానాల్లో ఉన్నోళ్లంతా సర్కారు బడిలో చదివినోళ్లే..

**కలలు కని సాకారం చేసుకోవాలి**

**రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య**

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 28, ప్రభాతవార్త :** నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నవారు చాలామంది ప్రభుత్వ కళాశాలలు,వసతి గృహాల్లో చదివిన వారేనని, చదువు జీవితాన్ని మార్చుతుందని విద్యార్థినిలు బాగా కష్ట పడి చదివి తమ భవిష్యత్‌కు బంగారు బాట వేసుకొని తల్లి దండ్రుల ఆశయం నెరవేర్చాలని రాష్ట్ర ఎస్సి.,ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన వేముల గ్రామంలో అత్యాచారానికి గురై మరణించిన దళిత యువతి కుటుంబాన్ని పరామర్శించి ఆర్అండ్‌బి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,ఎస్.పి. డి.జానకితో కలిసి చర్చించారు. అనంతరం మహబూబ్ నగర్ తిరుమల హిల్స్ లోని గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను సందర్శించారు.డిగ్రీ రెండవ,మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో సమావేశమై వారితో మాట్లాడారు. బోధన, భోజనం,వసతులు,ఇతరత్రా ఏమైనా సమస్యలు ఉన్నాయా విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు.సమస్యలు ఏమి లేవని విద్యార్థినులు చెప్పారు.

## కేంద్ర బడ్జెట్‌లో అన్నదాతకు బాసట

**సాగుకు అత్యంత ప్రాధాన్యత**

**రాష్ట్రాలకు బలమైన మద్దతు**

**2025-26 కన్నా 2.10 శాతం ఎక్కువ**

**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** కొత్త ఏడాది వస్తుండటం, ఏప్రిల్ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానుండటంతో 2026-27 కేంద్ర వ్యవసాయ బడ్జెట్‌పై కసరత్తు జరుగుతోంది. వేటికి ఎన్ని నిధులు కేటాయించాలనే దానిపై ఇప్పటినుంచే చర్చలు జరుగుతున్నాయి కొత్త బడ్జెట్ లో ఉంది), రైతుల ఆదాయాన్ని పెంచడం, డిజిటల్ వ్యవసాయం (డిజిటల్ వ్యవసాయ మిషన్), ఆహార భద్రత (నూనె గింజలు, ఉద్యానవనాలు) మరియు క్రెడిట్ మద్దతుపై దృష్టి సారించే దిశగా కేటాయింపులు జరుగుతున్నట్లు తెలియవచ్చింది. అలాగే వ్యవసాయంలో రాష్ట్రాలకు బలమైన మద్దతు మరియు రైతులకు పూర్తి చేయూత ఇవ్వడానికి నిరంతర విధాన చర్యలు తీసుకురానుంది. ప్రస్తుత 2025-26 బడ్జెట్ వ్యవసాయ శాఖకు రూ.1.27 లక్షల కోట్లకు పైగా కేటాయించింది. కొత్త బడ్జెట్‌లో దీనికన్నా అదనంగా మరో 2 శాతం 32.5 లక్షల కోట్ల వ్యవసాయ రుణాన్ని లక్ష్యంగా చేసుకుంది. ఈ కొత్త బడ్జెట్‌లో 2.10 శాతం అధికంగా పెంచే యోచనలో ఉన్నట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఉన్నతా ధికారవర్గాల ద్వారా తెలియవచ్చింది. అలాగే డేటా ఆధారిత వ్యవసాయం, ఆహార భద్రత మరియు వాతావరణ స్థితిస్థాపకత కోసం డిజిటల్ వ్యవసాయ మిషన్‌ను విస్తరించనుంది. అలాగే వ్యవసాయ పథకాలకు నిరంతర నిధులు, రైతుల ద్రవ్యతను పెంచడానికి వ్యవసాయ రుణ లక్ష్యాన్ని పెంచనుంది. పంట శాస్త్రం, ఉద్యానవనం, పశువుల ఆరోగ్యం, నూనెగింజలు, పామాయిల్ కోసం మిషన్లకు కేటాయింపులు పెంచుతోంది. అలాగే వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి, వ్యవసాయ యాంత్రీకరణ తదితర పథకాలకు మద్దత ఇచ్చే దిశగా కేటాయింపులు జరపాలని నిర్ణయించింది. నూనెగింజలు, ఉద్యానవన పంటలు, సహజ వ్యవసాయంపై దృష్టి సారించే మిషన్ల ఏర్పాటు, బలోపేతం వంటి చర్యలు చేపట్టనుంది. ఇక కేటాయింపులలో మరింత పెరుగుదల, ముఖ్యంగా సాంకేతికత మరియు వాతావరణ అనుకూలత కోసం నిధులు పెంచే ఆలోచన చేస్తోంది. దీనికి తగినట్లుగా సమర్థవంతమైన వ్యయం, డిజిటల్ వ్యవసాయ మిష్లకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంపై ప్రాధాన్యత ఇవ్వనుంది.
202627 సంవత్సరానికి (సాధారణంగా ఫిబ్రవరి 2026 లో) ఆర్థిక మంత్రి పూర్తి కేంద్ర బడ్జెట్‌ను సమర్పించినప్పుడు మీకు ఖచ్చితమైన గణాంకాలు మరియు పథకాలు లభిస్తాయి . రాబోయే 202627 కేంద్ర బడ్జెట్ కోసం, వ్యవసాయ రంగం అంచనాలలో పరిశోధనలకు నిధుల పెంపు, పంటల బీమా వ్యవస్థ యొక్క సమగ్ర మార్పు మరియు విలువజోడింపు మౌలిక సదుపాయాలకు మద్దతు ఉన్నట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారవర్గాలు చెబుతున్నాయి.

# నుమాయిష్-2026 ప్రారంభోత్సవానికి రండి

**మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానించిన ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు**

**జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు నుమాయిష్-2026**

**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** జనవరి 1 నుంచి ప్రారంభం కానున్న నుమాయిష్-2026 ప్రారంభోత్సవానికి రావాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు ఆహ్వానించారు. జనవరి 1 నుండి ఫిబ్రవరి 15 వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే ఆల్ ఇండియా ఇండస్ట్రియల్‌ఎగ్జిబిషన్(నుమాయిష్) ప్రారంభోత్సవ కార్యక్రమానికి రావాల్సిందిగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ని ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు ఆదివారం ఆహ్వానించారు.
రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేయనున్న నుమాయిష్-2026 (85వ అఖిల భారత పారిశ్రామిక వస్తు ప్రదర్శన) జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు జరగనున్నాయి. నుమాయిష్‌ను జనవరి 1న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించనున్నారు.
ఎగ్జిబిషన్‌లో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు తమ ఉత్పత్తులను ప్రదర్శించేందుకు స్టాళ్లు ఏర్పాటు చేయనున్నాయి.
ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు, శని, ఆదివారాల్లో రాత్రి 11 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది. ప్రవేశ రుసుమును రూ.50 ఉండగా ఐదేళ్లలోపు పిల్లలకు ఉచిత ప్రవేశం కల్పించనున్నారు.

# సంక్షేమ పథకాల నుంచి కుట్రపూరితంగా గాంధీ పేరు తొలగింపు

**నాడు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిందెవరు? నేడు అనాలోచితంగా కీర్తించబడుతున్నదెవరు?**

**సిపిఐ జాతీయ నేత నారాయణ**

**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపీ నేతలు జాతి పిత మహాత్మాగాంధీ పేరును సంక్షేమ పథకాల నుంచి కుట్రపూరితంగా తొలగిస్తున్నారని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ అధ్యక్షులు డాక్టర్ కె నారాయణ విమర్శించారు. అహింస, లౌకికత్వం, సామాజిక న్యాయం వంటి గాంధీయ విలువలను బలహీనపరుస్తూ, స్వాతంత్ర్య పోరాటానికి దూరంగా ఉండి, ఆ పోరాటాన్ని వ్యతిరేకించిన శక్తులు నేడు తమకు అనుకూలంగా చరిత్రను వక్రీకరిస్తూ తిరగరాయడం దురదృష్టకరమని, ఇది భారతదేశ ప్రతిష్టకు అవమానకరమన్నారు. నాడు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిందెవరు? నేడు అనాలోచితంగా కీర్తించబడుతున్నదెవరని ప్రశ్నించారు. భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. అది కోట్లాది మంది స్వాతంత్ర్య సమరయోధులు చేసిన దశాబ్దాల త్యాగపోరాట ఫలితం. ఈ పోరాటానికి నాయకత్వం వహించినవారు జాతిపిత మహాత్మా గాంధీ. కానీ కొందరు చెబుతున్న మాజీ ప్రధాని అటల్ బీహారీ వాజ్‌పేయి 1924 డిసెంబర్ 25న జన్మించారు. స్వాతంత్రం వచ్చినప్పుడు ఆయన వయస్సు 22 సంవత్సరాలు మాత్రమేనని, క్విట్ ఇండియా ఉద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం వంటి ఏ ప్రధాన బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమాల్లోనూ ఆయన పాల్గొన్నట్లు ఎటువంటి చారిత్రక ఆధారాలు లేవన్నారు. అయినప్పటికీ నేడు దేశమంతటా వాజ్ పేయి విగ్రహాలు ఏర్పాటు చేయటం, రహదారులు, పలు సంస్థలు, ప్రజా స్థలాలు, పథకాల పేర్లలో మార్పులు చేయడం వంటి చర్యలను మనం చూస్తున్నామన్నారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత నాయకులుగా చలామణి అయిన వారిని స్వాతంత్ర్య సమరయోధులుగా చిత్రీకరించే దుస్థితి దాపురించిందన్నారు. అంతేకాకుండా మహాత్మా గాంధీ పేరును సంక్షేమ పథకాల నుంచి కుట్రపూరితంగా తొలగిస్తున్నారని మండిపడ్డారు. భారత దేశానికి స్వాతంత్రం ఎవరు దానం చేయలేదని, అనేక ప్రాణత్యాగాలతో సాధించ బడిందన్నారు
. ప్రస్తుత రాజకీయ భావజాలాలకు అనుగుణంగా గత చరిత్రను మార్చాలనుకోవటం అవివేకమన్నారు. మహాత్మ గాంధీని కేవలం విగ్రహాలకు మాత్రమే పరిమితం చేసి, ఆయన ఆలోచనలను ఆచరణలో లేకుండా చూడాలన్నదే నేటి పాలకుల అనాలోచిత విధానంగా గోచరిస్తుందన్నారు.

# పేదలను దోచి అదానీ, అంబానీకి కట్టబెడుతున్న బిజెపి పాలకులు

**ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షుడు రోహిత్ ప్రమాణస్వీకారంలో మహేష్‌కుమార్‌గౌడ్**


**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** పేదలను దోచి ఆధాని, అంబానీలకు బిజెపి పాలకులు సంపదను కట్టబెడుతున్నారని బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు.గాంధీ భవన్ లో ఆదివారం ఖైరతాబాద్ డిసిసిఅధ్యక్షులు మోతే రోహిత్ పదవీ బాధ్యతలు స్వీకరణ కార్యక్రమానికిముఖ్య అతిథిగా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి వాకాటి శ్రీహరి, ఎంపి అనిల్ యాదవ్, మాజీ ఎంపి వి. హనుమంతరావు, పూర్వ డిసిసి అధ్యక్షులు రోహిన్ రెడ్డి, ఫిరోజ్ ఖాన్ కార్పోరేషన్ చైర్మన్‌లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా గాంధీ భవన్ కు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ అమిత్ షా రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారనీవాళ్ళ పదవి కాపాడుకోవడానికి ఎంతవరకైనా దిగజారీ పోతారని విమర్శించారు.రాష్ట్ర వాట కేంద్ర వాటా అని క్రమేణా మనేగా పథకాన్ని తీసివేయలని బిజెపి చూస్తుందని విమర్శించారు. బిజెపి పెత్తందారు పార్టీ అని బీద వాడి గోడు కేంద్రంలో ని బిజెపి ప్రభుత్వానికి పట్టట్లేదని అన్నారు. కాంగ్రేస్ పార్టీ అంటేనే పేద వాడి పార్టీ అనిస్వోత్కర్షలు చెప్పుకొన్నారు. కాంగ్రెస్ లో మనం ఉండటం మన అదృష్టం అని భాష్యం చెప్పారు. రేవంత్‌రెడ్డి విజన్ ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి తపన పడుతున్నారని అన్నారు. రాహుల్ గాంధీ ఆకాంక్ష మేరకు రేవంత్ రెడ్డి కుల సర్వే చేశారని గుర్తుచేశారు. మోడీ జనగణన చేస్తా అనడానికి ప్రేరణ రేవంత్‌రెడ్డి మాత్రమే అని ఆ ఘనత రేవంత్ రెడ్డిది అని కొనియాడారు. రానున్న రోజుల్లో బిజెపి విధానాలు ఎండగడుతూ రాహుల్ గాంధీని ప్రధానిని చేయడానికి అందరం కష్టపడి పని చేద్దామని పిలుపునిచ్చారు.

# టిడిపి నేత సాయిబాబా ఆకస్మిక మరణం తెలుగుదేశం పార్టీకి తీరనిలోటు

**పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్**

**హైదకాబాద్ (ముషీరాబాద్), డిసెంబరు 28, ప్రభాతవార్త:** టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ పి.సాయిబాబా ఆకస్మిక మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటని ఆపార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సాయిబాబా సంతాప కార్యక్రమం ఏర్పాటుచేసి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరవింద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలుగుదేశంకు విశేష సేవలు అందించిన సాయిబాబా శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో హఠాత్తుగా మరణించటం విచారకరమని అన్నారు. తెలుగుదేశం పార్టీలో సాయిబాబా ఒక కీలకమైన వ్యక్తి అని, తెలుగదేశం పార్టీ స్థాపనకు ముందే ఎన్టీఆర్ వీరాభిమానిగా ఉండి, ఎన్టీఆర్ అభిమాన సంఘాలను ఒక సమాఖ్యగా చేసి, తద్వారా ప్రజలకు చేరువయ్యే విధానాలతో ముందుకు నడిపి, ఎన్టీఆర్ దత్తపుత్రుడిగా పేరుతెచ్చుకున్నారని గుర్తు చేశారు. తెలుగుదేశం కార్యకర్తగా, రాజకీయంగా ఆరోజుల్లో నేషనల్ ఫ్రంట్ యూత్ కోఆర్డినేటర్‌గా సేవలు అందించటమే కాకుండా వికలాంగుల సంక్షేమ సంస్థ కార్పోరేషన్ చైర్మన్‌గా రెండు పర్యాయాలు, లేపాక్షి హస్తకళల సంస్థ చైర్మన్‌గా ఒకసారి, రాష్ట్ర గ్రంధాలయాల ఛైర్మన్‌గా కూడా పనిచేశారని తెలిపారు. పార్టీ కార్యక్రమాలను దూరదృష్టితో యువతలోకి బలంగా తీసుకెళ్లడంలో అద్భుత సామర్థ్యం కలిగిఉన్నారని కొనియాడారు. తెలుగుదేశం ఉమ్మడి రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులుగా అనేక పర్యాయాలు నిర్వహించారని, పార్టీ ఎన్నికల సభలు, సమావేశాలే కాకుండా బూత్ స్థాయిలో నా పనిచేశారని గుర్తు చేశారు. బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేసేవారని, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయటానికి, తెలుగుదేశం పథకాలను సమర్ధ వంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లటానికి సాయి బాబా నిస్వార్థంగా కృషి చేశారని అన్నారు. ఈ సంతాప కార్యక్రమంలో టీడీపీ నేతలు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ నాగు నగేష్, ఎస్.ప్రకాష్, చంద్రమోహన్ గౌడ్, శ్యాంసుందర్, బాలాజీగోస్వామి, సిహెచ్. విజయశ్రీ, భానుప్రకాష్, సత్యనారాయణ, ఎండి సలీం, టి.అనిల్, భవాని, శ్రీనివాస్, శ్రీకాంత్, జోగిందర్‌సింగ్, బి.రాజు, రవి, శక్తిప్రేమ్, సుక్రవేది, జగదీష్‌గౌడ్, సత్తన్న, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

**పార్టీ కార్యాలయంకు సాయిబాబా పార్థీవదేహం:** తెలుగుదేశం పార్టీకి నిస్వార్థంగా సేవలు అందించిన సాయిబాబా పార్థివ దేహాన్ని సోమవారం ఉదయం 9.30 నిమిషాలకు దోమలగూడలోని పార్టీ కార్యాలయంకు తీసుకువస్తారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సాయిబాబా పార్థీవ దేహానికి నివాళులర్పించిన అనంతరం అంబర్‌పేటలోని స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తారని టీడీపీ నేతలు తెలిపారు.



సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు

# మరొకరి పేరుతో ఫేక్ పాన్‌కార్డు, లైసెన్స్ సృష్టి

## రవితో సంబంధం లేదన్న ప్రహ్లాద్ వెల్లేల

## నేటితో ముగియనున్న ఐ బొమ్మ రవి పోలీస్ కస్టడీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 28:** తెలుగు సినీ పరిశ్రమను కుదిపేసిన పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఇమంది రవి, మరొక వ్యక్తి పేరుతో నకిలీ గుర్తింపు కార్డులు సృష్టించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ప్రహ్లాద్ వెల్లేల అనే వ్యక్తి పేరుతో రవి ఫేక్ పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తయారుచేసుకుని వినియోగించినట్లు తేలింది. విచారణ సమయంలో ప్రహ్లాద్ తన రూమ్‌మేట్ అని రవి పోలీసులకు చెప్పాడు. దీంతో అనుమానం వచ్చిన అధికారులు, బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న ప్రహ్లాద్ వెల్లేలను హైదరాబాద్‌కు పిలిపించారు. కస్టడీలో ఉన్న రవిని ఎదురుగా ఉంచి ప్రహ్లాద్‌ను విచారించగా అసలు విషయం బయటపడింది.

"నాకు ఇమంది రవి ఎవరో తెలియదు. నా పేరు మీద పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నాడని తెలిసి షాక్‌కు గురయ్యాను" అని ప్రహ్లాద్ పోలీసులకు స్పష్టం చేశాడు. దీంతో రవి చెప్పిన రూమ్‌మేట్ కథ కట్టుకథ అని తేలిపోయింది. ప్రహ్లాద్‌కు సంబంధించిన డాక్యుమెంట్లను రవి దొంగిలించి, వాటి ఆధారంగా నకిలీ గుర్తింపు కార్డులు సృష్టించి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

నవంబర్ 2025లో మొదలైన ఈ కేసు విచారణలో, ఐబొమ్మ వెబ్‌సైట్‌ను రవి ఒక్కడే నిర్వహించినట్లు పోలీసులు ఇప్పటికే నిర్ధారించారు. కాగా, రేపటితో (డిసెంబర్ 29) ఇమంది రవి పోలీసు కస్టడీ ముగియనుంది.

# ప్రభుత్వ వైఫల్యాలపై అసెంబ్లీలో నిలదీయండి

## బిజెఎల్పీ సమావేశంలో బిజెపి చీఫ్ రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 28:** ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తాత్సారం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పార్టీ ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు సూచించారు. సోమవారం నుంచి ప్రారంభంకానున్న అసెంబ్లీ శీతాకాల సమావేశాల నేపథ్యంలో ఆదివారం పార్టీ అధ్యక్షుడు రాంచందర్ రావు అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు ప్రసంగిస్తూ ప్రభుత్వ అసమర్థ పాలనపై బలమైన స్వరం వినిపించాలని, ప్రజాపక్షంగా రాష్ట్ర ప్రజల జీవన సమస్యలను సభ దృష్టికి తేవాలని సూచించారు. అసెంబ్లీ, కౌన్సిల్‌లో పార్టీ సభ్యులు సమన్వయంతో ఉండాలని ఆయన సూచించారు. ప్రజా ప్రయోజనాల పరిరక్షణ కోసం పార్టీ బలమైన పాత్ర పోషించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ శాసనసభాపక్షం నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, ఎవిఎన్ రెడ్డి, మల్క కొమురయ్య, ఎమ్మెల్యేలు వెంకటరమణా రెడ్డి, రాకేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో వైకుంఠ దర్శనాలకు భారీ ఏర్పాట్లు

## క్యూలైన్ల నిర్వహణకు పటిష్ట ప్రణాళికలు

**తిరుమల, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసంలో రేపటి నుండి జనవరి 8వరకు పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలను భక్తులకు సౌకర్యవంతంగా కల్పించేలా అన్ని ఏర్పాట్లు చేపట్టామని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. ముఖ్యంగా తొలి మూడు రోజులు (30, 31, జనవరి 1)రేపు, ఎల్లుండి, గురువారం వరకు ఆన్‌లైన్‌లో టోకెన్లు అందుకున్న భక్తులను మాత్రమే ఆయా రోజుల్లో స్లాట్ సమయానికి ముందు క్యూలైన్లలోకి ప్రవేశించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటికే పదిరోజుల వైకుంఠ ద్వార దర్శనాల్లో తొలి మూడురోజులు టోకెన్లు పొందిన 1.75లక్షల మంది భక్తులకు అవసరమైన ఏర్పాట్లు, అదనపు సౌకర్యాలు కల్పించడంలో టిటిడి విజిలెన్స్, టిటిడి ఉద్యోగులు, పోలీసులతో సమన్వయం చేసుకున్నామన్నారు. ఈ ఏడాది భక్తులకు అదనంగా వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించేలా స్థలాలను సిద్ధంచేయడం జరిగిందన్నారు. ఈ మూడురోజులు టోకెన్ కలిగిన భక్తులను క్యూలైన్లలోనికి నిర్దేశిత సమయం ప్రకారం ఆయా రోజుల్లోనే అనుమతించేలా ఆదేశాలిచ్చామన్నారు. జనవరి 2నుండి 8వరకు ముక్తిద్వారం కోసం తరలివచ్చే భక్తులకు సురక్షిత దర్శనం, ప్రశాంత వాతావరణం కల్పించడంలో పోలీసులు, విజిలెన్స్ కీలక పాత్ర పోషిస్తారని అదనపు ఇఒ చౌదరి పేర్కొన్నారు. భక్తులకు ఎక్కడా ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నా మన్నారు. టోకెన్లుతో మూడురోజులు దర్శనం కోసం వచ్చిన భక్తులకు సాఫీగా క్యూలైన్ల నిర్వహణ, రద్దీ ప్రాంతాల్లో భక్తుల భద్రతకు అదనపు సిబ్బంది నియామకం, భక్తుల రద్దీ చేరినా తగినట్లు సామరస్యంగా వ్యవహరించి నియంత్రించడం జరుగుతుందన్నారు. టోకెన్ లేని భక్తులను తిరుమలపైకి అనుమతించినా ఆలయం ముందు వరకే, అఖిలాండం వరకే పరిమితం చేయడం వంటి వాటిపై దృష్టి పెట్టామన్నారు. ఈ పదిరోజులు ప్రతి అధికారి, ఉద్యోగి, సిబ్బంది అంకితభావంతో నిబద్ధతో సేవలందిస్తారని ఆయన తెలిపారు. ఆలయంలో భక్తులకు మహాలఘు దర్శనంలో వైకుంఠవాకిలి దర్శనం చేయించేలా ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. ఆన్‌లైన్‌లో సామాన్యభక్తులకు వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనం 1.20లక్షలు టిక్కెట్లు, శ్రీవాణి విఐపి బ్రేక్ దర్శనాలను వారంరోజులకు ఏడువేల టిక్కెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేయడం జరిగిందన్నారు.

# నాలుగో టి-20లోనూ మహిళలదే హవా!

## 30 పరుగుల తేడాతో శ్రీలంకపై భారత్ విజయం

## ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా స్మృతి మంధాన

## రెచ్చిపోయిన స్మృతిమంధాన, షెఫాలివర్మలు

**తిరువనంతపురం, డిసెంబరు 28:** శ్రీలంకతో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టి20టోర్నీలో నాలుగో మ్యాచ్‌లో కూడా భారత్ మహిళా క్రికెటర్లు దుమ్ముదులిపారు. ఆదివారం గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియంలోజరిగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ టీమ్ 30 పరుగుల తేడాతో లంకను ఘోరంగా ఓడించింది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 4-0తో తిరుగులేని ఆధిక్యం ప్రదర్శించింది. టాస్ గెలిచిన శ్రీలంక కెప్టెన్ చమరి ఆటపట్టు బౌలింగ్ ఎంచుకోగా, భారత బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. నిర్ణీత 20 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు నష్టపోయి ఏకంగా 221 పరుగుల భారీస్కోరు సాధించారు. అంతర్జాతీయ టి20ల్లో భారత మహిళల జట్టుకు ఇదే అత్యధికస్కోరు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో భారత మహిళలు సమిష్టిగా రాణించారు. సొంతగడ్డపై తమ ఆధిపత్యం మరోసారి నిరూపించుకున్నారు.

ఓపెనర్లు షెఫాలివర్మ, స్మృతి మంధాన రికార్డులు మోగించారు. తొలివికెట్‌కే ఇద్దరూ 162 పరుగులు జోడించి టి20ల్లో భారత్‌లో అత్యధిక భాగస్వామ్యం నెలకొల్పినవారిగా నిలిచారు. గతంలో వెస్టిండీస్‌పై వీరిద్దరే నమోదుచేసిన 143 పరుగుల రికార్డుబ్రేక్‌చేసారు. షెఫాలివర్మ 46 బంతుల్లో 12ఫోర్లు, ఒక సిక్స్‌తో 79 పరుగులుచేయగా స్మృతి మంధాన 48 బంతుల్లో 11 ఫోర్లు, మూడు సిక్సర్లతో 80 పరుగులుచేసింది. షెఫాలికి ఈ సిరీస్‌లోమూడో అర్ధశతకం కాగాచివరిలో రిచాఘోష్ మెరుపు ఇన్నింగ్స్‌తో రాణించింది. 16 బంతుల్లోనే 40 పరుగులుచేసి అజేయంగా నిలిచింది. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా స్మృతి మంధాన నిలిచింది. భారీ లక్ష్యఛేదనలో శ్రీలంక జట్టు 20 ఓవర్లలో ఆరువికెట్లకు 191 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఓపెనర్లు హాసిని పెరీరా 33, కెప్టెన్ చమరి ఆటపట్టు 52 బోణీచేసినా మధ్యలో వికెట్లు రాలిపోవడంతో లక్ష్యంచేరుకోలేకపోయింది. భారత బౌలర్లలో అరుంధతిరెడ్డి కీలకసమయంలో వికెట్లు తీసి ప్రత్యర్థిని కట్టడిచేసింది. ఫీల్డింగ్‌చేస్తున్నపుడు స్మృతిమంధానకు స్వల్ప గాయమైనా జట్టువిజయంపై ప్రభావం చూపించలేదు. క్లీన్‌స్వీప్ లక్ష్యంగా భారత్ సిరీస్‌లో చివరిమ్యాచ్ ఆడేందుకు సిద్ధం అవుతోంది.




# రెండేళ్లలో తట్టెడు మట్టి తీయలే

## దత్తత పేరుతో గురుశిష్యులు పాలమూరును దగా చేశారు

## నాగర్‌కర్నూల్ జిల్లా సర్పంచుల ఆత్మీయ సన్మానసభలో

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



సమావేశంలో మాట్లాడుతున్న కెటిఆర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 28 ప్రభాతవార్త:** పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి అయితే పాలమూరు జిల్లాకు నీటి కష్టాలు తీరుతాయని కేసీఆర్ దృఢ సంకల్పంతో ప్రాజెక్టును 90 పూర్తి చేస్తే ఈ రెండేళ్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తట్టెడు మట్టి కూడా తీయలేదని తీవ్రస్థాయిలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయ ఆవరణలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యుల ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 28 వేల కోట్లు కేటాయించి నిధులు కూడా ఇవ్వడం జరిగిందని 70 టీఎంసీల నీరు నిలువ ఉండే రిజర్వాయర్లను కూడా కేసీఆర్ హయంలోనే పూర్తి చేశారన్నారు. కేవలం 10 శాతం ఉన్న పనులకు రెండేళ్ల సమయం పడుతుందా అని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే కెసిఆర్ కు పేరు ప్రతిష్టలు వస్తాయని కుట్రతో పనులు చేయడం లేదని కేటీఆర్ ఆరోపించారు.

ఉమ్మడి రాష్ట్రంలో మహబూబ్‌నగర్ జిల్లాను అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు దత్తత తీసుకొని దగా చేస్తే, పాలమూరు జిల్లా బిడ్డను గెలిపిస్తే సీఎం అయి అభివృద్ధి చేస్తానని ప్రగల్బాలు పలికి పాలమూరు జిల్లాను గురు శిష్యులు భ్రష్టు పట్టించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మెప్పు కోసం తెలంగాణ ముఖ్యమంత్రి చిట్టిబాబు తపన పడుతున్నారని అందుకే తెలంగాణకు లబ్ధి చేకూర్చే ప్రాజెక్టులను పట్టించుకోవడంలేదని అన్నారు.

తెలంగాణను పాలిస్తున్న ముఖ్యమంత్రి కి గుండెలు లేవని కేటీఆర్ అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఎరువులు ఇవ్వాలన్న సంక్షేమ పథకాలు ఇవ్వాలన్న సోయి సీఎంకు లేదన్నారు. తెలంగాణ ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోవడం ఆ అంశాన్ని ప్రతిపక్షాలు ప్రజలు నిలదీస్తే ముఖ్యమంత్రి అన్న సోయి కూడా మరిచి ఆరు గ్యారెంటీలను అడిగిన వారి పట్ల కళ్ళు పీకి గోటీలు ఆడుతా... లాగులో తొండలు ఇడుస్తా... కడుపులో పేగులు పీకి మెడలో వేసుకుంటా... అంటూ మాట్లాడడం సీఎం రేవంత్ రెడ్డి అసహనం చేతకానితనానికి నిదర్శనమని కేటీఆర్ దుయ్యబట్టారు.

# నేటితో ముగుస్తున్న పుస్తకాల పండుగ

## వారాంతరం కావటంతో కిక్కిరిసిన పుస్తక ప్రదర్శన ప్రాంగణం

**హైదరాబాద్ (ముషీరాబాద్), డిసెంబరు 28, ప్రభాతవార్త:** ఈనెల 19వ తేదీ ఎన్టీఆర్ స్టేడియంలో ప్రారంభమయిన 38వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్ నేటితో ముగియనున్నది. గత పదిరోజులుగా లక్షలాది పుస్తకాభిమానులను విశేషంగా అలరిస్తున్న పుస్తకాల పండుగకు ఆదివారం సెలవు కావటం, ముగింపునకు దగ్గర పడటంతో లక్షలాది మంది సందర్శకులు తరలి రావటంతో, పుస్తక ప్రదర్శన ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆదివారం సాయంత్రం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డిలు బుక్‌ఫెయిర్‌ను సందర్శించారు. బుక్‌ఫెయిర్ అధ్యక్షులు కవి యాకుబ్, కార్యదర్శి వాసు, ఉపాధ్యక్షులు బాల్‌రెడ్డి, కోశాధికారి నారాయణరెడ్డిలు వారిని మర్యాదపూర్వకంగా సత్కరించారు. పుస్తక ప్రియుల కోసం సొసైటీ చేస్తున్న కృషిని వారు అభినందించారు.



**పుస్తక ఆవిష్కరణలు:** కీర్తిశేషులు ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా ఉర్దూ నుంచి అనువదించిన ఫైజ్ అహ్మద్ ఫైజ్ అనే పుస్తకాన్ని బుక్‌ఫెయిర్ లోని కొపెల్లి వెంకట్‌గౌడ్ వేదికపై శనివారం సాయంత్రం సీనియర్ పాత్రికేయులు కే.శ్రీనివాస్ ఆవిష్కరించారు. ప్రొఫె సర్ హరగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యామిని కృష్ణ, వసంత తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇదే వేదకపై తెలంగాణ కథ 2024 ను పగిడి పేరుతో ఉన్న పుస్తకాన్ని పరవస్తు లోకేశ్వర్ ఆవిష్కరించారు. సిద్దెంకి యాదగిరి పుస్తక సమీక్ష చేయగా, డాక్టర్ వెల్దండి శ్రీధర్ అధ్యక్షత వహించారు. నందిని సిద్ధారెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కొండాపూర్‌లో డ్రగ్స్ కలకలం

## కొత్త సంవత్సరం వేళ నిఘాను కట్టుదిట్టం చేసిన పోలీసులు

## గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎనిమిది మందిపై డ్రగ్స్ కేసు నమోదు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), డిసెంబరు 28, ప్రభాతవార్త:** కొత్త సంవత్సరం వేల తెలంగాణ పోలీసులు మత్తు పదార్థాలపై మరో మారు ఉక్కుపాదం మోపారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండాపూర్‌లో ఒక పబ్బులో శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఈగల్ టీం ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 8 మంది డ్రగ్స్ సేవించినట్లు పోలీసులు గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి టెస్టులు నిర్వహించిన అనంతరం వారికి పాజిటివ్ రావడంతో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. మొత్తం 14 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా, 8 మందికి పాజిటివ్ వచ్చిందని పోలీసులు తెలిపారు. నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా క్వేక్ ఎరీనా పబ్‌లో ఉక్రెయిన్‌కు చెందిన ప్రముఖ డీజే ఆర్బాట్స్ కాన్సర్ట్ నిర్వహించారు. ఈ క్రమంలో సైబరాబాద్ పోలీసులతో కలిసి పలు బబ్బుల్లో ఈగల్ బృందం తనిఖీలు నిర్వహించింది. డ్రగ్స్ కేసుల్లో 10 రోజుల్లో 27 మందిని ఈగల్ బృందం అరెస్ట్ చేసింది. అరెస్టయిన వారిలో ఐదుగురు విదేశీ మహిళలు సహా 17 మంది వినియోగదారులు ఉన్నారు. నిందితుల వద్ద నుంచి 68 గ్రాముల కొకైన్, 50.5 గ్రాముల ఎండీఎంఏ, 382 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్న స్థానిక పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి చేశారు. ఎట్టి పరిస్థితిలోనూ యువత మత్తు పదార్థాల వైపు వెళ్ళొద్దని వారు సూచించారు.




# రేపు ఆగమోక్తంగా తెరచుకోనున్న వైకుంఠద్వారాలు!

## తెల్లవారుజామున 5 గంటల నుండి టోకెన్ భక్తులకు దర్శనం

**తిరుమల, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** సాక్షాత్తు వైకుంఠంలో శ్రీమహావిష్ణువే కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామికి ఆవిర్భవించి భక్తులకు దర్శనం ఇస్తు న్నాడనేది పురాణాల కథనం. కలియుగవైకుంఠం తిరుమల ఆలయంలో పవిత్రమైన ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి(రేపు), ద్వాదశి (ఎల్లుండి) ఘడియల సందర్భంగా వైకుంఠవాకిలి ద్వారాలు మంగళవారం వేకువజామున (రేపు) 1.35-1.40 గంటలకు తెరచుకోనున్నాయి. వైఖానస ఆగమోక్తంగా విశేష పూజాదికార్యక్రమాలు, కైంకర్యాలు నిర్వహించిన అనంతరం శ్రీవారి ఆలయ అర్చకులు, అధికారులు తెల్లవారుజామున బంగారువాకిలికి సమీపంలో ఉన్న వైకుంఠద్వారాలను తెరవ నున్నారు. ఆ తరువాత ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామికి కైంకర్యాలు ముగించిన తరువాత రేపు తెల్లవారుజామున 2గంటల నుండి తిరుమలకు చేరుకున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రము ఖులు, ఐఏఎస్, ఐపిఎస్‌లు, టిటిడి బోర్డు సభ్యులు వారివారి కుటుంబాలతో వైకుంఠ ద్వార దర్శనం చేసుకోనున్నారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం హారతి లేని లఘుదర్శనం కల్పిస్తారు. 3గంటల్లోపే ప్రముఖుల దర్శనాలు ముగించి ఉదయం 5గంటలకు ఇడిప్‌లో ఆన్‌లైన్ టోకెన్లు కలిగిన భక్తులను క్యూలైన్‌లలో వదలి లోపలకు అనుమతించనున్నారు. ఇప్పటికే తిరుమలలో ఆలయం పరిసరాలు సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ఆలయం ముందు రంగనాథ మండపం సెట్టింగ్ ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. నేటి సాయంత్రానికి తిరుమలకు చేరుకునే ప్రముఖులకు పద్మావతి విచారణ కార్యాలయం సమీపంలోని వెంకటకళానిలయం వద్ద న్యాయమూర్తులు, కేంద్ర మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలకు వసతి, దర్శన టిక్కెట్లు మంజూరు కౌంటర్లు ఏర్పాటుచేశారు. వీరికి పద్మావతి ఏరియాలోనే గదులను కేటాయిస్తారు. ఇతరరాష్ట్రాల ప్రజాప్రతినిధులకు, సిఎం కార్యాలయం లేఖలకు నారాయణగిరి విశ్రాంతి గృహాల్లో వసతి కల్పిస్తారు. ఐఏఎస్, ఐపిఎస్ లేఖలకు నందకం, వకుళమాత విశ్రాంతి గృహాల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పర్యవేక్షణలో డిప్యూటీ ఇఒలు లోకనాథం, భాస్కర్, రాజేంద్ర, సోమన్నారాయణ, సత్రానాయక్, సూపరింటెండెంట్‌లకు బాధ్యతలు అప్పగించారు.

**రేపు స్వర్ణరథం:**

వైకుంఠ ఏకాదశి పర్వదినాన మంగళవారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు స్వర్ణరథం ఆలయ మాఢవీధుల్లో జరగనుంది. విశేష అలంకరణలో మలయప్పస్వామి స్వర్ణరథాన్ని అధిరోహించి మాఢవీదుల్లో భక్తుల ను కటాక్షించనున్నారు. ఆలయ మాఢవీధుల్లో భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు.

# స్వయంసేవక్ సంఘ్‌పై విదేశాల్లో పెరిగిన ఆకాంక్ష

## ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్

**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** హైదరాబాద్ సమీపంలోని కన్హా శాంతి వనంలో 7వ విశ్వ సంఘ్ శిబిరాన్ని నిర్వహిస్తున్నది. ఐదు రోజుల ఈ ప్రపంచ స్థాయి సమ్మేళ నానికి 79 దేశాల నుండి 1,610 మంది కార్యకర్తలు, స్వయంసేవకులు, ప్రతినిధులు హాజరయ్యారు. ముగింపు ఉత్సవానికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర సంఘచాలక్ మోహన్ భాగవత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మోహన్ భాగవత్ మాట్లాడుతూ... "ధర్మం తప్పడం వల్ల ఏర్పడిన అసంతులనం వల్ల అతివాదం ప్రబలింది. చరిత్ర గతి తప్పింది. కరుణను మరిచిపోయాం. దీంతో అన్ని సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. వీటన్నింటినీ తిరిగి సంపాదించాలని అనుకుంటున్నారు. ఈ చర్చ సర్వే సర్వత్రా వున్నదే. మనం కూడా చేస్తున్నాం. మరి ఇది ఎలా జరగాలి? దేశంలో ఏ కార్యాలైతే జరగాల్సి వున్నాయో.. అవి తన నుంచే ప్రారంభం కావాలని డాక్టర్ హెడ్గేవార్ తలపోశారు. తమ నుంచే కార్యాలు ప్రారంభించే వ్యక్తులను తయారు చేయాలని భావించారు. అందుకే సంఘ స్వయంసేవకులు అవుతారు. వారు వారి నుంచే పనులను ప్రారంభిస్తారు. సేవా తత్పరతతోనే పనులు చేస్తారు" అని వివరించారు. సేవ ఓ పవిత్ర కర్తవ్యం, దీని బదులు ఏమీ వద్దు అని కొందరు భావిస్తారు. ప్రామాణికతతో, నిస్వార్థంగా, ఏమీ ఆశించకుండా చేసేవారు వుంటారు. సేవే తన పరమావధిగా చేసే వారుంటారు. వారే స్వయంసేవకులు. సంఘం పెరుగుతూ వుంటే స్వయంసేవకులు కూడా పెరుగుతుంటారు. కొందరు స్వయంసేవకులు విదేశాలకు కూడా వెళ్లారు. కానీ.. వారు తమ వ్రతాన్ని మాత్రం మరిచిపోలేదు. హిందూ దేశ సర్వాంగీణ ఉన్నతిని కానీ, హిందూ ధర్మ సంరక్షణను కానీ మరిచిపోలేదు. ఇతర దేశాల్లో వున్న వారందరూ మన మన చరిత్రను, మన సంస్కృతిని, మన సంప్రదాయాన్ని, మన ఆచరణ చేస్తున్న పద్ధతులను చూసి, ఎలా జీవించాలో నేర్చుకోవాల్థి అలా మనం బతకాలని మన పూర్వీకులు నిర్దేశించారు. ఇలాంటి ఉదాహరణను ప్రపంచం ముందు వుంచి, ప్రపంచంలోని ప్రతి మూలనా ధర్మాన్ని ప్రతిష్ఠ చేయాలి. మనం ప్రపంచానికి నేతృత్వం వహిస్తాం. కానీ మన మన పద్ధతుల ద్వారానే ఈ నేతృత్వం వహిస్తాం. ఇదే మన పద్ధతి కూడా. మన సైనిక శక్తిని ప్రదర్శించో, మన ఆర్థిక వ్యవస్థ ద్వారా ఇతరులను అణగదొక్కో ఎదగాలని భావించం. మన జీవన పద్ధతుల ద్వారానే నేతృత్వం వహిస్తాం. మన జీవన పద్ధతులను ప్రపంచం ముందు వుంచుతాం. విశ్వవిభాగ్‌కి సంబంధించిన మొట్టమొదటి ద్వితీయ వర్ష వర్గ బెంగళూరులో జరిగింది. విదేశాల్లో పుట్టిన, అక్కడే పెరిగిన స్వయంసేవకులు 34 మంది వచ్చారు. వారి ముందు భేదేజీ ఓ ప్రస్తావన తెచ్చారు. హిందూ స్వయంసేవక్ సంఘ్ ద్వారా హిందువులు విదేశాల్లో సంఘ పనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ శాఖలు విదేశాల్లో ఎక్కడైనా నడవొచ్చు అని మొదటి తరం నిర్ణయించింది. ఇదే కార్య పద్ధతి ప్రతి దేశ కాల, మాన పరిస్థితుల్లో నడవొచ్చని నిర్ణయించారు. ఆ తర్వాత రెండోతరం వచ్చింది. విదేశాల్లో వున్నా.. భోగమయ జీవితం మధ్యలో నివసిస్తున్నా.. దురలవాట్లకు దూరంగా వుంటూ నిత్య శాఖకు వెళ్లాలని నిశ్చయించుకున్నారు. ఇప్పుడు మూడో తరం వారు ఇక్కడ కూర్చున్నారు. ఆయా దేశాల ప్రజలు తమకు కూడా ఓ హిందూ స్వయంసేవక్ సంఘ్ లాంటి స్వయంసేవక్ సంఘ్ వుండాలనుకునే విధంగా మెలగాలి. అంతటి బృహత్తర బాధ్యత మీ భుజ స్కంధాలపై ఇప్పుడు పడింది. ఎందుకంటే తమకు కూడా ఇలాంటి జీవన పద్ధతి వుండాలని భావించేలా. భారత్‌లో ఎలాగైతే సంఘ్ కార్యం వుందో, అచ్చు అలాంటి సంఘటనే, అలాంటి జీవన విధానమే తమకు కూడా వుండాలన్న చర్చ తీవ్రమవుతోంది. ఇది మనకు వినిపిస్తూనే వుంది. భారత్ లో వున్న స్వయంసేవకులు వారి లాగా జీవించడానికి, వారి జీవన పద్ధతులను తమకు కూడా నేర్పిస్తారా? మాకూ శిక్షణ ఇస్తారా? అని అడుగుతున్నారు. ఈ చర్చ సాగుతోంది. అలాంటి వారికి హిందూ స్వయంసేవక్ సంఘ్ అని ఓ సంస్థ వుందని, దాని ద్వారా శిక్షణ పొందాలని మీరు వారందరికీ చెప్పాలి" అని పిలుపునిచ్చారు.





## ఎఐ కళ్ల జోళ్లు పంపిణి

చేజర్ల (నెల్లూరు), డిసెంబరు 28 ప్రభాతవార్త: నెల్లూరు జిల్లా చేజర్ల మండలం మామూడూరు గ్రామంలోని అబ్బూరి మహాలక్ష్మీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో కిమ్స్ పౌండేషన్ అండ్ రీసర్చ్ సెంటర్, అచల గ్రూప్ ఆదివారం సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కళ్ళ జోళ్ళను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పంపిణి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కళ్ళ జోళ్ళు నిర్వహణలో కిమ్స్ ప్రతినిదులు ఆచల గ్రూప్ ప్రతినిధులు సంయుక్తంగా కొన్ని రోజులు శిక్షణ ఇస్తారని తెలిపారు. అంగవైకల్యం కలిగిన వారు మరొకరి సహాయంతో వారి పనులు చేసుకుంటారని అన్నారు. అయితే నేడు అంధత్వం కలిగిన వారికి ఎలాంటి సహాయకులు లేకుండా నేరుగా వారి పనులు చేసుకోవడానికి ఏఐ గ్లాసులు ఎంతో ఉపయోగ పడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అచల గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ రవితేజా, నేషనల్ పెడిరేషన్ ఆప్ బ్లైండ్ సంస్ద నుండి వెంకటరావు నేషనల్ పెడరేషన్ ఆప్ బ్లైండ్ జిల్లా సెక్రటరీ కోటేశ్వరరావు, ఆత్మకూరు ఆర్‌డిఒ బి.పావనీ, ప్రముఖ వైద్యనిపుణులు బొల్లినేని భాస్కరరావు, బొల్లినేని శ్రీనివాసులు, ఆత్మకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తాళ్ళూరి గిరినాయుడు, బొల్లినేని ఆసుపత్రి సిబ్బంది, ఆచలా గ్రూప్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



## చెట్టును ఢీకొన్న కారు

### విశాఖ వాసులు ఇద్దరు దుర్మరణం

### గజపతినగరం రైల్వే జంక్షన్ వద్ద ఘటన

గజపతినగరం (విజయనగరం జిల్లా), డిసెంబరు 28 ప్రభాతవార్త: విజయనగరం జిల్లాలోని గజపతినగరం రైల్వే స్టేషన్ జంక్షన్ సమీపంలో 26వ నెంబర్ జాతీయ రహదారి వద్ద ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి చింత చెట్టును బలంగా ఢీకొనడంతో, కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతులిద్దరూ విశాఖపట్నంలోని కంచరపాలెం ప్రాంతానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ కిరణ్ కుమార్ నాయుడు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నంలోని కంచరపాలెం ఏరియాకు చెందిన పొట్నూరు వినయ్ కుమార్(35) యల్లబిల్లి దినేష్ (24)లు తమ వ్యాపారంలో భాగంగా బేకరీ ఐటమ్స్ తీసుకుని ఏపీ39డి 2851 నెంబర్ గల వ్యాన్‌లో 27వ తేదీ(శనివారం) సాయంత్రం ఒరిస్సా రాష్ట్రంలోని రాయగడకి వెళ్లారు. అక్కడ బేకరీ ఐటమ్స్ అప్పగించి, తిరిగి ప్రయాణంలో విశాఖపట్నం బయలు దేరారు. ఈ క్రమంలో 28 వ తేదీ (ఆదివారం) తెల్లవారు జాము 4 గంటల ప్రాంతంలో గజపతినగరం రైల్వే స్టేషన్ జంక్షన్ సమీపంలో చింత చెట్టుని బలంగా ఢీకొన్నారు. దీంతో డ్రైవింగ్ చేస్తున్న పొట్నూరు వినయ్ కుమార్, పక్క సీట్లో కూర్చున్న దినేష్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. కారు నుజ్జునుజ్జయింది. సమాచారం తెలుసుకున్న వెంటనే పోలీస్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకొని, ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కారులో చిక్కుకున్న ఇద్దరి మృతదేహాలను బయటికి తీసి పోస్ట్ మార్టం నిమిత్తం విజయనగరం పెద్ద ఆస్పత్రికి తరలించారు. మృతులు వినయ్ కుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు కాగా, దినేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎల్లబిల్లి శంకరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

## మట్టి అక్రమార్కుల దాష్టీకం

### అడ్డుకునేందుకు వెళ్లిన అధికారులపై ప్రొక్లెయిన్‌తో దాడి... తమిళనాడు కృష్ణగిరి జిల్లాలో ఘటన

కుప్పం, డిసెంబరు 28 ప్రభాతవార్త: జిల్లా కలెక్టరు ఆదేశాలతో చెరువు వద్ద మట్టి అక్రమ రవాణా అడ్డుకునేందుకు వెళ్లిన ఓ తహాశీల్దార్, ఉప తహాశీల్దార్‌లపై ఓ డ్రైవర్ ప్రొక్లెయిన్‌తో దాడి చేసి ఎక్కించబోయి హత్యాయత్నంకు పాల్పడిన సంఘటన తమిళనాడులోని కృష్ణగిరి జిల్లాలో చోటు చేసుకుంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా.. కృష్ణగిరి జిల్లా పోచంపల్లి సమీపంలోని చెంగంపట్టి గ్రామం వద్ద ఆనందూర్ చెరువు ఉంది. ఆ ప్రాంతంనుంచి భారీగా సారవంతమైన మట్టిని కొందరు స్మగ్లర్లు తరలిస్తున్నారని కృష్ణగిరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఫిర్యాదులు అందాయి. ఈ విషయంగా మట్టి అక్రమ రవాణా అరికట్టాలని కలెక్టరు ఊతంగరై తహాశీల్దార్ రజలత్‌సుమి, ఉప తహాశీల్దార్లు సహదేవ, జయపాల్‌లను ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులబృందం సంఘటనా స్థలంకు చేరుకోగా అక్కడ మట్టిని ప్రొక్లెయిన్ సాయంతో లారీలో ఎక్కిస్తుండడాన్ని అధికారులు గుర్తించారు. అక్కడున్న కొందరు అధికారులను చూసి పరారు కాగా ప్రొక్లెయిన్ డ్రైవర్ వాహనంతో వేగంగా వచ్చి తహాశీల్దార్, ఉప తహాశీల్దార్లపై ప్రొక్లెయిన్‌తో ఢీకొట్టి వారిపై ఎక్కించాలని హత్యాయత్నంకు పాల్పడ్డాడు. అనంతరం అతను పరారవుతుండగా అధికారులు పట్టుకునే యత్నం చేయగా తప్పించుకున్నాడు. పోచంపల్లి పోలీసులు అధికారుల ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలికి చేరుకుని అక్కడున్న లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఈసంఘటన కృష్ణగిరి జిల్లాలో కలకలం రేకెత్తించింది.

# ఆత్మకూరులో రూ.144.5 కోట్ల అభివృద్ధి పనులు

### - రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



ఆత్మకూరు (నెల్లూరు), డిసెంబరు 28 ప్రభాతవార్త: ఆత్మకూరు నియోజకవర్గంలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల ద్వారా సుమారు 144.5కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరు మండలంలోని వాసిలి గ్రామంలో జాతీయ రహదారి నుంచి వాసిలి గ్రామం వరకు సుమారు 49లక్షల రూపాయలతో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా నిర్మించనున్న సిసిరోడ్లకు మంత్రి ఆనం శంకుస్థాపన చేశారు. అనంతరం పూర్తయిన రోడ్లను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా ఆత్మకూరు మండలంలో 19కోట్ల రూపాయలతో 76పనులను ప్రారంభించామన్నారు. కొన్ని టెండరు ప్రక్రియ సాగుతుందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో 336 పనులకు 65కోట్ల రూపాయలు నిధులు మంజూరయ్యాయని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో 1.4కోట్ల రూపాయల నిధుల కొరత ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వడ్డీలు చెల్లిస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. నియోజకవర్గ పరిధిలో సుమారు 5లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను మరమ్మత్తులు చేయడం జరుగుతుందన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలద్వారా చివరి ఆయకట్టు భూములు కూడా వ్యవసాయ ఆమోదయోగ్యం పొందడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో అనేక లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు నిధులు మంజూరు చేశారన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవసాయంలో అంతర్భాగమన్నారు. మరికొన్ని నూతన పథకాలను కూడా ప్రారంభిస్తామన్నారు. ఎన్‌డిఏ చేసిన వాగ్దానాల మేరకు అభివృద్ధి పనులు చేపడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సూపర్‌సిక్స్ పథకంలో భాగంగా ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పెన్షన్లు అందజేస్తుందన్నారు. ఈనెల 31వ తేదీనే పెన్షన్ పంపిణీ చేస్తామన్నారు. ఇంటింటికి మూడు గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదనంగా నూతన గ్యాస్ కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందని, అదనంగా నూతన గ్యాస్ కనెక్షన్ 200 ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిందన్నారు. నియోజకవర్గ పరిధిలో 761 పనులకు 50కోట్ల 72లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు నియోజకవర్గ ప్రజల శ్రీకారం చుట్టి పనులు పురోగతి లో ఉన్నాయన్నారు. 9బిటి రోడ్లు 47కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసేందుకు 26.9 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారన్నారు. వాసిలి ఎస్సీ కాలనీలో 69.3లక్షల రూపాయలతో తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మండల పరిధిలో జలజీవన్ మిషన్‌కింద 76.19కోట్ల రూపాయలతో టెండర్ల ప్రక్రియ పూర్తయిందని నియోజకవర్గ పరిధిలో 336 పనులకు 6588 లక్షల రూపాయలతో శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి బి.పావని, మండల రెవెన్యూ అధికారి పద్మజ, మండల అభివృద్ధి అధికారి, పంచాయతీరాజ్ శాఖఅధికారులు, స్థానిక అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కల్తీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

### - ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్



వరదయ్యపాళెం, డిసెంబరు 28 ప్రభాతవార్త: వరదయ్యపాలెం మండలం సత్యవేడు, సూళ్లూరుపేట నియోజకవర్గంలోని సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో సూళ్లూరుపేటలోని పూజిత ఆగ్రో సర్వీస్ సెంటర్‌లో సుమారు రూ.1500లకు కల్తీ విత్తనాలను కొని నారు పోసి నాటగా 15 రోజుల్లోనే ఎన్నులు తీయడం, పైకి ఎదగకపోవడం వల్ల కల్తీ విత్తనాలతో నష్టపోయిన సుమారు 250 మంది రైతులకు ప్రభుత్వం వెంటనే ఎకరాకు రూ.62000 నష్టపరిహారం చెల్లించాలని. ఈ కల్తీ విత్తనాల అమ్మిన సుళ్లూరుపేట పూజిత ఆగ్రో సర్వీస్ సెంటర్ యాజమాని శ్రీధర్ రెడ్డిపై చట్టప్రకారం చర్యలు తీసుకుని అరెస్ట్ చేయాలని తిరుపతి జిల్లా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కన్వీనర్ సుధాకర్ రెడ్డి, భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్ని రాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరదయ్యపాలెం మండలంలోని మావిళ్ళపాడు కలతూరు కొవ్వాకొల్లి మరదవాడ అంగూరు సాతంబేడు తదితర గ్రామాల రైతులు సుమారు 250 మంది విత్తనాలు నారుపోసి నాటి తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎక్కువ మంది రైతులు భూములను కౌలుకు తీసుకొని ఈ వ్యవసాయ సాగు చేస్తున్నారని, కల్తీ విత్తనాల వల్ల నష్టపోయిన భూమి గల యజమానులకు కవులు డబ్బులు చెల్లించాల్సి వస్తుందని రైతులు తీవ్ర ఆవేదనకు గురి ఆందోళన చెందుతున్నారని తెలిపారు. సుధాకర్‌రెడ్డి చిన్నిరాజ్ నాయకత్వాన వరదయ్యపాలెం మండలంలోని గ్రామాల పొలాలలో క్షేత్రస్థాయిలో వెళ్లి రైతులతో కలిసి పరిశీలించడం జరిగిందని ఆ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గుత్తకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న మాకు ఈ కల్తీ విత్తనాలు వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి భూములను సరియైన నిర్వహించి రైతులను గుర్తించి పరిహారం చెల్లించాలని లేకుంటే ఆత్మహత్య చేసుకోవడమే తప్ప వేరే గత్యంతరం లేదని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ధనుంజయులు శెట్టి చంద్ర, ధనంజయల్ నాయుడు, చలపతి నాయుడు, విజయ ఉప్పరపాటి, మునిరాజా, యువరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపి నిధులతో కసాపురం దేవస్థానం అభివృద్ధి



### - అనంతపురం ఎంపి అంబికా లక్ష్మినారాయణ

### - ఎంపిని కలిసిన కసాపురం దేవస్థానం ఇఒ విజయరాజు

అనంతపురం, డిసెంబరు 28 ప్రభాతవార్త బ్యూరో: అనంతపురం పట్టణంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో కసాపురం దేవస్థానం (గుంతకల్) కార్యనిర్వాహణ అధికారి విజయరాజు మర్యాదపూర్వకంగా కలుసుకొని, వేద ఆశీర్వాదాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కసాపురం దేవస్థానం అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఆయనతో చర్చించాను. జిల్లా స్థాయిలో దేవస్థానం మరింత మంచి స్థానం సంపాదించుకునేలా అభివృద్ధి చేయాలని, ఎంపీ నిధుల ద్వారా ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దేవాలయంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నాను. ఇప్పటికే గ్రామం మరియు దేవాలయానికి బస్ షెల్టర్ ఏర్పాటు చేస్తున్నామని, భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు దేవాలయానికి అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడతామని, బస్ షెల్టర్, నక్షత్రవనం, రహదారులు, నీటి వసతి, గది వసతులు, ఆర్చ్, పార్కింగ్, షెడ్స్, ఆధ్యాత్మిక వసతులు వంటి అన్ని అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యంగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కసాపురం దేవస్థానం అధికారులు, ప్రధాన అర్చకుల బృందం, ఆలయ సిబ్బంది, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనంతలో శంబాల నటుల సందడి

### మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఆధ్వర్యంలో ఘన సన్మానం



అనంతపురం, డిసెంబరు 28 ప్రభాతవార్త: ఈనెల 24వ తేదీ విడుదలైన శంబాల సినిమా నటులు ఆదివారం అనంతలు సందడి చేసింది. హీరో తండ్రి సాయికుమార్, హీరో ఆది, హీరోయిన్ అర్చన అయ్యర్, మధుసూదన్, ఇంద్రనీల్, అనంతపురం పట్టణానికి చెందిన మరో నటుడు, మటకశిర ఎమ్మెల్యే, శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి జిల్లా అధ్యక్షులు ఎమ్మెస్ రాజు కలిసి మాసినేని గ్రాండ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఆధ్వర్యంలో త్రివేణి థియేటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడ భారీగా బాణ సంచులు పేలుస్తూ స్వాగతం పలికారు. అక్కడ శంబాల సినిమా ఆడుతున్న త్రివేణి హాల్లోకి వెళ్లి సందడి చేశారు. ప్రేక్షకులు కూడా సినీ నటులను చూసి ఆనందంతో కేకలు వేస్తూ విజిల్స్ వేశారు. శంభాల సినిమా ఈనెల 24వ తేదీ ప్రపంచవ్యాప్తంగా విడుదల అయిందని, ఈ సినిమాని అందరూ ఆదరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని సినీనటులు తెలియజేశారు. పైరసీను ప్రోత్సహించకుండా థియేటర్లలోనే సినిమాలు చూడాలని కోరారు. అనంతరం గజమాల తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ మెంబర్ వెంకటప్ప, టిడిపి నాయకులు రాయల్ మురళి, దేవల మురళి, ఎంఆర్పిఎస్ నాయకులు పెద్దన్న, టిసి నాగేంద్రతో పాటు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బహిరంగ ప్రదేశాల్లో జంతుబలి నేరం

### అటువంటి ఉన్మాదులను ప్రోత్సహించం

### - హోంమంత్రి వంగలపూడి అనిత

విజయవాడ, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: బహిరంగ ప్రదేశాల్లో జంతుబలి చేయడం నేరం అని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. వైఎస్సార్సీపీ నేతలు అనేకచోట్ల జంతుబలులు చేసి తమ ఉన్మాదాన్ని చాటుకున్నారని .ఆమె మీడియాతో మాట్లాడుతూ తమ పార్టీ నేతలు ఏం చేసినా ఆ పార్టీ నాయకుడు నోరు తెరిచి తప్పని చెప్పలేదు. జగన్ ఫ్లెక్సీలకు రక్తాభిషేకం చేయడం ఉన్మాదం కాదా?. వచ్చే ఎన్నికల్లో గెలిస్తే మీ పరిస్థితి ఇదేనంటూ నినాదాలు ఇవ్వడం దారుణం. రాజకీయాలను అడ్డం పెట్టుకుని రౌడీయిజం చేస్తున్నారు. రాష్ట్రాభివృద్ధికి ఆటంకాలు కలిగించేందుకు కుట్రలు చేస్తున్నారు. చిన్న పిల్లలను కూడా సైకోలు, ఉన్మాదుల్లా తయారుచేస్తున్నారు. టీనేజ్ పిల్లల జీవితాలతో ఆటలు ఆడుకుంటున్నారు. రాజకీయ నేతల ఉద్దేశాలు కూడా పిల్లల తల్లిదండ్రులు ఆలోచించాలి. ఆస్తి గురించి సొంత తల్లి, చెల్లెలిపై కేసులు పెట్టినవారు మీ పిల్లల్ని రక్షి స్తారా?. పిల్లలు రోడ్డుపైకి వచ్చి నరుకుతాం, చంపుతాం అంటున్నారు. తమ పార్టీ నేతలు చేసింది తప్పని చెప్పలేరా జగన్. జగన్ అధికారంలో ఉన్నప్పుడు అనేక దారుణాలు జరిగాయి. అధికారం కోల్పోయినా మరో రకం దారుణాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వాటిని ఖండించలేదంటే జగన్ అసలు మనిషేనా?. నేరాలు ప్రోత్సహించే పరిస్థితి నీది, వాటిని అరికట్టే బాధ్యత మాది. రోడ్లపై ఉన్మాదుల్లా ప్రవర్తిస్తే ఎవరినీ వదిలేది లేదు. ఫ్లెక్సీలపై రక్తం చల్లినవారందరినీ అరెస్టు చేశాం. నేరగాళ్లు, రౌడీ షీటర్లపై ఉక్కుపాదం మోపుతాం. తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తుపై ఆలోచన చేయాలని మంత్రి సూచించారు. 18 ఏళ్ల లోపు పిల్లలు కత్తులు పట్టుకుని రోడ్డెక్కుతుంటే తప్పు అని చెప్పేందుకు కూడా మనసు రాలేదా? అని నిలదీశారు. జగన్ పుట్టినరోజు నాడు వైఎస్సార్సీపీ వికృత చేష్టలు మానవత్వం ఎటు పోతోందో అనే రీతిలో ఉన్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజకీయ ముసుగులో వైఎస్సార్సీపీ సైకోలు చేపట్టే చర్యలు రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేలా ఉందని మండిపడ్డారు. జగన్ పుట్టిన రోజు సందర్భంగా వైఎస్సార్సీపీ వికృత చేష్టలు, జంతు బలులపై హోంమంత్రి అనిత వీడియో విడుదల చేశారు. గతంలో మాదిరి నిందితులకు ముసుగు వేయకుండా వారిని అందరి ముందు బహిర్గతం చేస్తామని మంత్రి అనిత వెల్లడించారు. ఆడపిల్లల జోలికి వస్తే రోడ్డుపై నడిపించి స్టేషన్‌కు తీసుకెళ్తామని హెచ్చరించారు. శృతి మించి ప్రవర్తిస్తే రాష్ట్ర బహిష్కరణకు వెనుకాడమని వ్యాఖ్యా నించారు. ఫ్యాక్షన్ సినిమా చూసినట్లుగా వైఎస్సార్సీపీ వికృత చేష్టలు ఉన్నాయని, నేతల్ని ఉన్మాదుల్లా ఆపార్టీ నాయకుడు ఎలా తయారు చేస్తున్నాడో ప్రజలు గమనించాలని సూచించారు. జగన్ ఆదేశాలతోనే ఈ తరహా కార్యక్రమాలు జరిగాయా? అని మంత్రి అనిత ప్రశ్నించారు. గర్భిణీ స్త్రీని కాలుతో తన్నే ఉన్మా దుల్ని ఏమనాలని మండిపడ్డారు. రాజకీయ ముసుగులో రౌడీయిజం అడ్డం పెట్టుకునే చేసే కుట్రలు స్పష్టమవుతున్నాయని తెలిపారు. అధికారంలో ఉండగా గంజాయ్‌ని ప్రోత్సహించిన జగన్ యువత భవిష్యత్తుని నాశనం చేశారని అనిత ఆక్షేపించారు. తాజా వికృత చేష్టలతో 18ఏళ్ల లోపు యువత జీవితాల్ని నాశనం చేయటమే జగన్ పనిగా పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాజకీయ ముసుగులో యువత భవిష్యత్తును నాశనం చేయాలనుకుంటున్న జగన్ అసలు మనిషేనా అని అనిత ధ్వజమెత్తారు. ఇష్టానుసారం వ్యవహరిస్తే ఇక్కడ ఉంది సీఎం సీబీఎన్ అని జగన్ గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కలిగించేందుకు వైఎస్సార్సీపీ నేతలు ఎంతకైనా దిగజారుతున్నారని హోంమంత్రి విమర్శించారు. జంతుబలులతో రక్తాభిషేకం చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. జగన్ జన్మదినం సందర్భంగా రాష్ట్రంలో పలుచోట్ల ఆ పార్టీ నేతలు ముగుజీవాల్ని బలి ఇచ్చి చేసిన రక్తాభిషేకంపై మండిపడ్డారు. రోడ్లపైకి వచ్చి కత్తులు పట్టుకుని తిరిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. రక్తాభిషేకం చేసిన వాళ్లంతా కటకటాల్లో ఉన్నారని చెప్పారు. చిన్న పిల్లలను కూడా సైకోలు, ఉన్మాదుల్లా తయారు చేస్తున్నారని హోంమంత్రి



ప్లాస్మా జాతీయ సింపోజియంలో మాట్లాడుతున్న డైరెక్టర్ సత్యనారాయణ

### పారిశ్రామిక, బయో మెడికల్ రంగాల్లో

# ప్లాస్మా సైన్స్ కీలకం

### తిరుపతి ఐఐటిలో ప్లాస్మా 40వ జాతీయ సింపోజియం

శ్రీకాళహస్తి, డిసెంబరు 28 ప్రభాతవార్త: ఫ్యూజన్ ఎనర్జీ, స్పేస్, అస్ట్రోపిజికల్, ప్లాస్మాలు, తక్కువ ఉష్ణోగ్రత ప్లాస్మాలు, ప్లాస్మా దయాగ్నస్టిక్ మెటిరీయల్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో నేడు ప్లాస్మా సైన్స్ కీలకంగా మారిందని తిరుపతి ఐఐటిలో జరుగుతున్న ప్లాస్మా 40వ జాతీయ సింపోజియంలో పలువురు వక్తులు ప్రసంగించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సింపోజియంకు తిరుపతి ఐఐటి అతిధ్యం ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆదివారం నిర్వహించిన ఆలోచనాత్మక సమావేశాలకు డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ఉత్కల్ యూనివర్శిటి మాజీ విసి ప్రొఫెసర్ ఎకె దాస్, ఎంటిఆర్‌డిసికి చెందిన డాక్టర్ ఎస్‌కె దత్, కాంచిపురం ఐఐటిడిఎం ప్రొఫెసర్ ఎంవి.కార్తికేయన్, నెట్‌కార్ లిమిటెడ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అరుణ్ శర్మ తదితరులు ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఇక్కడి భౌతిక శాస్త్రం, సివిల్, పర్యావరణ ఇంజనీరింగ్ విభాగం తిరుపతి ఐసర్, ప్లాస్మాసొసైటీ ఆప్ ఇండియా కలసి ఈ సింపోజియంను నిర్వహిస్తున్నట్లు వివరించారు. టెక్నాలజీలో ఇటీవల చోటు చేసుకుంటున్న పురోగతులు ఉద్భవిస్తున్న ధోరణులపై చర్చించటమే సింపోజియం లక్ష్యం అన్నారు. అంతర్ విభాగం పరిశోధనలు, శాస్త్రీయ నైపుణ్యాన్ని ప్రోత్సహించటానికే తిరుపతి ఐఐటి ప్రాధాన్యత ఇస్తుందని వివరించారు. భారత దేశ ప్లాస్మా పరిశోధన పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయటంలో ఇటువంటి సింపోజియంలు ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ సింపోజియంలో ఆదివారం పలు అంశాలకు సంబంధించి చర్చలు జరిగాయి. అలాగే ప్యానెల్ చర్చలతో పాటు పలు పోస్టర్స్ ప్రెజెంటేషన్ చర్చలు సుధీర్ఘంగా జరిగాయి. ఈ వాతావరణం విద్యాసంస్థలు, జాతీయ ప్రయోగశాలలు పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించుటకు దోహద పడుతుందన్నారు.



చిత్తూరులో కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ ఉత్సవంలో నాయకులు, కార్యకర్తలు

## మరో స్వాతంత్ర్య సమరానికి కాంగ్రెస్ సై

### - చిత్తూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్

చిత్తూరు, డిసెంబర్ 28 ప్రభాతవార్త: దేశంలో కాంగ్రెస్ పార్టీ మరో స్వాతంత్ర్య సమరానికి సిద్ధం అవుతోందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావించి 141 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో డిసిసి అధ్యక్షులు పోటుగారి భాస్కర్ కాంగ్రెస్ పతాకంను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఆయన పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి ముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశం నుండి తెల్ల దొరలను తరిమికొట్టడానికి స్వాతంత్ర్య పోరాటం చేసిందన్నారు. దేశంలో ప్రస్తుతం వున్న ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలు, ముస్లీంలకు అన్యాయం చేసి ఆదానీ, అంబానీలకు ప్రయోజనం కలిగే నిర్ణయాలు తీసుకుని సామాన్య ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. చిత్తూరు నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టిక్కి రాయల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే దేశంలో అభివృద్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్ బీద ప్రజల వైపు నిలిచి వారి అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేసిందన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి నాయకుడి నుండి కార్యకర్తల వరకు పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సత్యవేడులో రేషన్ దందా

### సరిహద్దు దాటుతున్న రేషన్ బియ్యం

సత్యవేడు (చిత్తూరు జిల్లా), డిసెంబరు 28 ప్రభాతవార్త: విజిలెన్స్ దాడులు... మూడు చోట్ల పోలీసుల మెరుపు దాడులు... బియ్యం స్వాధీనం... వాహనాలు సీజ్... ఇది గత కొంత కాలంగా పేదోడికి ఇంటికి చేరాల్సిన ప్రభుత్వ సబ్సిడీ బియ్యం విషయంలో అధికారుల స్పందన. అయినా మళ్లీ బియ్యం అక్రమ రవాణా మాఫియా విజృంభణ సత్యవేడులో మొదలైంది. తమిళనాడుకు సరిహద్దులో సత్యవేడు ఉండడం వల్ల ఇటు తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాల సబ్సిడీ బియ్యాన్ని కొనుగోలు చేసి శ్రీకాళహస్తి, పలమనేరు ప్రాంతాలకు తరలించి అక్కడ బియ్యాన్ని పోలీసు చేసి ఏకంగా 25 కేజీల బస్తా బియ్యం సుమారు 1300 రూపాయలు విక్రయిస్తున్నారు. సత్యవేడులో ఓ నలుగురు ఏకమై పోలీసులు, ఇతర అధికారులను వారు మచ్చిక చేసుకుని ఈ వ్యాపారం మూడు బస్తాలు.. ఆరు రకాల ఆదాయ వనరులుగా మార్చుకుని లబ్ధిపొందుతున్నారు. సత్యవేడు కేంద్రంగా తమిళనాడు రాష్ట్రంలోని ఊత్తుకోట, గుమ్మిడిపూండి, మాధరపాకం, ఎగుమదురె, పాలవాకం, అచ్చిమనాయుడు కండ్రిగ, ఎన్ఎం కండ్రిగ ప్రాంతాలు నుంచి అక్కడ తమిళనాడు ప్రభుత్వం పేదలకు ఉచితంగా సరఫరా చేసేప్పుడు బియ్యాన్ని కేజీ 5 నుంచి 10 రూపాయల చొప్పున ఇక్కడికి తీసుకుని వచ్చి నిల్వ చేసుకుంటున్నారు.

#### పట్టించుకుంటే ఒట్టు... అక్రమార్కుల కనికట్టు....

సత్యవేడు నియోజకవర్గంలోని సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు మండలాల నుంచి మన రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీ బియ్యాన్ని సత్యవేడుకు చేరవేసుకుంటారు. ఇక్కడ ప్రభుత్వం ఇంటి పరిసరాలకే టెంపోల ద్వారా కొన్ని సందర్భాల్లోను, డీలర్ల వద్ద కొన్ని సందర్భాల్లో ఉచిత, కేజీ రూపాయి చొప్పున బియ్యాన్ని అందిస్తున్నారు. రెవెన్యూ అధికారులు పూర్తిగా ప్రజా పంపిణీ వ్యవస్థపై పర్యవేక్షణ మరచిపోవడంతో ఈ అక్రమ రవాణా మాఫియాకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. క్షేత్ర స్థాయిలో ఏడాది కాలంగా ఏ ఒక్క తహసీల్దార్ ఏ వీధికి కానీ, గ్రామానికి కాని వెళ్లి బియ్యం అందిందా.. లేదా.... అని ప్రశ్నించిన దాఖలాలు లేవు. దాంతో ఏకంగా డీలర్ల నుంచి 4.6 రూపాయల చొప్పున బియ్యాన్ని కొనుగోలు చేసుకుంటున్నారు. తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాల నుంచి సేకరించిన బియ్యాన్ని సత్యవేడులోని జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న మంచినీటి ట్యాంకు సమీపంలో కొందరి ఇళ్ళలో ఉంచి లారీ మొత్తంలో నిల్వ చేరిన వెంటనే శ్రీకాళహస్తి, పలమనేరు ప్రాంతాలకు తరలించి భారీగా ఆదాయం పొందుతున్నారు. కొందరిపై వరుస కేసులు నమోదు అవుతున్నా ప్రయోజనం లేకపోతుంది. అటు కోర్టుకు వెళ్లామా... బెయిల్‌పై వచ్చి వెంటనే మరో ఇంటికి గోడౌన్‌గా మార్చి తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. మొత్తం మీద పేదోడి సర్కారు సబ్సిడీ బియ్యం అక్రమార్కులకు సిరులు కురిపిస్తున్నా అధికార యంత్రాంగం ప్రేక్ష పాత్ర వహించడం ఆలోచించాల్సి ఉంది.

## తిరుప్పావై

### 14వ పాశురము

ఉజ్జళ్ కప్పుళైక్కడై
తోట్టత్తువావియుళ్
శెజ్ఞకునీర్ వాయ్నెకిళున్దు అమ్బుల్
వాయ్ కూమినకాణ్,
శెంగల్ పొడిక్కూట్టై వెణ్బల్
తవత్తవర్
తంగళ్ తిరుక్కోయిల్ శంగిడువాన్
పోకిన్ఱార్,
ఎంగళై మున్నమ్ ఎళుప్పువాన్
వాయ్ పేశుమ్,
నంగాయ్ ! ఎళున్దిరాయ్ !
నాణాదాయ్ !
నావుడైయాయ్! శంగొడు శక్కర
మేన్దుమ్ తడక్కైయన్,
పంగయక్కణ్ణానై ప్పాడేలో
రెమ్బావాయ్.



ఎఱ్ఱతామరలు వికసించినవి. నల్లకలువలు ముడుచుకొన్నవి. జేగురురాళ్ళ పొడితో రంగు అద్దిన వస్త్రములతో తెల్లని పలువరుస కలిగిన సన్యాసులు తమ దేవాల యమునకు ఆరాధన చేయుటకు పోవుచున్నారు. ఓ పరిపూర్ణురాలా, ఓ సిగ్గులేనిదానా, ఓ మాట నేర్పు గలదానా మధురముగా మాటలాడుదానా శంఖ చక్రముల ధరించిన పొడవైన బాహువులగల పుండరీకాక్షుని భజించుటకు రావమ్మా అని వెలుపలి గోపికలు లోపలి గోపికను మేల్కొ లుపుతున్నారు.

ఫలం: "జ్ఞానము కలుగుతుంది"

**చెలిచిట్కా:** ✦ వావింలాకు పావుతులం, మిరియాలు పావు తులం నూరి మూడు రోజులు రెండుపూటలా పుచ్చుకొన్న పచ్చకామెర్లు తగ్గును. చప్పిడి పత్యం. ✦ నూనె తెలగపిండి బెల్లం, జిల్లేడుపాలు సమపాళ్ళుకలిపి యిచ్చిన పిచ్చికుక్క కాటుతగ్గి విషము హరించును.

## అలవాట్లు-అభివృద్ధి

ప్రతి మనిషిలోను కొన్ని మంచి అలవాట్లు, కొన్ని చెడు అలవాట్లు ఉంటాయి. ఈ అలవాట్లు ఇప్పటి జీవన విధానం వలన మారుతూ ఉన్నాయి. మనలో ఒక నానుడి ఉంది ,అదేమిటంటే అలవాటులో పొరపాటు ,ఈ నానుడి దాదాపు ప్రతి ఒక్కరి నోటా మనం తరచూ వింటూనే ఉంటాము. అలవాట్లు ఉన్నప్పుడే పొరపాట్లు జరుగుతూ ఉంటాయి. అలవాట్లు లేని వారు అంటూ ఎవరూ ఉండరు. వాటిని బట్టి నిర్ధారించ వచ్చు మనిషి ఎలాంటి వాడో.అంటే మంచి వాడా ,చెడ్డవాడా అనే విభజన చేయవచ్చు. అయితే ఈ విభజన చేసే దెవరు?దీనికి ప్రామాణిక మేమిటి? అనే ప్రశ్నలు తలెత్తుత్తాయి.మన అలవాట్లు సాటివారికి ఇబ్బంది కలిగించకూడదు.అలాగే ఆ వ్యక్తి శారీరక ,మానసిక ఆరోగ్యాన్ని అవి దెబ్బతీయకూడదు. ఇలాంటి వాటినే మంచి అలవాట్లు అని నిర్వచించుకోవచ్చు. ఆలాగే మన అలవాట్లు సమాజానికి, లోక కల్యాణానికి ఉపయోగపడేలా ఉంటే అవి ఇంకా ఉత్తమమైనవి. మనం ఇప్పుడు ఎంతో అభివృద్ధి చెందామని గొప్పలు చెప్పుకుంటున్నా మానవతా విలువలకు ఆచారాలు,సంప్రదాయాలకు బాగా దూరంగా జరిగి పోవడంతో మన అలవాట్లు కూడా మారిపోతున్నాయి.మనిషి దైనందిన జీవితంలో వేగం పెరిగిన మాట నిజమే కానీ ఆ వేగం ఆచార వ్యవహారాలను సంప్రదాయాలను భంగ పరచకూడదు. కానీ ప్రస్తుతం జరుగుతున్నది అదే. ఉదాహరణకు దైవ ప్రార్థన అనేది మనకు బాల్యం నుంచి అలవాటు.ప్రాతః కాలానికి ముందే కాలకృత్యాలు తీర్చుకొని స్నానమాచరించి దైవ ప్రార్థన చేయడం తరతరాలుగా వస్తున్న ఆచారం. అయితే ఆధునిక కాలంలో రాత్రి బాగా పొద్దు పోయేంతవరకు మెలకువగా ఉండటం వల్ల తెల్లవారుజామున లేచే అలవాటు పోయింది. నిద్ర నుంచి లేస్తూనే దేవుని స్మరించుకోవడం అనే అలవాటుకు కూడా దూరం అవుతున్నాం. దీనికి కూడా ఆధునిక జీవనంలో పెరిగిన వేగమే కారణం.ఎన్ని పనులు ఉన్నా ఇతర అలవాట్లను ఆచారాలనూ మాత్రం దూరం చేసుకోము. ఎన్ని ఒత్తిడులు ఉన్నా, ఎంత బలమైన పనులు ఉన్నా మన పెద్దలు తమ అలవాట్లను ఆచారాలను ఇప్పటికీ పాటిస్తూ ఉంటారు. ఆధునిక సమాజంలో శరీరాన్ని, సంసారాన్ని గుల్ల చేసే అలవాట్లను మాత్రం వదిలేందుకు ఏ మనిషి ఇష్టపడడు. మనిషి వృద్ధికి దోహదం చేసేవే మంచి అలవాట్లు.పెద్దలు చేసే పనులు చూసి పెరిగే పిల్లలు, వాళ్లనే అనుకరిస్తారు.మన మంచి అలవాట్లను పాటిస్తూ, వారికి చెప్తూ ఉంటే వారు కూడా ఆ అలవాట్లనే అనుకరిస్తారు.



**- పాలపర్తి సంధ్యారాణి**

## వీల్‌చైర్ నుండి ఛార్టర్డ్ అకౌంటెంట్‌గా..

సంకల్ప బలం ఉండాలే కానీ... శారీరక వైకల్యం విజయాల్ని ఆపలేదు... అందుకు నేహా బన్సల్ ఓ గొప్ప ఉదాహరణ... పదమూడేళ్ల వయసులో చక్రాల కుర్చీకే పరిమితమైనా... ఆమె కలలు కనడం ఆపలేదు. సీఏ ఫైనల్స్‌లో జాతీయ స్థాయిలో పదో స్థానం అగ్రశ్రేణి ఛార్టర్డ్ అకౌంటెంట్‌గా ఎదిగారు. ఆపై లెన్స్‌కార్ట్ కో ఫౌండం^గా మారి ఆ సంస్థలో కీలక పాత్ర పోషించారు. తాజాగా హురూన్ ఇండియా జాబితా లోనూ స్థానం సంపాదించుకున్నారు. గత ఏడాది నేహా బన్సల్ తన అన్నయ్య పీయూష్ బన్సల్‌తో కలిసి లెన్స్‌కార్ట్‌లో 160 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టి వార్తల్లో నిలిచారు. ఆ సంస్థ ఐపీఓకి వెళ్లడానికి ముందు తీసుకున్న ఈ సాహసోపేతమైన నిర్ణయం అందరినీ ఆశ్చర్యపరిచింది. అయితే, అది సంస్థ భవిష్యత్తుపై తనకున్న నమ్మకమేనంటారామె. నేహా వ్యూహాత్మక ఆలోచనల్ని అమలు చేయడంలో దిట్ట. ప్రస్తుతం ఈ సంస్థలో వర్తకం, లీగల్ సంస్థల బాధ్యతల్ని చూస్తున్నారు. ఢిల్లీలో పుట్టి పెరిగారీమె. 13 ఏళ్ల వయసులో వెన్ను సంబంధిత సమస్య కారణంగా నేహా శరీరం కింది భాగమంతా అచేతనంగా మారింది. దీంతో చక్రాల కుర్చీకే పరిమిత మయ్యారు. ఆడిపాడాల్సిన వయసులో కదల్లేక జపోవడం ఆమెను ఎంతో బాధించింది. కానీ, కుటుంబం అండగా నిలవడంతో తనని తాను అంగీకరించడం మొదలు పెట్టారు. దృష్టినంతా చదువు మీదకు మళ్లించారు. బీకామ్ ఆనర్స్ చదివిన నేహా కళాశాల టాపర్ కూడా. అయితే, వైకల్యం ఉందన్న కారణంతో నేహాను క్యాంపస్ ఇంటర్వ్యూకి అనుమతి లేదట. దీనికోసం మొదట ఎంతో బాధపడినా... నిరాశపడకుండా తన లక్ష్యాన్ని మార్చుకుని సీఏ చేయాలనుకున్నారు. అనుకున్నట్లుగా చదివి సిఎ ఫైనల్స్‌లో ఆఖిల భారత స్థాయిలో పదో ర్యాంకు సాధించారు. ఛార్టర్డ్ అకౌంటెంట్ అ వ్వాలనే కలను నెరవేర్చుకున్నారు. తాను నిరూపించు కున్నారు. పరిపూర్ణ సామర్థ్యం ఉన్నప్పటికీ జీవితం మీద ప్రతికూలతతో ఉండటమే నిజమైన వైకల్యం' అంటారామె.



**అన్నతో కలిసి...** తన సీఏ చదువు...జాగ్రత్తనూ, ముందు చూపుతో ఆలోచించే తత్వాన్నీ నేర్పిందంటారు నేహా. చార్టర్డ్ అకౌంటెంట్గా కెరియర్ ఆరంభించి... ప్రొఫెషనల్ ఫైనాన్స్, అధికారి అడ్వైజరీగా పనిచేశారు. 2008లో అన్న పీయూష్ బన్సల్‌తోకలిసి లెన్స్‌కార్ట్. కామ్‌ను కలిగి. ఇంటిదగ్గరే కంటి పరీక్షలు, పర్సనలైజ్డ్ సర్వీసులు అందిస్తూ, మధ్యవర్తిత్వం లేకుండానే తక్కువ ధరలో, స్టైల్ ఐవేర్ డిజైన్లను రిటైల్‌గా వినియోగదారుడికి అందించడమే లక్ష్యంగా ముందుకు నడిపించారు. 2500లకి పైగా స్టోర్లలతో... వినియోగ దారుల ముందు కనిపించే బాండ్ ఫేస్ పీయుష్ అయితే, నేహా కంపెనీకి వెన్నెముక. హైస్టేక్ నిధుల సేకరణ. ఈ కామర్స్ వేదికగా మొదలైన ఈ వ్యాపారాన్ని ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 2500లకి పైగా స్టోర్లతో... వినియోగదారుల ముందు కనిపించే బ్రాండ్ ఫేస్ పీయుష్ అయితే, నేహా కంపెనీకి వెన్నెముక హైస్టేక్ నిధులు సేకరణ, రెగ్యులేటరీ డిస్‌క్లోజర్స్, అంతర్జాతీయ కనుగోళ్లు వంటి నిర్ణయాల్లో నేహా చురుగ్గా వ్యవహరించారు. టెక్నాలజీపై దృష్టిపెట్టి ఎఐ పవర్డ్ ఐ టెస్ట్ నుంచి డేటా ఆధారిత నిర్ణయాలతో ధైర్యంగా ముందడుగు వేయబట్టే.. ప్రస్తుతం ఈ సంస్థ అంతర్జాతీయ స్థాయిలో తనదైన ముద్ర వేస్తోంది.


## రంగవల్లి



**వాసిత ఉన్నప**
హైద్రాబాద్

21 చుక్కలు, 11 వరకు మధ్య చుక్కలు






**ముగ్గులకు ఆహ్వానం** మా చిరునామా
ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్‌ట్యాంక్ బండ్, డిబిర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.Gmail: cheli@vaartha.com
కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు

## అవసరం నేర్పిస్తుంది ..



ఎంత చెప్పినా బాబుకి లెక్కలు అర్థం కావడం లేదు. 14 ఏళ్లు వచ్చినా పాప గడియారం చూసి సమయం చెప్పలేక పోతోంది. పిజ్జా, బర్గర్లు అలవాటై ఇంట్లో చేసినవేమీ తినడం లేదు. ఇలా చెప్పుకొంటూ పోవాలె కానీ పిల్లల మీద తల్లులకు ఎన్ని ఫిర్యాదులో. చూడటానికి చిన్నగా కనిపించినా... ఇలాంటివన్నీ నైపుణ్యం లోపాల జాబితాలోకే వస్తాయి. అయితే ఇవి సంపాదించుకోవడానికి ఓ అవసరం, అవకాశం రావాలి. దాన్ని తల్లులే సృష్టించాలి. అవసరమే పాఠాలు నేర్పిస్తుంది అంటున్నారు నిపుణులు. లెక్కలు అర్థం కానప్పుడు రూ.50 ఇచ్చి దుకాణానికి పంపండి. రూ.35 సరకులే తెమ్మనండి. అలానే పాకెట్ మనీ ఇచ్చి లెక్క చెప్పమనండి. అంతా ఓ చోట రాసి, ఇవ్వమనండి. ఇలా అన్నా లెక్కలు నేర్చుకుంటారు. స్మార్ట్ వాచ్లూ, ఫోన్లూ దగ్గరుంటే గడియారం చూసి సమయం చెప్పడం ఎలా వస్తుంది పిల్లలకి. అవన్నీ లేనప్పుడే కదా దీని అవసరం పడేది. వాటిని దూరం చేసి చూడండి. దీన్ని తప్పకుండా నేర్చుకుంటారు. అలానే బయటి వంటకాలను పూర్తిగా బ్యాన్ చేస్తే... ఇంటివంట తినడం తప్ప వారిదగ్గర పరిష్కారం ఏముంటుంది. ఇలా మంచి అలవాట్లనీ, నైపుణ్యాన్ని నేర్చుకునే మీరు కల్పించాలే తప్ప... పిర్యాదులు చేస్తే, వారిని దండిస్తే వాళ్లకి ఏదీ నేర్పలేరు. సమస్య ఉంటే దానికి పరిష్కారం కూడా ఉంటుంది. మన ఆలోచనలకు కాస్త పదును పెడితే... పిల్లలకు మనం నేర్పలేనిది, వాళ్లు నేర్చుకోలేనిదంటూ ఏది ఉండదు. పాటిస్తారుగా మరి!

## కోకోనట్ కేక్ ..



**కావలసినవి:**
కొబ్బరి తురుము, ఉప్మారవ్వ, మైదాపిండి, ఆరెంజ్ జ్యూస్ కప్పు చొప్పున, పంచదార కప్పున్నర, వెజిటబుల్ ఆయిల్ పావు కప్పు, ఉప్పు చిటికెడు, కోడిగుడ్లు 4, బేకింగ్ పౌడర్ చెంచా, వెన్న, నిమ్మరసం టేబుల్ స్పూన్ చొప్పున

**తయారీ:** మిక్సింగ్ బౌల్లో కొబ్బరి తురుము, మైదా, ఉప్మారవ్వ, ఉప్పు, బేకింగ్ పౌడర్లను బాగా కలిపి పక్కనుంచాలి. ఆరెంజ్ జ్యూస్లో పచ్చ సొన, వెజిటబుల్ ఆయిల్ వేసి బీట్ చేసి.. కొబ్బరి మిశ్రమంలో కలపాలి. మరో పాత్రలో తెల్లసొన, పంచదారలను ఎలక్ట్రిక్ మిక్సర్తో కలపాలి. మెత్తటి పేస్టులా అయ్యాక.. దీన్ని కూడా కొబ్బరి మిశ్రమానికి జతచేసి కలియబెట్టాలి. అందులో నిమ్మరసం జోడించి ఇంకోసారి కలిపి.. వెన్న రాసిన ప్యాన్‌లో సమంగా సర్దాలి. అవెన్లో 180 డిగ్రీ సెల్సియస్ వద్ద 30 నిమిషాలు బేక్ చేయాలి. బయటకు తీసి.. కాస్త కొబ్బరి తురుము చల్లాలి. అంతే.. కోనట్ కేక్ తిని ఆనందించడమే తరువాయి.

# తెర

## '45 ది మూవీ' అందరినీ ఆకట్టుకుంటుంది



శివరాజ్ కుమార్. తెలుగు వాళ్లు మంచి చిత్రాల్ని ఎప్పుడూ ఆదరిస్తారు. '45 ది మూవీ' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రియల్ స్టార్ ఉపేంద్ర.. కరుణాడ చక్రవర్తి శివ రాజ్ కుమార్, రియల్ స్టార్ ఉపేంద్ర, రాజ్ బి శెట్టి వంటి స్టార్‌లతో అర్జున్ జన్య తెరకెక్కించిన చిత్రం '45 ది మూవీ'. ఈ చిత్రాన్ని సూరజ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద ఉమా రమేష్ రెడ్డి, ఎం రమేష్ రెడ్డి భారీ ఎత్తున నిర్మించారు. మైత్రి ద్వారా తెలుగులో జనవరి 1న ఈ సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. శివరాజ్‌కుమార్ మాట్లాడుతూ,వేద తరువాత మళ్లీ '45 ది మూవీ' కోసం హైదరాబాద్‌కు వచ్చాను. నాలుగైదు నిమిషాల్లోనే అర్జున్‌జన్య అద్భుతంగా స్టోరీని నెరేట్ చేశారు.ఇంటర్వెల్, క్లైమాక్స్ అద్భుతంగా అనిపించింది. ఉపేంద్ర మాట్లాడుతూ, అర్జున్ కథను నెరేట్ చేసిన విధానం నాకు చాలా నచ్చింది. మ్యూజిక్ డైరెక్టర్‌గా ఆయన ఎంత సక్సెస్ అయ్యారో నాకు తెలుసు.దర్శకుడు అర్జున్ జన్యా మాట్లాడుతూ,'45 ది మూవీ'లో ఓ కొత్త ప్రపంచాన్ని చూడబోతోన్నారు. మూడున్నరేళ్లుగా ఈ మూవీ కోసం కష్టపడ్డాను. నాకు ఈ అవకాశం ఇచ్చిన శివన్నకి, ఉపేంద్రకి థాంక్స్. నిర్మాత రమేష్ రెడ్డి మాట్లాడుతూ,45 మూవీ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ సినిమాని చూస్తే దీని విలువ తెలుస్తుంది. గరుడ పురాణం గురించి చాలా గొప్పగా చెప్పే చిత్రమిది. మైత్రి శశి మాట్లాడుతూ,మాకు '45 ది మూవీ రిలీజ్ చేసేందుకు అవకాశం ఇచ్చిన టీంకు థాంక్స్. ఇంటర్వెల్ వరకు ఒకలా ఉంటుంది.

## ప్రియాంక మోహన్. ఫస్ట్ లుక్ పోస్టర్స్ విడుదల



వెర్సటైల్ స్టార్ ధనంజయ ప్రధాన పాత్రలో నటిస్తోన్న '666: ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' సినిమా ప్రారంభమైనప్పటి నుంచి ఎన్నో అప్డేట్స్‌తో ఆకట్టుకుంటోంది. ఇప్పటికే పలువురు స్టార్స్‌తో నిండిన ఈ సినిమాలోకి ఇప్పుడు పాపులర్ హీరోయిన్ ప్రియాంక మోహన్ జాయిన్ అయ్యారు. తాజాగా ఈ సినిమాలో ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్స్‌ను మేకర్స్ విడుదల చేసింది.ధనంజయ ప్రధాన పాత్రలో నటిస్తున '666: ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' సినిమాలో డా. శివరాజ్‌కుమార్ కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు. సినిమా మూడు షెడ్యూల్స్ షూటింగ్‌ను పూర్తి చేసుకుంది. ఈ చిత్రాన్ని తెలుగు, కన్నడ భాషల్లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

## 'రాజా సాబ్' బ్లాక్ బస్టర్ కావాలి




**రెబల్ స్టార్ ప్రభాస్**

రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ"రాజా సాబ్" ఈ చిత్రాన్ని హారర్ కామెడీ జానర్‌లో ఎవర్ గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా తెరకెక్కిస్తున్నారు దర్శకుడు మారుతి. 'రాజా సాబ్' సినిమాను భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో అన్ కాంప్రమైజ్డ్‌గా నిర్మిస్తున్నారు నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. సంక్రాంతి సందడిని రెట్టింపు చేసేందుకు జనవరి 9న "రాజా సాబ్" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు హైదరాబాద్‌లో "రాజా సాబ్" ప్రీ రిలీజ్ ఈవెంట్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ రిద్ధి కుమార్ మాట్లాడుతూ, రాజాసాబ్ పర్ఫెక్ట్ ఎంటర్ టైనర్ మూవీ. ప్రభాస్ మనందరికీ డార్లింగ్. హీరోయిన్ మాళవిక మోహనన్‌మాట్లాడుతూ, నాకు తెలుగు సినిమా ఇండస్ట్రీ అంటే ఇష్టం, గౌరవం. ప్రభాస్ లాంటి పాన్ ఇండియా స్టార్ సరసన నటిస్తూ,అడుగుపెడతానని ఊహించలేదు. హీరోయిన్ నిధి అగర్వాల్ మాట్లాడుతూ,ఇండియా బిగ్గెస్ట్ సూపర్ స్టార్ ప్రభాస్‌తో కలిసి సినిమా చేయడం కల నిజమైన అనుభూతి కలిగిస్తోంది. డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ, అది మీరు ఇస్తున్న సపోర్ట్ వల్లే. రాజా సాబ్ వెనక బలంగా నిలబడింది ఇద్దరు. ఒకరు ప్రభాస్, మరొకరు విశ్వప్రసాద్. రెబల్ స్టార్ ప్రభాస్ మాట్లాడుతూ, నాఫ్యాన్స్ అందరికీ హాయ్, ఈమధ్యే జపాన్ ఫ్యాన్స్‌ను కలిసినప్పుడు ఇలాగే హ్యాపీగా ఫీలయ్యా. మీ అందరి కోసం కొత్త హెయిర్ స్టైల్‌లో వచ్చా. అనిల్ తడానీ నా బ్రదర్ లాంటి వారు. ఆయన నా సినిమాలకు నార్త్ లో సపోర్ట్ చేస్తుంటారు. సంజయ్ దత్ గారు క్లోజ్ షాట్ పెడితే సీన్ మొత్తం తినేస్తారు, షాకై పోతారు. ఈ సినిమాకు అనుకున్న బడ్జెట్ పెరిగింది. అయినా ఎంతో ధైర్యంగా విశ్వప్రసాద్ సినిమా నిర్మించారు.

## 'ఈషా' విజయం క్రెడిట్ ప్రేక్షకులదే..

**వంశీ నందిపాటి**

. కంటెంట్ ఈజ్ కింగ్ అని మరోసారి ప్రూవ్ చేశారని వంశీ నందిపాటి

రాంబాయి వంటి బ్లాక్‌బస్టర్స్ అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటిల సక్సెస్‌ఫుల్ ద్వయం తాజాగా నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై 'ఈషా'అనే హారర్ థ్రిల్లర్‌ను అందించారు. ఈ క్రిస్మస్‌కు విడుదలైన ఈ చిత్రం ఈ క్రిస్మస్ విజేతగా నిలిచింది. అఖిల్‌రాజ్ త్రిగుణ్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రంలో హెబ్బాపటేల్ కథానాయిక. సిరి హనుమంతు, బబ్లూ, పృథ్వీరాజ్ ఇతర ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని హెచ్‌వీఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మించారు. శ్రీనివాస్ మన్నె దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ దిశగా దూసుకెళుతోంది. ఈనేపథ్యంలో చిత్ర టీమ్ బ్లాక్‌బస్టర్ మీట్‌ను నిర్వహించారు.



## 'పతంగ్ 'బ్యూటిఫుల్ సినిమా



ఎస్‌కేఎన్ ప్రముఖ నిర్మాత డి.సురేష్ బాబు సమర్పణలో రూపొందిన చిత్రం 'పతంగ్' ఈ చిత్రం సినిమాటిక్ ఎలిమెంట్స్, రిషన్ సినిమాస్, మాన్‌సూన్ టేల్స్ సంస్థలు ప్రతిష్టాత్మకంగా నిర్మించాయి. ఈ స్పోర్ట్స్ డ్రామా ఈ చిత్రానికి విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మకా , సురేష్ కొత్తింటి, నాని బండ్రెడ్డి నిర్మాతలు. ప్రణీత్ పత్తిపాటి దర్శకుడు. పాపులర్ దర్శకుడు నటుడు గౌతమ్ వాసుదేవ మీనన్, ప్రముఖ సింగర్, నటుడు ఎస్పీ చరణ్ ఈ చిత్రంలో కీలకమైన పాత్రల్లో కనిపించబోతున్నారు. క్రిస్మస్ కానుకగా విడుదలైన ఈ చిత్రం యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా మంచి రెస్పాన్స్‌ను రాబట్టుకుంది. కాగా ఈ చిత్రం సక్సెస్ మీట్ హైదరాబాద్‌లో జరిగింది. ఈ టీమ్‌ను అభినందించడానికి కల్ట్ ప్రొడ్యూసర్ ఎస్‌కేఎన్, హీరో సందీప్‌కిషన్‌లు ఈ ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు. ఎస్‌కేఎన్ మాట్లాడుతూ, సినిమా చూశాను. చూడగానే ఈ మధ్య కాలంలో వన్‌ఆఫ్ ది బ్యూటిఫుల్ ఫిలిం. బ్యూటిఫుల్ ఎమోషన్స్. సినిమా చాలా జెన్యూన్‌గా అనిపించింది. సందీప్ కిషన్ మాట్లాడుతూ పతంగ్ సినిమాను నేను గమనిస్తున్నాను.ప్రతి ప్రమోషనల్ కంటెంట్ బాగుంది. నిర్మాతలు మాట్లాడుతూ, మంచి సినిమాను అందరూ సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. అసోసియేట్ ప్రొడ్యూసర్ రమ్యఇలాంటి కొత్త సినిమాకు ఏమైనా చేయాలని అనిపించింది. దర్శకుడు ప్రణీత్ మాట్లాడుతూ, సినిమాకు వస్తున్న రెస్పాన్స్ బాగుంది. దొరకలేదు. కానీ మీకు దగ్గర్లో ఉన్న థియేటర్‌కు వెళ్లి సినిమా చూస్తే మీరు డిజప్పాయింట్ అవ్వరు అన్నారు.

## జనవరి 2న 'ఓ అందాల రాక్షసి ' విడుదల

దర్శకుడిగా, హీరోగా, సంగీత దర్శకుడిగా, కథకుడిగా షెరాజ్ మెహదీ అందరినీ ఆకట్టుకుంటూ ఉన్నారు. ప్రస్తుతం ఆయన 'ఓ అందాల రాక్షసి'అనే చిత్రంతో హీరోగా, దర్శకుడిగా మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో విహాన్షి హెగ్డే, కృతి వర్మలు హీరోయిన్లుగా నటించారు. స్కై ఈజ్ ది లిమిట్ బ్యానర్ మీద సురేందర్ కౌర్ నిర్మాతగా 'ఓ అందాల రాక్షసి' అనే చిత్రం జనవరి 2న రాబోతోంది. ఈ క్రమంలో చిత్రయూనిట్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో..కృతి వర్మ మాట్లాడుతూ, 'ఓ అందాల రాక్షసి' మూవీలో నాకు అవకాశం ఇచ్చిన షెరాజ్‌కి థాంక్స్. జనవరి 2న మేం ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నాం. విహాన్షి హెగ్డే మాట్లాడుతూ,అమ్మాయిల్ని మోసం చేస్తే.. ఆ అందం రాక్షసిగా మారుతుంది. అదే మా'ఓ అందాల రాక్షసి'. ఈ చిత్రం, కథ నాకు చాలా నచ్చింది. అని అన్నారు.



# టెన్నిస్ టోర్నమెంట్‌లో వైదేహికి టైటిల్

## అంకిత-వైష్ణవి జోడీకి డబుల్స్ టైటిల్

**న్యూఢిల్లీ:** డబ్ల్యూ35 షోలాపూర్ 2025 టెన్నిస్ టోర్నమెంట్‌లో వైదేహి చౌదరి మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. అలాగూ మహిళల డబుల్స్ విభాగంలో అంకిత-వైష్ణవి జోడీ డబుల్స్ టైటిల్‌ను సాధించింది. ఆదివారం మహారాష్ట్రలో జరిగిన ఈ టెన్నిస్ టోర్నీలో భారత స్టార్ టెన్నిస్ క్రీడాకారిణి వైదేహిచౌదరి మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది.



టోర్నమెంట్‌లో ఆరో సీడ్‌లో ఉన్న 25 ఏళ్ల ఈ క్రీడాకారిణి, మూడు సెట్ల హోరాహోరీ పోరు తర్వాత ఫైనల్‌లో జపాన్‌కు చెందిన దిగువ ర్యాంక్‌లో ఉన్న మిచికా ఒజెకిని 3-6, 6-3, 6-4 తేడాతో ఓడించింది. ఇది వైదేహి కెరీర్‌లో నాల్గవ ఐటీఎఫ్ సింగిల్స్ టైటిల్. అంతకు ముందు, ఆమె సెమీఫైనల్స్‌లో జాతీయ ఛాంపియన్ వైష్ణవి అడ్కర్‌ను ఓడించి ఫైనల్‌లో స్థానం సంపాదించుకుంది, ఓజెకి తన సెమీస్‌లో రెండవ సీడ్ శ్రీవల్లి భమిడిపాటిని ఓడించింది. గత ఏడాది జూన్ లో చైనీస్ తైపీలో జరిగిన జూ35 తైపీ ఫార్మోసా కప్ టైటిల్‌ను ఆమె గెలుచుకున్న తర్వాత మొదటిది. మరోపక్క సెమీఫైనల్స్ లో ఓడిపోయిన వైష్ణవి డబుల్స్ లో బలంగా పుంజుకుంది. అనుభవజ్ఞురాలైన అంకితా రైనాతో కలిసి మహిళల డబుల్స్ టైటిల్ ను గెలుచుకుంది. సూపర్‌టైబ్రేక్‌ల తర్వాత ఫైనల్‌లో ఇండోరష్యన్ జంట జీల్ దేశాయ్-ఎలినా నెప్లీని 4-6, 7-5, 10-6 తేడాతో ఓడించి టైటిల్‌ను సాధించింది. 21 ఏళ్ల వైష్ణవికి ఇది తొలి సీనియర్ అంతర్జాతీయ టైటిల్ కాగా, 32 ఏళ్ల అంకిత తన 33వ డబుల్స్ టైటిల్‌ను (2025లో నాల్గవది) గెలుచుకుంది.

### దక్షిణాఫ్రికా టి20 లీగ్‌లో..

# సన్‌రైజర్స్ ఘన విజయం

## 42 రన్స్‌కే కుప్పకూలిన రాయల్స్

**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికా టీ20 లీగ్ 2025-26 సీజన్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ అనుబంధ సంస్థ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ ఘనంగా ప్రారంభించింది. ఈ టోర్నీలో భాగంగా బోలాండ్ పార్క్ వేదికగా పార్ల్ యారల్స్‌లో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 137 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. 187 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పార్ల్ రాయల్స్ 11.5 ఓవర్లలో



కేవలం 42 పరుగులకే కుప్పకూలింది. ఒక్కరంటే ఒక్కరు కూడా పట్టుమని పది నిముషాల కూడా క్రీజులో నిలవలేకపోయారు. మొత్తం తొమ్మిది మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్ స్కోర్‌కే పరిమితమయ్యారు. కెప్టెన్ మిల్లర్ (7) కూడా ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయాడు. సన్‌రైజర్స్ స్పీడ్ స్టార్ అన్రిచ్ నోర్జే 4 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి పతనాన్ని శాసించాడు. అతడితో పాటు, ఆడమ్ మిల్నే, తరించు రత్నాయకే తలా రెండు వికెట్లు సాధించారు. అంతకు ముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు నష్టానిక 186 పరుగుల భారీ స్కోర్ సాధించింది. జోర్డాన్ హెర్మన్ (5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 62) టాప్ స్కోరర్‌గా నిలవగా, క్వింటన్ డికాక్ (42) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కాగా ఈ మ్యాచ్‌లో 49 పరుగులకే ఆలౌట్ అయిన పార్ల్ రాయల్స్ అత్యంత చెత్త రికార్డును తమ పేరిట లిచంచుకుంది. సౌతాఫ్రికా టీ20 లీగ్ చరిత్రలోనే అత్యల్ప స్కోరు నమోదు చేసిన జట్టుగా లిచంచుకుంది. ఇంతకు ముందు ఈ రికార్డు ప్రిటోరియా క్యాపిటల్స్ (520 పేరిట ఉండేది. తాజా మ్యాచ్‌తో ప్రిటోరియాను రాయల్స్ అధిగమించింది.




### షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో

# తిలోత్తమకు స్వర్ణం

**న్యూఢిల్లీ:** జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఫైనల్‌లో తిలోత్తమ సేన్ అద్భుతమైన ప్రదర్శనతో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఆమె 466.9 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. కర్ణాటక షూటర్ ఫైనల్ పోటీలో ముందంజలో నిలిచింది. కేరళకు చెందిన విదర్స కె. వినోద్ 462.9 పాయింట్లతో రజతాన్ని సాధించగా, రైల్వేస్‌కు చెందిన అయోనికా పాల్ 451.8 పాయింట్లతో కాంస్య పతకం సాధించింది. అంతకుముందు, తిలోత్తమ 591-29+తో అర్హత రౌండ్‌లో అగ్రస్థానంలో నిలువగా, విదర్స 589-29+తో రెండవ స్థానంలో, కర్ణాటకకు చెందిన అనుష్క హెచ్ థోకూర్ 588-33+తో అర్హత రౌండ్‌లో మూడవ స్థానంలో నిలిచింది. ఫైనల్లో, అనుష్క 441.2 పాయింట్లతో నాల్గవ స్థానంలో నిలిచి పతకాన్ని తృటిలో కోల్పోయింది. జూనియర్ మహిళల 50 మీటర్ల రైఫిల్ 3పి టీమ్ ఈవెంట్‌లో ఆర్మీకి చెందిన రీతుపర్ణ సతీష్ దేశ్‌ముఖ్ ఫైనల్‌లో 458.6తో బంగారు పతకాన్ని గెలుచుకుంది. క్వాలిఫికేషన్‌లో నాల్గవ స్థానం నుండి రీతుపర్ణ 584-31+తో ఎగబాకి, ఫైనల్‌లో గరిష్ట స్థాయికి చేరుకుంది. హర్యానాకు చెందిన నిశ్చల్ బలమైన సవాలును ఎదుర్కొన్నప్పటికీ 0.5 పాయింట్లు వెనుకబడి 458.1తో రజతాన్ని, కర్ణాటకకు చెందిన అనుష్క హెచ్ థోకూర్ 447.6తో కాంస్యం సాధించింది. సీనియర్ మహిళల 50 మీటర్ల రైఫిల్ 3పి టీమ్ ఈవెంట్‌లో రాజస్థాన్ జట్టు మణిని కౌశిక్, స్వీటీ చౌదరి, మోనికా జఖర్ 1751 పాయింట్లతో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఆశి చౌక్సే, శ్రీవల్లి శ్రీవాస్తవ, నూపుర్ కుమావత్ సంయుక్తంగా రాణించడంతో మధ్యప్రదేశ్ 1750 పాయింట్లతో రజత పతకాన్ని గెలుచుకుంది. హర్యానా జట్టు స్వాతి, ఆకృతి దహియా, నిశ్చల్ లు ప్రాతినిధ్యం వహించిన మొత్తం 1750 పాయింట్లతో కాంస్య పతకాన్ని గెలుచుకుంది.

# వన్డేల్లో టాప్ 5 ఇన్నింగ్స్

## భారత్ బ్యాట్స్‌మన్ల అద్భుత ప్రదర్శన



**న్యూఢిల్లీ:** 2025లో టీమ్ ఇండియా వన్డేల్లో అద్భుతాలను సృష్టించింది. మెన్ ఇన్ బ్లూ 14 మ్యాచ్‌లు ఆడి 11 మ్యాచ్‌లు గెలిచి మూడింటిలో మాత్రమే ఓడిపోయింది. దీనితో వారికి 78.57 విజయ శాతం లభించింది. ఈ ఏడాదిని ఇంగ్లాండ్‌పై 3-0 తేడాతో స్వదేశంలో సిరీస్ విజయంతో భారత్ ప్రారంభించింది. ఆ తర్వాత యుఎఇలో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో వారు అజేయంగా నిలిచారు. తర్వాత ఆస్ట్రేలియాలో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత్ 2-1 తేడాతో కోల్పోయింది. అయితే, దక్షిణాఫ్రికాపై 2-1 తేడాతో స్వదేశంలో సిరీస్ విజయంతో వారు 2025ను అత్యున్నత స్థాయిలో ముగించారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది టీం ఇండియా బ్యాట్స్‌మెన్ ఆడిన టాప్ ఐదు వన్డే ఇన్నింగ్స్‌లు తీపి గుర్తులుగా ఉండిపోయితాయి. రాంచీలో దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డేలో విరాట్ కోహ్లీ తన అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించాడు. సిరీస్‌లోని మొదటి వన్డే మ్యాచ్‌లో కోహ్లీ 120 బంతుల్లో 135 పరుగులు చేశాడు. 173 నిమిషాల ఆటలో అతను 11 ఫోర్లు, 7 సిక్సర్లు బాదాడు. అలాగే సిడ్నీలో ఆస్ట్రేలియాతో జరిగిన చివరి వన్డేలో భారత్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అద్భుతమైన సెంచరీతో సంవత్సరాలను వెనక్కి తిప్పాడు. లక్ష్యఛేదనలో రోహిత్ 125 బంతుల్లో 121 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతను 13 ఫోర్లు, మూడు సిక్సర్లు కొట్టాడు. ఇక దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో యశస్వి జైస్వాల్ తన తొలి వన్డే సెంచరీని కూడా సాధించాడు. గాయపడిన శుభ్‌మాన్ గిల్ లేకపోవడంతో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన జైస్వాల్, విశాఖపట్నంలో జరిగిన నిర్ణయాత్మక మ్యాచ్‌లో మ్యాచ్ గెలిచే ఇన్నింగ్స్‌ను అందించాడు. 271 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో జైస్వాల్ 121 బంతుల్లో 116 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో 12 ఫోర్లు, రెండు సిక్సర్లు ఉన్నాయి. శుభ్‌మాన్ గిల్ భారత్ తరపున 11 వన్డే మ్యాచ్‌లు ఆడాడు. 11 ఇన్నింగ్స్‌లలో, అతను 49 సగటు మరియు 88.76 స్ట్రైక్ రేట్‌తో 490 పరుగులు చేశాడు. ఈ సమయంలో 2 సెంచరీలు, మరో 2 హాఫ్ సెంచరీలు సాధించాడు. అహ్మదాబాద్‌లో జరిగిన మూడవ మరియు చివరి వన్డేలో గిల్ 102 బంతుల్లో 112 పరుగులు చేసి అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. అతని ఇన్నింగ్స్‌లో 14 ఫోర్లు, మూడు సిక్సర్లు ఉన్నాయి. కాగా రాయ్‌పూర్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో రుతురాజ్ గైక్వాడ్ తన తొలి వన్డే సెంచరీ సాధించాడు. శ్రేయాస్ అయ్యర్ గాయం కారణంగా అవుట్ కావడంతో అతను ఈ మ్యాచ్‌లో నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేశాడు.

దక్షిణాఫ్రికా టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న తర్వాత, భారత్ మొదటి 10 ఓవర్లలోనే ఇద్దరు ఓపెనర్లను కోల్పోయింది. ఆ తర్వాత గైక్వాడ్ బలమైన ఎదురుదాడిని ప్రారంభించి కేవలం 83 బంతుల్లో 105 పరుగులు చేసి 12 ఫోర్లు, 2 సిక్సర్లతో రాణించాడు.

### వరల్డ్ రాపిడ్ ఛాంపియన్‌షిప్..

# అగ్రస్థానానికి హంపి

## అర్జున్, గుకేష్ తొలి ఓటమి

**న్యూఢిల్లీ:** వరల్డ్ రాపిడ్ ఛాంపియన్‌షిప్ 2025లో వరుసగా మూడు విజయాలు సాధించిన తర్వాత భారత్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి అగ్రస్థానానికి చేరుకుంది. ఇదే సమయంలో భారత్ గ్రాండ్ మాస్టర్లు ఎరిగైసి అర్జున్, దొమ్మరాజు గుకేష్‌లు తొలి ఓటమిని ఎదుర్కొన్నారు. దోహాలో జరిగిన ఛాంపియన్‌షిప్ టోర్నీ మహిళల విభాగంలో డిఫెండింగ్ ఛాంపియన్ హంపి మొదటి రోజు నెమ్మదిగా ఆడిన హంపి తర్వాత వరుసగా మూడు విజయాలను నమోదు చేసింది. ఆ తర్వాత అలెగ్జాండ్రా గోరియాచ్కినాతో జరిగిన నాల్గవ గేమ్‌లో డ్రాగా ఆడింది. ఈ ప్రదర్శనతో ఆమె 8 ఆటల్లో 6.5 పాయింట్లతో



అగ్రస్థానంలో ఉన్న ఝు జినర్‌తో చేరింది. అలాగే ద్రోణవల్లి హారిక (6/8) 2వ రోజు తర్వాత అజేయంగా నిలిచింది. అయితే దివ్య దేశ్‌ముఖ్ (5.5/8) 8వ రౌండ్‌లో తన మొదటి ఓటమిని ఎదుర్కొంది. ఇక ఓపెన్ విభాగంలో అర్జున్-గుకేష్ వరుసగా ఆరవ, తొమ్మిదవ రౌండ్లలో తమ తొలి ఓటమిని ఎదుర్కొన్నారు. అర్జున్ రష్యాకు చెందిన వ్లాడిస్లావ్ ఆర్టెమియేవ్ చేతిలో తెల్లటి పావులతో ఓడిపోయాడు. గుకేష్ ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నోడిర్బెక్ అబ్దుసత్తోరోవ్ చేతిలో తలవంచాడు. వారిద్దరూ ఇప్పుడు 9 ఆటల్లో 6.5 పాయింట్లను కలిగి ఉన్నారు. అలాగే భారత్‌కు చెందిన గ్రాండ్ మాస్టర్లు నిహాల్ సరిన్, రమేష్‌బాబు ప్రజ్ఞానంద, ప్రణవ్ ఆనంద్ 9 ఆటల్లో 6 పాయింట్లు సాధించారు.

## వాణిజ్యం

# రియాల్టీ రంగానికి 3.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

## నైట్‌ఫ్రాంక్ సర్వే నివేదిక వెల్లడి



**ముంబయి, డిసెంబరు 28:** భారత రియల్‌ఎస్టేట్‌రంగంలో ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులు ఈ ఏడాది ఇప్పటివరకూ 3.5 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు నైట్‌ఫ్రాంక్ నివేదిక స్పష్టంచేసింది. దీనితో రియల్ ఎస్టేట్‌రంగంపై ఇన్వెస్టర్ల ఆసక్తి స్థిరంగా ఉందని, తక్కువ రిస్క్, స్థిరమైన రాబడులు వస్తుండటంతో ఇన్వెస్టర్లు రియాల్టీవైపు మొగ్గుచూపిస్తున్నట్లు నైట్‌ఫ్రాంక్ విశ్లేషించింది. ప్రైవేటు ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ ఇన్ ఇండియా హెచ్2 2025 అన్న శీర్షికన పొందు పరిచిన నివేదికలో ప్రైవేటు పెట్టుబడులు భారీగా పెరుగుతున్నట్లు అంచనావేసింది. మొత్తం పెట్టుబడుల్లో 58శాతం ఆఫీస్ రియల్ ఎస్టేట్ వాటాగా ఉంది. మొత్తం 200 కోట్ల డాలర్లుగా ఉన్నట్లు అంచనావేసింది. రియాల్టీరంగంలో ఇన్వెస్టర్లకు నమ్మకం మరింతపెరుగుతున్నట్లు సంస్థాగత డిమాండ్‌తోపాటు లీజు స్థిరత్వం కూడా పెరుగుతూ వస్తోంది. మూడేళ్ల సగటున చూస్తే ఆఫీస్ రియాల్టీలో మరింత విస్తృతం అవుతున్నాయి. ఇక రెసిడెన్షియల్ రియల్‌ఎస్టేట్ రంగంలో రెండో అతిపెద్ద వాటాతో ఉంది. ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులు 17శాతంగా ఉన్నట్లు తేల్చింది. ఇన్వెస్టర్లు ఎక్కువగా నిర్మాణం పూర్తిచేసిన, రుణ ఆధారిత డీల్స్‌వైపు ఆసక్తి పెంచుతున్నారు. ఇన్వెస్టర్ల ఫోకస్ కూడా రిటర్నులు, పెట్టుబడులకు రక్షణ ఉండేటట్లు చూసుకుంటున్నారు. తక్కువ రిస్క్ ఉన్న ప్రాజెక్టులవైపు ఫోకస్ పెడుతున్నారు. జిడిపి వృద్ధి, ద్రవ్యోల్బణం, వడ్డీరేట్లు వంటివి కొంత మెరుగుదలను నమోదుచేసినా పెట్టుబడులను పెంచలేకుండా ఉన్నాయి. దీనివల్ల ఇన్వెస్టర్లు ఎంపికచేసిన రంగాల్లో అప్రమత్తంగా ఉంటున్నారు. గోదాములరంగంమూడో స్థానంలో ఉంది. 15శాతం మొత్తంప్రైవేటు ఈక్విటీపెట్టుబడులు వచ్చినట్లు తెలుస్తోంది. ఇక లాజిస్టిక్స్ రంగంపరంగా కూడా స్థిరంగా ఉన్నాయి. ఈకామర్స్, ఉత్పత్తిరంగం, సరఫరా రంగాల్లో వృద్ధి ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులకు ఆసరా ఇస్తున్నాయి. మొత్తంప్రైవేటు ఈక్విటీ పెట్టుబడుల్లోనే రియాల్టీరంగం 11శాతం పెట్టుబడులను ఆకర్షించింది. హైక్వాలిటీ రిటైల్ ఆస్తులు, పటిష్టమైన పనితీరు ఉండటంతో వాటిపైనే ఎక్కువ దృష్టిసారిస్తున్నట్లు నైట్‌ఫ్రాంక్ వెల్లడించారు.




### టాప్ ఏడు కంపెనీల్లో

# రూ.35,439.56 కోట్లు పతనం

## మార్కెట్ విలువల్లో టాప్ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్

**ముంబయి, డిసెంబరు 28:** భారత్‌లోని టాప్ పది కంపెనీల్లో ఏడు కంపెనీల మార్కెట్ విలువలు రూ.35,439.56 కోట్లు క్షీణించాయి. వీటిలో బజాజ్ ఫైనాన్స్ సింహ భాగంలో ఉంది. మార్కెట్ విలువలు బజాజ్‌ఫైనాన్స్‌పరంగా రూ.5102.43 కోట్లు క్షీణించి రూ.6,22,124.01 కోట్లకు చేరింది. టాప్ పది జాబితాలో భారతీయ స్టేట్‌బ్యాంకు భారీ నష్టం చవిచూసింది. మార్కెట్ విలువలు రూ.12,692.1 కోటు క్షీణించి రూ.8,92,046.88 కోట్లకు చేరింది. ఇతర సంస్థలు లార్సెన్ అండ్ టూబ్రో మార్కెట్ విలువలు రూ.4002.94 కోట్లు క్షీణించి రూ.5,56,436.22కోట్లకు చేరితే ఐసిఐసిఐబ్యాంకు రూ.2571.39 కోట్లుక్షీణించి రూ.9,65,669.15కోట్లకు చేరినట్లు తేలింది. జీవితబీమా సంస్థ కూడా రూ.1802.62 కోట్లు క్షీణించి రూ.5,37,403.43కోట్లకు చేరితే టిసిఎస్ రూ.1013.07 కోట్లు క్షీణించి 11,86,660.34కోట్లకు చేరుకుంది. ఇక హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు మాత్రం మార్కెట్ విలువలు పెంచుకోగలిగింది. రూ.10,126.81 కోట్లు పెరిగి రూ.15,26,765.44కోట్లకు చేరింది. ఇన్ఫోసిస్ రూ.6,626.62 కోట్లుపెరిగి మార్కెట్ విలువలు రూ.6,87,818.84కోట్లకు చేరినట్లుమార్కెట్ గణాంకాలు చెపుతున్నాయి. అలాగే భారతీ ఎయిర్‌టెల్ కూడా 5359.98కోట్లు పెంచుకోగలిగింది. మొత్తం మార్కెట్ విలువలు 12,00,692.32 కోట్లకు చేరాయి. వారంరోజుల్లో హెచ్చు తగ్గులు నెలకొన్నా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, టిసిఎస్, ఐసిఐసిఐ బ్యాంకు, భారతీయ స్టేట్‌బ్యాంకు, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, ఎల్‌అండ్‌టి, ఎల్‌ఐసి సంస్థలు వరుసస్థానాల్లో నిలిచాయి.




### 'శ్రేయీ' రుణాల్లో బకాయిలపై

# ఆర్బీఐకి పిఎన్బీ నివేదిక

**ముంబయి, డిసెంబరు 28:** ప్రభుత్వరంగంలోనిపంజాబ్‌నేషనల్‌బ్యాంకు తమ పరంగా శ్రేయీ ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్, శ్రేయి ఇన్‌ఫ్రా ఫైనాన్స్‌లకు ఇచ్చిన రుణాల్లో మోసం జరిగిందని రిజర్వుబ్యాంకుకు తెలిపింది. మొత్తం రూ.2434 కోట్ల మేర మోసం జరిగినట్లు పీఎన్బీ ఆర్‌బిఐకి నివేదించింది. పంజాబ్ సింధ్‌బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలు కూడా గతంలో ఈ మోసంపై ఆర్బీఐకి నివేదికలు ఇచ్చాయి. అలాగే పీఎన్బీ స్టాక్ ఎక్చేంజిల ఫైలింగ్‌లోకూడా ఈసమాచారం తెలిపింది. శ్రేయి ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్‌లో రూ.1240.94 కోట్లమేర ఉన్నాయని, మిగిలిన మొత్తం 1193.06 కోట్లు శ్రేయి ఇన్‌ఫ్రా ఫైనాన్స్‌పరంగా ఉన్నట్లు వెల్లడించింది. ఈరుణాలకోసమేప్రభుత్వరంగంలో మూడో అతిపెద్ద బ్యాంకు పిఎన్బీ 100శాతం కేటాయింపులు జరిపింది.

ఈ రెండుఖాతాలు మోసాలతో ఉన్న ఖాతాలని కెపిఎంజి ఫోరెన్సిక్ ఆడినివేదిక కూడా ఇచ్చిందని వెల్లడించింది. అయితే కెపిఎంజినివేదికను శ్రేయి వ్యవస్థాపకుడు హేమంత్ కనోరియా సవాల్‌చేసారు. శ్రేయిగ్రూప్‌ప్రస్తుతం దివాలా ప్రక్రియలో ఉంది. 2021నుంచి కొనసాగుతున్నది. జాతీయ కంపెనీ లాట్రిబ్యునల్ కంపెనీ దివాలా ప్రక్రియ ప్లాన్‌ను ఆమోదించింది. నేషనల్ అసెట్ రికన్‌స్ట్రక్షన్ కంపెనీ అందించిన దివాలాప్రక్రియకు ఎన్సీఎల్టీ ఆమోదం తెలిపింది. శ్రేయీ కంపెనీలు కొనుగోలుకు ఎన్ఎఆర్‌సిఎల్ బిడ్లువేసింది. రూ.32,750 కోట్లు రుణాలు చెల్లించాల్సి ఉంటుందని కూడా తేల్చారు. 2023 ఫిబ్రవరిలో కంపెనీ బిడ్ ఆమోదం లభించింది. 2024 జనవరికల్లా సమీకరణపూర్తిచేసుకోవాలి. సుమారు రూ.14,301 కోట్లు చెల్లించింది. బానయంకర్లకు రూ.3180 కోట్లు అప్‌ఫ్రంట్‌గా చెల్లించింది. డిబెంచర్లరూపంలో రూ.8వేల కోట్లు చెల్లింపులకు కూడా కంపెనీ ముందుకువచ్చింది.




### ఫెడ్‌రిజర్వు, డాలర్ రూపీ

# కదలికలే కీలకం!

## ఈ వారంలో బిఎస్‌ఇ సెన్సెక్స్‌లపై ఇన్వెస్టర్ల అంచనాలు

**ముంబయి, డిసెంబరు 28:** మార్కెట్లు ఆసాంతం ఈ వారంలో కొంతమేర నీరసిస్తే వచ్చేవారంలో మాత్రం గ్లోబల్ మార్కెట్ల తీరుతెన్నులు, దేశీయ గణాంకాలు కీలకం కానున్నాయి. వీటికితోడు అమెరికా ఫెడ్ రిజర్వు సమీక్ష నిర్ణయాలు, డాలర్ రూపాయి కరెన్సీ కదలికలు, విదేశీ పెట్టుబడుల లావాదేవీలు కూడా మార్కెట్లకు దిశా నిర్దేశంచేస్తాయి. వారాంతంలో మార్కెట్లు నష్టాల్లోనే ముగిసాయి. గ్లోబల్ మార్కెట్ల పరిస్థితులు మిశ్రమంగా కనిపించడం, ఇన్వెస్టర్ల అప్రమత్తత ఒత్తిడిని మరింతపెంచాయి. వచ్చే వారంలో భారత పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాలు కీలకం అవుతాయి. ఇన్వెస్టర్లు ఎక్కువగా నవంబరునెల పారిశ్రామిక ఉత్పత్తి డేటాపై దృష్టిసారిస్తారు. సోమవారం ఈ డేటా విడులవుతుంది. అలాగే అమెరికా ఫెడ్ రిజర్వు గణాంకాలుకూడా మార్కెట్లను ప్రభావితంచేస్తాయి. ఈనెల 31వ తేదీ ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ పాలసీ నిర్ణయాలు చైర్మన్‌జెరోమ్‌పావెల్ వెల్లడిస్తారు. ఫెడ్‌రిజర్వు తన వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 3.75శాతానికి తీసుకువస్తుందన్న అంచనాలున్నాయి. ఫెడ్ రిజర్వు నిర్ణయాలు మెరుగుపడితే మార్కెట్లనుంచి పెట్టుబడులన్నీ అటువైపు మళ్లుతాయి. ఇక డాలర్ రూపాయి మారకం విలువలు కూడా కీలకం అవుతున్నాయి. వారాంతంలో 19 పైసలు క్షీణించి 89.90 రూపాయలకు చేరుకుంది. మార్కెట్‌లపరంగా దేశీయంగా ప్రభుత్వపరమైన విధాన నిర్ణయాలేమీ లేకపోవడంతో ట్రేడింగ్‌లో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉంటారని తెలుస్తోంది. ఆర్థిక గణాంకాలు, గ్లోబల్ సంకేతాలు, విదేశీ ఫండ్‌ల రాక వంటివే ఈ వారం మార్కెట్లలో కీలకం అవుతాయి.

# భారత్ విదేశీ కరెన్సీ ఖజానా కళకళ!

## 693.32 బిలియన్ డాలర్లకు పెరిగిన నిల్వలు



**న్యూఢిల్లీ, డిసెంబరు 28:** రిజర్వుబ్యాంకులో ఉన్న భారత విదేశీ కరెన్సీ నిల్వలు 4.37 బిలియన్ డాలర్లుపెరిగి 693.32 బిలియన్ డాలర్లమేర రికార్డుస్థాయికి పెరిగాయి. అంతకుముందు వారంలో 688.95 బిలియన్ డాలర్లతోపోలిస్తే 4.37 బిలియన్ డాలర్లుపెరిగినట్లు వెల్లడించింది. గత ఏడాది సెప్టెంబరులో ఒకపర్యాయం 704.89 బిలియన్ డాలర్లమేర నిల్వలు పెరిగాయి. విదేశీ కరెన్సీ ఆస్తులపరంగాచూస్తే బంగారం, స్పెషల్‌డ్రాయింగ్ రైట్స్, ఐఎంఎఫ్ వద్ద భారత్ రిజర్వుస్థాయి వంటివి కీలకంగా పరిగణిస్తారు. ఆర్‌బిఐ విదేశీ కరెన్సీ ఆస్తులు 1.65 బిలియన్ డాలర్లుపెరిగి 559.43 బిలియన్ డాలర్లకు చేరాయి.

అదే అంతకుముందు వారంలో 557.78 బిలియన్ డాలర్లు మాత్రమే ఉన్నాయి. ఇక బంగారం పరంగాచూస్తే ఆర్బీఐ వద్ద పసిడి నిల్వలు 2.62 బిలియన్ డాలర్లు పెరిగి 110.36 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇక ఐఎంఎఫ్‌వద్ద ఆర్బీఐ స్పెషల్‌డ్రాయింగ్‌రైట్స్ స్థాయి 10 మిలియన్ డాలర్లుపెరిగి 18.74 బిలియన్ డాలర్లుగా ఉంది. అదే అంతకుముందు వారంలో అయితే 18.73 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు ఆర్బీఐ వెల్లడించింది. ఐఎంఎఫ్ వద్ద భారత్ రిజర్వుస్థాయి కూడా 96 మిలియన్ డాలర్లుపెరిగి 4.782 బిలియన్ డాలర్లుగా ఉంది. అంతకుముందు వారంలో అంటే డిసెంబరు 12తోముగిసిన వారంలో 4.686 బిలియన్ డాలర్లుగా నిలిచింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.